www.manatelangana.news

Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 67 | ఆదివారం | 27 ఆగస్టు, 2017

...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: **Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad**

పేజీలు: 12 + 16 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

దక్షిణ భారతదేశంలో అగ్రగామి అయిన లలితా జ్యువెల్లరి ఇప్పుడు మన తెలంగాణలో!



ప్రపంచంలోనే అతిపెద్ద షోరూంలలో ఒకటి! 1,30,000 చ॥అ
ముఖ్య అతిథులుగా విచ్చేసి షోరూంను ప్రారంభించువారు.

శ్రీమతి & శ్రీ కె.టి.రామారావు గారు

ఐటీ, పరిశ్రమలు, ఎన్ఆర్ఐ సంక్షేమం, జౌళి, గనులు, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి వర్యులు, తెలంగాణ.

లలితా జ్యువెల్లరి షోరూం
బ్రహ్మాండ ప్రారంభోత్సవం,
నేడు
ఉ॥10.00 గంటలకు
సోమాజిగూడ సర్కిల్,
హైదరాబాద్.
మనసారా ఆహ్వానం పలుకుతున్నాం!



వజ్రాభరణాల విభాగాన్ని ప్రారంభించువారు

శ్రీమతి & శ్రీ ఎ.సుభాస్కరణ్ గారు

చైర్మన్, లైకా గ్రూపు



Lalithaa™

హైదరాబాద్
తిరుపతి • విశాఖపట్నం
చెన్నై • మధురై • తిరుచ్చి • పుదుచ్చేరి • కుంభకోణం
బెంగళూరు • రామనాథపురం • కోయంబత్తూరు

ఇది పెద్దదే కావొచ్చు, కానీ దయచేసి చదవండి,
నగలు కొనే విధానంలో మార్పును తీసుకొస్తుంది!

మనసులోని నా మాట నేరుగా మీతోనే..

ఏడేళ్ల వయస్సులో భోజనానికి కూడా ఎన్నో కష్టాలు ఎదుర్కున్నా. పేదరికంలో పెరిగా. చదువుకునే స్తోమత కూడా లేనందువల్ల.. నెల్లూరులో నగలు తయారు చేసే కేంద్రంలో పన్నెండేళ్ల వయస్సులో కూలీగా చేరా. తనదాకా వస్తేకానీ.. తెలియదు!' అని చెబుతుంటారు. అది వందశాతం అక్షరసత్యమండి! పేదరికాన్ని అనుభవించినందువల్ల, ఈ రోజుకీ సగటు వ్యక్తి కష్టనష్టాలను అర్థం చేసుకోగలను. వేళకు తినక, అహర్నిశలు శ్రమిస్తూనే ఉన్నాం, ఎందుకు?.. రక్తపోటు, మధుమేహం వంటి సమస్యలను సైతం లెక్కచేయక శరీరానికి విశ్రాంతి లేకుండా పనిచేస్తున్నామే, ఎందుకు? నాలుగు కాసులు సంపాదించుకోవడానికేగా!.. ఆ డబ్బును పిచ్చుకగూడులా చేర్చుకోవడానికేగా? ఇంటి పనులు చూసుకుంటూ, పిల్లల్ని పెంచి పోషిస్తూ, ఉద్యోగానికి కూడా వెళ్తున్నారే మహిళలు- ఎందుకు? కుటుంబ ఆర్థిక పరిస్థితులను మెరుగు పరచడానికేగా?.. ఇలా కష్టపడి సంపాదించిన డబ్బును వృథా చేయవచ్చా? ఒక వస్తువును కొనుగోలు చేసేటప్పుడు దానికి న్యాయంగా చెల్లించాల్సిన డబ్బు కన్నా ఎక్కువగా చెల్లించడం తప్పేగా?

మనదేశంలో బంగారం ఓ అలంకార వస్తువు మాత్రమే కాదండి, అది ఇంటికే ఓ భద్రత! అవసరానికి ఆదుకునే ఆపద్బాంధవ పెట్టుబడి. మరి అలాంటి బంగారాన్ని సరైన ధరకు కొనడం ఎంత ముఖ్యం? నగల వ్యాపారిగా అడగడం లేదు, ప్రజల ఆశీస్సులతో ప్రస్తుతం ఓ మంచి స్థాయికి వచ్చిన తర్వాత కూడా రోజుకు 18గంటల పాటు శ్రమించే ఓ కుటుంబ యజమానిగా అడుగుతున్నా. అంతేకాదు.. నగల తయారీ రంగంలో తమిళనాడులోని వేల్స్ విశ్వవిద్యాలయం నుంచి ఇటీవల డాక్టరేట్‌ను అందుకున్నానన్న విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించాలని అనుకుంటున్నా.
10,700 కోట్ల రూపాయలు టర్నోవర్ చేసే, దక్షిణాదిలో ప్రముఖంగా భాసిల్లుతున్న ఓ నగల సంస్థ అధినేతగా, వ్యాపారవేత్తగా అడగడం లేదు. దయచేసి మీలో ఒకడిగా నన్ను భావించండి.
నగలను కొనేటప్పుడు అవసరానికి అధికంగా తరుగు చెల్లించవచ్చా? నగదును వృథా చేయవచ్చా? ఆభరణాల విక్రయాలు మాత్రమే మా లక్ష్యం కాదు.. మేం పొందే 1.25% మార్జిన్ ఆదాయంతో ఎంతో సంతోషపడుతున్నాం. సరైన అవగాహనతో ప్రజలు నగలు కొనాలన్నదే మా ఆశయం.

ఏదో ఆఫర్ ఇస్తున్నారు, నమ్మకంగా చెబుతున్నారు, చాలా రాయితీలు లభిస్తాయి.. అనుకుంటూ మీ దృష్టిని ఏమాత్రం మరల్చకండి. మనం ఎంత నగదు చెల్లిస్తున్నాం.. అందుకు ఎన్ని గ్రాముల బంగారం లభిస్తోంది, ఏ షోరూంలో గరిష్ఠంగా (NETT PHYSICAL WEIGHT OF GOLD IN GRAMS) బంగారం ఇస్తారనే విషయంపై మాత్రమే మీరు దృష్టి కేంద్రీకరించాలి. ప్రతి రూపాయికీ లెక్క చూసుకోండి. ఏమాత్రం తప్పులేదు.. ఎందుకంటే అది మీ డబ్బు! ఇంకో విషయం.. BIS 916 హాల్‌మార్క్ బంగారంతో తయారు చేసిన ఆభరణమేనా అని సరిచూసుకోండి. వజ్రాభరణమైతే అంతర్జాతీయ స్థాయి సర్టిఫికెట్ తప్పకుండా ఉండాలి. ఇది నగాజ్ ఆభరణం, ఇది కాస్టింగ్ ఆభరణం, నగ పనితనం ఎక్కువ అన్న లొసుగులను ఏమాత్రం నమ్మొద్దు. ఎంత పనితనం ఉన్నప్పటికీ మీరు పొందాల్సిన బంగారం బరువులో రాజీ పడొద్దు. ఇదివరకు ఎంతో శ్రమకోర్చిన నగదును అధిక ధరల నగల కోసం వృథా చేసింది చాలు. ఇకపై వాటికి స్వస్తి పలకండి. తయారీ ధరకే బంగారు నగలు, వజ్రాభరణాలు మరియు వెండి వస్తువులు అందజేస్తుండటం చాలా సంతోషంగా ఉంది. మార్కెట్‌లోనే తక్కువ ధరకే మావద్ద నగలు లభ్యమవుతాయి.

బేరమాడే అవసరం మీకు ఏమాత్రం ఉండనంత తక్కువ ధరలకే లభిస్తాయి. మీ సంతోషం కోసం 1 నుంచి 9% తరుగుతో బంగారు ఆభరణాలు (అతి తక్కువ ఆభరణాలకు 10 నుంచి 16% వరకు), దేశంలోనే అతితక్కువ ధరకు వజ్రాభరణాలు లలితా జ్యువెల్లరిలో అందజేస్తున్నాం. వేలాది, లక్షలాది రూపాయలు ఆదా చేయవచ్చు. అలా ఆదాచేసిన డబ్బు ఆదాయమేగా! (Money saved is money earned) నేను చెప్పే విషయాన్ని మీరలాగే పాటించాల్సిన అవసరం లేదు. నాలుగు షోరూంలలో పరిశీలించి ఆ తర్వాత లలితా జ్యువెల్లరికి వచ్చి చెక్ చేసుకోండి. మీరు చెల్లించే నగదుకు తగ్గ బరువులో బంగారాన్ని ఇంటికి తీసుకెళ్తున్నారా అని పరిశీలించండి. ఇకపై మీరు అవసరానికి మించి అధిక నగదు వెచ్చించి నగలు కొనాల్సిన అవసరం లేదు. మా 15వ షోరూంను మహోన్నతమైన తెలంగాణ ప్రజల మధ్య ప్రారంభిస్తుండటం ఆనందంగా ఉంది. తెలంగాణ ప్రజలకు మాత్రమే కాదండి, నా జీవితానికి కూడా ఇది సువర్ణరోజు. లలితా జ్యువెల్లరికి మిమ్మల్నిసాదరంగా ఆహ్వానిస్తున్నాం. మీ ఇల్లు బంగారం కావాలని మంచి మనసుతో లలితా జ్యువెల్లరి కుటుంబం తరపున మనసారా కోరుకుంటున్నాం.

6-3-883, SBR సౌక్, సోమాజిగూడ సర్కిల్,
హైదరాబాద్, తెలంగాణ. ఫోన్: 040 - 6748 6677.

డా॥ యం. కిరణ్‌కుమార్,
చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్, లలితా జ్యువెల్లరి మార్ట్ ప్రై. లిమిటెడ్.

ప్రజాభిప్రాయ సేకరణను బహిరంగ సభలా మార్చేశారు : పొన్నాల లక్ష్మయ్య



మన తెలంగాణ/ హైదరాబాద్ : ప్రాజెక్టులపై ప్రజాభిప్రాయ సేకరణను టిఆర్ఎస్ కార్యకర్తల బహిరంగ సభలా మార్చేశారని పిసిసి మాజీ అధ్యక్షులు, నీటి పారుదల శాఖ మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య ధ్వజమెత్తారు. ప్రభుత్వానికి దమ్ముంటే ప్రాజెక్టులపై బహిరంగ చర్చ పెట్టాలని సవాలు విసిరారు. పిసిసి అధికార ప్రతినిధి రమ్యతో కలిసి శనివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై సిద్ధిపేటలో జరుగుతున్న ప్రజాభిప్రాయ సేకరణను పోలీసుల నిర్భందం మధ్య నిర్వహించడాన్ని తీవ్రంగా ఖండించారు. మల్లన్నసాగర్ బాధితులు ప్రజాభిప్రాయ సేకరణ వేదిక వద్దకు ఉదయం 7:30 గంటలకు వస్తే, పోలీసులు వారిని భయభ్రాంతులకు గురి చేసి వెళ్ళగొట్టారని, గ్రామాల నుండి వచ్చిన టిఆర్ఎస్ కార్యకర్తలతో ఆ ప్రాంతాన్ని నింపేశారని ఆరోపించారు. మూడు ప్రాజెక్టులకు సంబంధించి ప్రజాభిప్రాయ సేకరణను కేవలం చిన్న హాలులో పెట్టారని, అలాగే ముంపు నిర్వాసితుల గ్రామాల్లో కాకుండా దూరంగా పట్టణ ప్రాంతాల్లో నిర్వహించడమేమిటని నిలదీశారు. వీటికి వేలాది మంది టిఆర్ఎస్ కార్యకర్తలను తరలించి, బాధితుల గొంతు వినపడకుండా చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి తెలంగాణలో ప్రాజెక్టులు కట్టేందుకు పూనుకుందని, కాని టిఆర్ఎస్ ప్రభుత్వం చట్ట విరుద్ధమైన చర్యలుకు పాల్పడుతూ ఇష్టమొచ్చినట్లు డిజైన్‌లు మారుస్తోందని పొన్నాల అన్నారు.

రేపు ఎడ్‌సెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్

మన తెలంగాణ/హైదరాబాద్ : బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్(బి.ఇడి) ప్రవేశాలకు నిర్వహించనున్న ఎడ్‌సెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్ రేపు విడుదల కానుంది. ఎడ్‌సెట్ ప్రవేశాల కమిటీ సోమవారం సమావేశమై, తేదీలు ఖరారు చేయనున్నట్లు ఉన్నత విద్యామండలి తెలిపింది.

బి.టెక్ అభ్యర్థులకూ బి.ఇడి అవకాశం

మ్యాథమెటిక్స్‌తో బి.టెక్, బిసిఎ పూర్తి చేసిన అభ్యర్థులకు మ్యాథమెటిక్స్ మెథడాలజీలో బి.ఇడిలో చేరేందుకు అవకాశం కల్పిస్తూ రాష్ట్ర విద్యాశాఖ స్పెషల్ సిఎస్ రంజీవ్ ఆర్ ఆచార్య ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులతో బి.టెక్ పూర్తి చేసిన అభ్యర్థులకు ఫిజిక్స్ మెథడాలజీలో బి.ఇడి చేసేందుకు కల్పిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పిజిటి భాషా పోస్టులకు పరీక్షలు

మన తెలంగాణ/హైదరాబాద్ : పిజిటి (తెలుగు,హిందీ,ఉర్దూ) భాషా పోస్టులకు ఈ నెల 27న మెయిన్ పరీక్ష నిర్వహించనున్నట్లు టిఎస్‌పిఎస్‌సి కార్యదర్శి ఎ.వాణిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ఈ నెల 28న పిజిటి(ఇంగ్లీష్) పరీక్షను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

డిఇఇసెట్ రెండవ విడత వెబ్ ఆప్షన్లు

మన తెలంగాణ/హైదరాబాద్ : డిఇఇసెట్ కౌన్సెలింగ్‌లో భాగంగా ఈ నెల 31 నుంచి సెప్టెంబర్ 6 వరకు రెండవ విడత వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పిస్తున్నట్లు కో కన్వీనర్ శేషుకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 12న సీట్లు కేటాయించనున్నట్లు వెల్లడించారు. సీటు పొందిన అభ్యర్థులు సెప్టెంబర్ 12 నుండి 14 వరకు ఫీజులు చెల్లించి, 15లోగా కళాశాలల్లో రిపోర్ట్ చేయాలని తెలిపారు.

వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ

మన తెలంగాణ/హైదరాబాద్: వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ముసాయిదా నిబంధనలపై వికలాంగుల సంఘాలు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు, తదితరులు తమ సలహాలను, సూచనలను ఇవ్వాలని రాష్ట్ర వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ కోరింది. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలను పరిగణలోకి తీసుకుని ఒక నిపుణుల కమిటీ ముసాయిదా నిబంధనలను రూపొందించిందని, వీటిపై సెప్టెంబర్ 7వ తేదీలోపు సలహాలను, సూచనలను cdwtghyd@gmail.com.లేదా మలక్‌పేటలోని వికలాంగుల, వృద్ధుల సంక్షేమ శాఖ, వికలాంగుల సంక్షేమ భవన్ 500036కు పోస్ట్ చేయాలని శనివారం ఒక ప్రకటనలో తెలిపింది.

ఆయుష్ హాస్పిటల్‌కు స్థలం కేటాయింపు

మన తెలంగాణ/హైదరాబాద్ : వికారాబాద్ జిల్లా అనంతగిరిలో సమగ్ర ఆయుష్ ఆసుపత్రికి ప్రభుత్వం స్థలం కేటాయించింది. వికారాబాద్‌లో తలపెట్టిన టి.బి ఆసుపత్రికి కేటాయించిన స్థలంలో కొంత భాగాన్ని ఆయుష్ ఆసుపత్రి కోసం కేటాయిస్తున్న శనివారం జారీ చేసిన ఉత్తర్వులో వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్ తివారీ తెలిపారు. గతంలో టి.బి. ఆసుపత్రి కోసం కేటాయించిన స్థలంలో నర్సింగ్ హాస్టల్‌ను 13575 చదరపు అడుగులు, మేల్ వార్డు 1లో 8081 చదరపు అడుగులు, మేల్ వార్డు 2 కోసం 2520 చదరపు అడుగుల్లో నిర్మించాలని తలపెట్టారు. ఈ స్థలంలో కేటాయించిన మేరకు రెండో దశలో కేటాయించిన స్థలంలో 50 పడకల ఆసుపత్రిని నిర్మించనున్నారు.

మరో స్వైన్‌ఫ్లూ నిర్ధారణ కేంద్రం

మన తెలంగాణ/హైదరాబాద్ : స్వైన్‌ఫ్లూ నిర్ధారణ కోసం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ (ఐపిఎం)లో ఉన్న కేంద్రానికి తోడు కోరంఠిలోని ఫీవర్ హాస్పిటల్‌లో మరో కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం ఐపిఎంకు ప్రతి రోజు సరాసరిగా 150 నుండి 200 వరకు స్వైన్‌ఫ్లూ అనుమానిత కేసుల నమూనాలు నిర్ధారిత పరీక్షల కోసం వస్తున్నాయి. దీనికి తోడు సరిహద్దు రాష్ట్రాలు కర్ణాటకలో 2805 , మహారాష్ట్రలో 4,011, తమిళనాడులో 2,969 స్వైన్‌ఫ్లూ కేసులు నమోదు కావడంతో దీని ప్రభావం రాష్ట్రంపై కూడా ఉంటుందని వైద్య ఆరోగ్య శాఖ భావిస్తోంది. ప్రస్తుతం ఐపిఎంలో సిబ్బంది, సౌకర్యం స్వైన్‌ఫ్లూ అనుమానిత కేసులు పెరిగితే తట్టుకునేంతగా లేదు. దీనిని దృష్టిలో ఉంచుకొని వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి తివారీ ఇటీవల ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించి పరిస్థితిని సమీక్షించినట్లు సమాచారం.

28న సిపిఎస్ రద్దుకు నిరసన ప్రదర్శన

మన తెలంగాణ/హైదరాబాద్ : కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సిపిఎస్)ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టాలని కోరుతూ ఈ నెల 28న హైదరాబాద్ జిల్లాలో నిరసన ప్రదర్శన నిర్వహించి, కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించనున్నట్లు ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ సమితి(జాక్టో) కన్వీనర్ ఆర్.శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

కోటి మందికి బతుకమ్మ చీరలు

- సిఎం కెసిఆర్ ఆదేశం
- పంపిణీకి అధికారుల ఏర్పాట్లు



మన తెలంగాణ / హైదరాబాద్ : బతుకమ్మ పండుగను పురస్కరించుకుని రాష్ట్రంలోని 18 ఏళ్లు నిండిన పేద మహిళలందరికీ చీరలను కానుకగా ఇవ్వనున్నట్లు ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు ప్రకటించారు. రాష్ట్రంలోని 1,04,57,610 మందికి సెప్టెంబర్ 18వ తేదీ నుండి మూడు రోజుల పాటు ఈ చీరలను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. ఆగస్టు 1వ తేదీ నాటికి ఆహార భద్రత కార్డుల అప్‌డేటెడ్ జాబితా ప్రకారం గ్రామ స్థాయిలో ఈ చీరల పంపిణీని చేపట్టనున్నారు. మున్సిపాలిటిల పరిధిలో మున్సిపల్ కమిషనర్లు, ఇతర ప్రాంతాలలో రెవెన్యూ అధికారులు ఈ పంపిణీ బాధ్యత వహిస్తారు. బతుకమ్మ కానుకగా చీరలు పంపిణీ చేసే కార్యక్రమంపై ముఖ్యమంత్రి కెసిఆర్ శుక్రవారం క్యాంపు కార్యాలయం ప్రగతి భవన్‌లో సమీక్ష నిర్వహించారు. పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్ పెద్ది సుదర్శన్‌రెడ్డి, ఎమ్‌డి సివి ఆనంద్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌పి సింగ్, చేనేత, టెక్స్‌టైల్‌శాఖ డైరెక్టర్ శైలజారమయ్యర్, జాయింట్ డైరెక్టర్ వి. పూర్ణ చందర్ రావు, జిఎం యాదగిరి, ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు ఎస్. నర్సింగ్‌రావు, శాంతకుమారి, స్మితా సభర్వాల్, రాజశేఖరరెడ్డి, భూపాలరెడ్డి ఈ సమీక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. చీరల పంపిణీ కార్యక్రమాన్ని స్వయంగా పర్యవేక్షించాల్సిందిగా కలెక్టర్లను కేసిఆర్ కోరారు. కుల మతాలకు అతీతంగా పేద మహిళలందరికీ చీరలను పంపిణీ చేయనున్నట్లు ముఖ్యమంత్రి కెసిఆర్ తెలిపారు. హ్యాండ్లూమ్, పవర్ లూమ్ కార్మికులకు ఉపాధి కల్పించడం కోసం వారు నేసిన చీరలనే కొనుగోలు చేసి పంపిణీకి సిద్ధం చేస్తున్నట్లు కెసిఆర్ చెప్పారు. మంత్రులు, ఎంపిలు, శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులు ఇతర ప్రజా ప్రతినిధులు పేద మహిళలందరికీ చీరలందించే విధంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిఎం పిలుపునిచ్చారు. పంపిణీ చేసే చీరల నాణ్యతను పరిశీలించిన ముఖ్యమంత్రి తన సంతృప్తిని వ్యక్తం చేశారు. చీరలను పంపిణీ చేసే విధానంపై అధికారులతో మాట్లాడి షెడ్యూల్ ఖరారు చేశారు. 'మరమగ్గాలు, చేనేత మగ్గాలను ఆధారం చేసుకుని బతికే కార్మికుల పరిస్థితి దారుణంగా ఉంది. పనిలేక కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడే దుస్థితి వచ్చింది. ఈ పరిస్థితిని మార్చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. అందుకే ఈ చీరలను చేనేత వర్గాల ద్వారానే కొనుగోలు చేస్తున్నది. తద్వారా కార్మికులకు ఉపాధి, పనికి హామీ, బతుకునకు భరోసా ఏర్పడుతోంది. చీరల పంపిణీ వల్ల మహిళల పండుగ సంబురం రెట్టింపు అవడంతో పాటు నేత కార్మికులు ఉపాధి పొంది సంతృప్తి పడుతున్నారు' అని ముఖ్యమంత్రి కెసిఆర్ పేర్కొన్నారు. రాష్ట్రంలో కోటి 4 లక్షలకు పైగా ఉన్న పేద మహిళలకు పంపిణీ చేయడానికి అంతే సంఖ్యలో చీరలు తయారు చేయడానికి ఇప్పటికే ఆర్డర్లు ఇచ్చారు. అవి తయారు అవుతున్నాయి. ఉత్పత్తి కేంద్రాల నుండి చీరలను సెప్టెంబర్ రెండో వారంలో జిల్లా కేంద్రాలకు చేరుకునే ఈ చీరలను సెప్టెంబర్ 18,19,20 తేదీల్లో మహిళలకు పంపిణీ చేస్తారు. సదరు మహిళలు పంపిణీ కేంద్రాలకు రాలేని పరిస్థితి ఉంటే ఆమె భర్త కానీ, తల్లి లేదా తండ్రిగానీ తీసుకువెళ్లవచ్చని, అయితే ఆమెకు సంబంధించిన ఆధార్ కార్డు, ఓటర్ గుర్తింపు కార్డు, మరేదైనా ఫోటో గుర్తింపు ఆధారాలను రేషన్ షాపుల్లో చూపించాల్సి ఉంటుంది. ఈ మొత్తం కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్లు పర్యవేక్షిస్తారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ మంత్రులు, ఎంపిలు, ఎంఎల్‌ఏలు, ఎంఎల్‌సిలు ఇతర ప్రజా ప్రతినిధులకు లేఖ రాయాలని మంత్రి కెటిఆర్‌ను సిఎం ఆదేశించారు. ఇందుకోసం ప్రత్యేక చొరవ తీసుకోవాలని ప్రభుత్వం కోరింది.

అధికారుల ద్వారా పంపిణీ..

సిఎం కెసిఆర్ శుక్రవారం చేసిన సమీక్ష మేరకు శనివారం నాడు సచివాలయం నుండి చీఫ్ సెక్రటరీ ఎస్‌పి సింగ్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామం యూనిట్‌గా బతుకమ్మ చీరలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పంపిణీ కోసం వచ్చే చీరలను భద్రపరిచేందుకు గోడౌన్లని సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో ప్రభుత్వ భవనాలు, గోడౌన్లకు సెప్టెంబర్ 17లోగా చేరుకోవాలన్నారు. గ్రామ స్థాయిలో జిల్లా కలెక్టర్ నియమించిన ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా పూర్తి పారదర్శకంగా పంపిణీ చేయించాలని ఆదేశించారు.

నేపాల్ ప్రధానితో గవర్నర్ భేటీ

మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం పాలనలో ఇ గవర్నెన్స్‌ను విరివిగా వాడుకుంటున్నదని గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ అన్నారు. హైదరాబాద్ పర్యటనకు వచ్చిన నేపాల్ ప్రధాన మంత్రి బహదూర్ దేవ్‌బాతో ఆయన శుక్రవారం సమావేశమై ద్వైపాక్షిక చర్చలు జరిపారు. దూబతో పాటు ఆయన సతీమణి డాక్టర్ అర్జు రాణ దేవ్‌బా, 40తో కూడిన ప్రతినిధులకు నగరంలోని తాజ్ ఫలక్‌నుమాలో శుక్రవారం గవర్నర్ విందు ఇచ్చారు. అనంతరం గవర్నర్, నేపాల్ ప్రధాని సమాచార సాంకేతిక పరిజ్ఞానం, ఇ గవర్నెన్స్ ప్రాజెక్టులపై చర్చించుకున్నారు. ఈ సందర్భంగా గవర్నర్ రాష్ట్ర ప్రభుత్వం ఐటి, ఇ గవర్నెన్స్‌ను అమలు చేస్తున్న తీరును వివరిస్తూ, మీ సేవా సిటీజన్స్ సర్వీసెస్, ఆర్‌టిఎ సర్వీసెస్, కార్డ్ (కంప్యూటర్ ఎయిడెడ్ రిజిస్ట్రేషన్ ఆఫ్ డాక్యుమెంట్స్) ప్రాజెక్ట్, మున్సిపల్ సేవల్లో వీటిని వినియోగిస్తున్నట్లు తెలిపారు. అంతే కాకుండా ప్రభుత్వం మిషన్ కాకతీయ, మిషన్ భగీరథతో పాటు పెద్ద సంఖ్యలో చెట్ల సంఖ్యను పెంచేందుకు ప్రతిష్టాత్మక హరితహారం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నదని తెలిపారు. ఈ సందర్భంగా గవర్నర్ సతీమణి విమలా నరసింహన్ నేపాల్ ప్రధానికి జ్ఞాపికను బహుకరించారు. గవర్నర్ విందులో ఉప ముఖ్యమంత్రులు కడియం శ్రీహరి, మహ్మద్ మహమూద్ అలీ, పార్లమెంటు సభ్యులు డాక్టర్ కె.కేశవరావు, కె.కవిత, ఎ.పి.జితేందర్ రెడ్డి, కె.విశ్వేశ్వర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డిజిపి, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అంతకుముందు నేపాల్ ప్రధానికి కవిత బతుకమ్మను బహుకరించారు. పర్యటన ముగించుకొని నేపాల్ ప్రధాని బహదూర్ దేవ్‌బా శనివారం తిరుగు ప్రయాణమయ్యారు. శంషాబాద్ రాజీవ్ గాంధి ఎయిర్‌పోర్ట్‌లో ఆయనకు ఉప ముఖ్యమంత్రి మహ్మద్ మహమూద్ అలీ వీడ్కోలు పలికారు. వీడ్కోలు తెలిపిన వారిలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.పి.సింగ్, డిజిపి అనురాగ్ శర్మ, ముఖ్య కార్యదర్శి అధర్ సిన్హాలున్నారు.

రోడ్ల అభివృద్ధి కోసం కొత్తగా స్టేట్ రోడ్ ఫండ్‌కు యోచన : తుమ్మల

మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్ర బడ్జెట్‌లో ప్రత్యేక నిధులతో స్టేట్ రోడ్ ఫండ్‌ను ఏర్పాటు చేసుకోవాలని పరిశీలిస్తున్నట్లు రోడ్లు భవనాలశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఇందుకు గాను ముఖ్యమంత్రి సూచన, ఆమోదంతో నిధులను సమీకరణ చేపడతామని ఆయన వెల్లడించారు. బంగారు తెలంగాణ రహదారుల అభివృద్ధి కార్యక్రమం (టిఆర్‌ఏకె)పై శనివారం ఎర్రమంజిల్‌లోని ఈఎన్‌సి కార్యాలయంలో ఆర్ అండ్ బి ముఖ్య కార్యదర్శి సునీల్ శర్మ, ఇఎన్‌సి రవీందర్ రావు, కన్సల్టెంట్ సంస్థ ప్రతినిధులు, ఇతర రాష్ట్ర అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో ఉన్న అన్ని ముఖ్య పట్టణాలను కలిపే విధంగా ఈ ప్రణాళిక రచించారు. ఈ ప్రణాళికలో భాగంగా ప్రస్తుతం ఉన్న హైదరాబాద్ నగరం ఔటర్ రింగ్‌రోడ్, రీజినల్ రింగ్‌రోడ్‌లకు అదనంగా మరో రెండు రింగ్ రోడ్లు, తెలంగాణ బంగారు వలయం, బంగారు మాల కారిడార్, ఉత్తర, దక్షిణ కారిడార్, తూర్పు పడమర కారిడార్‌తో పాటు మరిన్ని రేడియల్ రోడ్లులతో మొత్తం తెలంగాణ రాష్ట్రాన్ని అనుసంధానించే రోడ్లను నిర్మించాలని పతిపాదించారు. టిఆర్‌ఏకే పథకం ద్వారా 30 జిల్లాలలో 425 మండలాలకు రహదారి సౌకర్యం ఏర్పడుతుంది. అంతే కాకుండా ఈ రహదారులు 164 పారిశ్రామిక మండళ్లకు కనెక్టివిటిని కలిగిస్తాయని మంత్రి తుమ్మల వెల్లడించారు.

'హరితహారం' మరింత వేగవంతం

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్. పి సింగ్



మన తెలంగాణ/హైదరాబాద్: హరితహారం కార్యక్రమ వేగాన్ని మరింత పెంచాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్. పి సింగ్ ఆదేశించారు. వివిధ శాఖలు తమ లక్ష్యాలను చేరుకునేలా జిల్లా కలెక్టర్లు ప్రత్యేక సమీక్షలు నిర్వహించాలని సూచించారు. హరితహారం కార్యక్రమంపై సచివాలయంలో శనివారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. వ్యవసాయ శాఖకు సంబంధించి అధికారులతో ప్రత్యేకంగా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, రైతులు పెద్ద ఎత్తున మొక్కలు నాటేలా ప్రోత్సహించాలన్నారు. ఎక్సైజ్ శాఖ ద్వారా ఈత, ఖర్జూజ మొక్కలను విస్తృతంగా నాటాలన్నారు. మొక్కలు అంశంలో మున్సిపాలిటీలు ప్రత్యేక వ్యూహాతో ముందుకు సాగాలన్నారు. అవుటర్ రింగ్ రోడ్ వెంట ఎవెన్యూ ప్లాంటేషన్‌ను విస్తృతంగా చేపట్టాలని చెప్పారు. ఆర్‌జిఐ ఎయిర్‌పోర్ట్ నుంచి నగరానికి వచ్చే రహదారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. జిహెచ్‌ఎంసికి కేటాయించిన లక్ష్యాల మేరకు మొక్కలు నాటడానికి రెసిడెన్షియల్ అసోసియేషన్లు, స్వచ్ఛంద సంస్థలు, సామాజిక సంస్థలను భాగస్వామ్యం చేయాలని ఎస్.పి.సింగ్ సూచించారు. వీడియోకాన్ఫరెన్స్‌లో ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి కె.రామకృష్ణ, అటవీ శాఖ ముఖ్యకార్యదర్శి రజత్‌కుమార్, ఆర్‌అండ్‌బి శాఖ ముఖ్యకార్యదర్శి సునీల్‌శర్మ, పురపాలక శాఖ కార్యదర్శి నవీన్‌మిట్టల్, వ్యవసాయ శాఖ కార్యదర్శి పార్థసారథి, జిహెచ్‌ఎంసి కమిషనర్ బి.జనార్దన్ రెడ్డి, హెచ్‌ఎండిఎ కమిషనర్ చిరంజీవులు, ఎక్సైజ్ శాఖ కమిషనర్ చంద్రవదన్, పిసిసిఎఫ్ పి.కె.ఝాపాల్గొన్నారు.

జిఎస్‌టి పరిష్కారాల కోసం

ప్రతినెలా సమావేశం, ఆర్థిక శాఖ మంత్రి ఈటల వెల్లడి



మన తెలంగాణ / హైదరాబాద్ : జిఎస్‌టి అమలు మొదలైనా కూడా పన్నులు కట్టే వారిలో పలు అనుమానాలు ఉన్నాయని, వాటిని నివృత్తి చేయడానికి మరికొంత సమయం పడుతుందని ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ తెలిపారు. అమలు తీరులో వస్తున్న సమస్యలు, పరిష్కారాలపై ప్రతి నెలా వర్తక వ్యాపార సంఘాలతో సమావేశం అవుతామన్నారు. తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, పత్తి, మిర్చి, పసుపు వ్యాపారులు సచివాలయంలో మంత్రి ఈటల, వాణిజ్య పన్నులశాఖ ముఖ్య కార్యదర్శి సోమేష్ కుమార్‌లతో శనివారం సమావేశం అయ్యారు. పత్తి, మిర్చి పసుపు పంటలను వ్యాపారస్తులు రైతు నుండి కొనుగోలు చేసేటప్పుడు ట్యాక్స్ కట్టడం వల్ల పెట్టుబడి వ్యయం భారీగా పెరిగే అవకాశం ఉందని అలా కాకుండా తాము విక్రయించేటప్పుడు టాక్స్ కట్టుకునే వెసులుబాటు కల్పించాలని ట్రేడర్స్ కోరారు. అలాగే పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. జిఎస్‌టి కౌన్సిల్ సమావేశాలు నిరంతరం జరుగుతూనే ఉంటాయని,మీ సమస్యలను ప్రభుత్వం తరపున జిఎస్‌టి కౌన్సిల్‌కు నివేదిస్తామని ఈటల హామీ ఇచ్చారు. జిఎస్‌టిపై ఇంకా అవగాహన రాని వారికి కమర్షియల్ టాక్స్ శాఖ ద్వారా అన్ని జిల్లాల్లో మరో సారి అవగాహన కార్యక్రమాలను చేపట్టేందుకు తాము సిద్ధమేనని సోమేష్ కుమార్ తెలిపారు. అర్థం చేసుకోవడానికి తొలుత రెండు మూడు నెలలు ఇబ్బంది అవుతుందని, ఆ తర్వాత జిఎస్‌టి సులభం అవుతుందని సోమేష్ కుమార్ అభిప్రాయపడ్డారు.

ప్రభుత్వ ఉద్యోగులకు రాజీవ్ స్వగృహ ఇళ్లు


ఆన్‌లైన్ బుకింగ్‌కు ప్రత్యేక వెబ్‌సైట్ ఆవిష్కరించిన మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి



మన తెలంగాణ / హైదరాబాద్ : బండ్లగూడ, పోచారంలలో నిర్మించిన రాజీవ్ స్వగృహ అపార్ట్‌మెంట్ల ఇళ్లను ప్రభుత్వ ఉద్యోగులకు విక్రయించే ఆన్‌లైన్ బుకింగ్ ప్రత్యేక వెబ్‌సైట్‌ను గృహ నిర్మాణ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి సచివాలయంలో శనివారం ఆవిష్కరించారు. బండ్లగూడలో 2240 ఫ్లాట్లు , పోచారంలో 1470 ఫ్లాట్లు మొత్తం 3710 ఫ్లాట్ల విక్రయాల కోసం ఈ వెబ్‌సైట్‌ను రూపొందించారు. రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ ద్వారా నిర్మించిన ఈ నివాస సముదాయాలను రాయితీ ధరల్లోనే ప్రభుత్వ ఉద్యోగులకు అందిస్తోందని ఇంద్రకరణ్ రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. ముందు వచ్చిన వారికి ముందు ప్రాతిపదికన ఇళ్ల కేటాయింపు చేసుకునేలా వెబ్‌సైట్‌లోనే బుక్ చేసుకునే సదుపాయం కల్పించారు. నాగోల్ బండ్లగూడలో ఫ్లాట్ ఖరీదు చదరపు అడుగుకు రూ. 1900గాను, అలాగే పోచారంలో ఫ్లాట్ ఖరీదు చదరపు అడుగుకు రూ. 1700గాను నిర్ణయించినట్లు ఇంద్రకరణ్ రెడ్డి వెల్లడించారు. రూ. లక్ష చెల్లించి ఇళ్లతో పాటు పార్కింగ్ స్థలాలను కూడా కొనుగోలు దారులు బుక్ చేసుకోవాలని మంత్రి సూచించారు.టిఎస్ స్వగృహ సిజిజి ఇన్ వెబ్‌సైట్‌కు లాగిన్ అయి ఈ రెండు టౌన్‌షిప్‌ల వివరాలను వినియోగదారులు తెలుసుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ శ్రీనివాస్ గౌడ్, గృహ నిర్మాణశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ చిత్రా రామచంద్రన్, సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ డైరెక్టర్ రాజేంద్ర నిమ్జే, హౌజింగ్ కార్పొరేషన్ సిఈ సత్యమూర్తి, టిఎస్‌జివోస్ అధ్యక్షులు కారెం రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

మరింత నాణ్యంగా దూర విద్య

అంబేద్కర్ వర్సిటీ వ్యవస్థాపక దినోత్సవంలో ప్రొ.నాగేశ్వర్‌రావు



మన తెలంగాణ/ హైదరాబాద్ : పోటీ ప్రపంచంలో విద్యార్థి నిలదొక్కుకునేలా మరింత నాణ్యమైన విద్యావిధానాన్ని అందించాల్సిన అవసరం ఉందని, ఆ దిశగా దేశంలోని సార్వత్రిక విశ్వవిద్యాలయాలు పనిచేస్తున్నాయని ఉత్తరాఖండ్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ నాగేశ్వర్ పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ 36వ వ్యవస్థాపక దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని 'లెర్నర్ సెంట్రిక్ ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్ సిస్టమ్‌ట్రెండ్స్ అండ్ కన్సర్న్స్' అనే అంశంపై కీలకోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దూరవిద్యా విధానంలో నాణ్యమైన మెటీరియల్ విద్యార్థులకు చాలా ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించే కోర్సులపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వర్సిటీ విసి ప్రొ.కె.సీతారామారావు మాట్లాడుతూ, రెగ్యులర్ విద్యా విధానంలో అభ్యసించిన విద్యార్థులకు ఏమాత్రం తీసిపోకుండా, పోటీ ప్రపంచంలో నిలదొక్కుకునేలా తయారు చేయడమే తమ ముందున్న లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ సి.వెంకటయ్య, అకడమిక్ ఇంఛార్జ్ డైరెక్టర్ కె.సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ స్మారకోపన్యాసాల సంపుటి పుస్తకాన్ని ఆవిష్కరించారు.

ఒబిసి వర్గీకరణకు అవసరమైతే గడువు పెంపు : బండారు



మన తెలంగాణ/హైదరాబాద్: బిసి వర్గీకరణకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన 12 వారాల గడువు సరిపోకపోతే, మరింత గడువును పెంచే అవకాశాన్ని కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తుందని కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి బండారు దత్తాత్రేయ తెలిపారు. ఒబిసిలను జాతీయ స్థాయిలో వర్గీకరించాలనే కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం పట్ల బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో బిసి ప్రతినిధుల బృందం హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రతినిధి బృందం హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో శనివారం మంత్రి బండారు దత్తాత్రేయ, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మణ్‌ను కలిసి అభినందించారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ రిజర్వేషన్ల ఫలాలు అట్టడుగువర్గాలకు దక్కేలా మోడి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నదని, క్రీమి లేయర్‌తో బిసిలకు నష్టం జరగకుండా వారి వార్షిక ఆదాయ పరిమితిని రూ.8 లక్షలకు పెంచిందని వివరించారు. డాక్టర్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ బిసిలు ఐక్యంగా ఉండి తమ హక్కులను సాధించుకోవాలన్నారు. జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం బిసి రిజర్వేషన్లను 27 నుంచి 50 శాతం వరకు పెంచాలని కోరారు. క్రిమిలేయర్‌ను పూర్తిగాఎత్తివేయాలన్నారు. కేంద్రంలో బిసి ప్రత్యేక మంత్రిత్వ శాఖను, చట్టసభలలో 50 శాతం రాజకీయ రిజర్వేషన్లను కల్పించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిసి ప్రతినిధి బృందం కనకల శ్యామ్‌కురుమ, తాటికొండ విక్రంగౌడ్, కుల్కచర్ల శ్రీనివాస్‌ముదిరాజ్, సింగం నాగేశ్, మహేందర్‌గౌడ్, జాజుల లింగం తదితరులు పాల్గొన్నారు.

Mana Telangana

హైదరాబాద్
సంపుటి 6
సంచిక: 67
27, ఆదివారం
ఆగస్టు, 2017

ఆదివారం
మన తెలంగాణ
www.manatelangana.news
అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad | పేజీలు: 12 + 16 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

రెండు రోజులపాటు
భారీ వర్షాలు
9

కశ్మీర్‌లో ఆత్మాహుతిదాడి
8 మంది భద్రతా సిబ్బంది మృతి, ముగ్గురు ఉగ్రవాదుల హతం
7

జలదాడిలో విలవిల

భారీ వర్షానికి హైదరాబాద్ నగరంలో తెగిన చెరువులు, మునిగిన కాలనీలు, నదులైన ప్రధాన రహదారులు

హడలెత్తించిన నురుగు కాలువ, 10 సెంటీమీటర్ల కుండపోత, జిల్లాలలోనూ కురిసిన వాన



హైదరాబాద్ కూకట్‌పల్లిలోని పరికి చెరువు నుంచి ప్రవహిస్తున్న అంతుచిక్కని తెల్లని నురుగు



జలవలయంలో ఒక కాలనీ

9లో

ప్రధాని పార్టీకి కాదు



బాబాను జైలుకు తరలిస్తున్న దృశ్యం

భీకర విధ్వంసంలో ఒక దృశ్యం

● డేరా అల్లర్లను అదుపుచేయలేకపోయినందుకు మోడీని తప్పుపట్టిన పంజాబ్,హర్యానా హైకోర్టు ● హర్యానా ప్రభుత్వాన్ని వెనకేసుకొస్తున్నారంటూ అసంతృప్తి ● ఆయన వైఖరి ప్రధాని హోదాకు తగినట్టులేదని వ్యాఖ్య ● సిఎం ఖట్టర్‌కూ అక్షింతలు



చండీగఢ్ : 'డేరా సచ్చా సౌదా అధినేత గుర్మీత్ రామ్‌రహీంను దోషిగా ఖరారు చేసిన తరువాత హర్యానాలో జరిగిన హింసాత్మక ఘటనలపై పంజాబ్, హర్యానా హైకోర్టు తీవ్రంగా స్పందించింది. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాల నిమ్మకునీరెత్తినట్లుగా ఉన్న వ్యవహార శైలిపై మండిపడింది. 'ప్రధాని అంటే ఈ దేశానికి ప్రధాని, అంతే కానీ బిజెపికి కాదు' అని ధర్మాసనం తీవ్రపదజాలంతో కేంద్రం వైఖరిని నేరుగా , బిజెపి రాష్ట్ర ప్రభుత్వాన్ని వెనుకేసుకువస్తున్న ప్రధాని తీరును పరోక్షంగా తప్పుపట్టింది. గుర్మీత్ మద్దతుదార్లతో రెండు రాష్ట్రాలలో కల్లోలం చెలరేగుతూ ఉంటే ఏం చేస్తున్నట్లు? అని కేంద్రం, రాష్ట్రంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి ఎస్ఎస్ సెరోన్, న్యాయమూర్తులు సూర్యకాంత్, అవ్నీష్ జింఘాన్‌తో కూడిన విస్తృత ధర్మాసనం ప్రత్యేకించి కేంద్రం తీరును ఎండగట్టింది. రాష్ట్రంలో దిగజారిన శాంతిభద్రతల పరిస్థితిపై దాఖలు అయిన ప్రజావ్యాజ్యం విచారణ సందర్భంగా రాష్ట్ర హైకోర్టు వ్యాఖ్యలు వెలువడ్డాయి.

31 మందికి పైగా తరువాయి 6లో

బాబా గుర్మీత్ అనుచరుల వీరంగానికి
37 మంది దుర్మరణం

● కోర్టు ఆయనను దోషిగా తేల్చడంతో రెచ్చిపోయి తీవ్ర హింసకు, విధ్వంసానికి పాల్పడిన అనుచరగణం ● నాలుగు రాష్ట్రాలకు పాకిన అశాంతి 8

డేరా ఘటనలో హర్యానా సిఎం వైఫల్యం, ఆయనను తొలగించాలి: సురవరం 6

సిద్దిపేట ప్రజాభిప్రాయ సేకరణలో మల్లన్నసాగర్ నిర్వాసితుల నిరసన, అరెస్టులు



రాజ్‌భవన్‌లో నేపాల్ ప్రధాని బహదూర్‌తో గవర్నర్ 2

మూడు నెలలూ అక్కడే

భూ సర్వే పూర్తయ్యే వరకు హైదరాబాద్ రావొద్దు

సిట్టింగులందరికీ మళ్ళీ టిక్కెట్లు, పార్టీ ఎంఎల్‌ఎలతో కెసిఆర్




మన తెలంగాణ/ హైదరాబాద్ : గ్రామాల్లో భూ సర్వే జరిగే మూడు నెలల పాటు హైదరాబాద్‌కు రావొద్దని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు టిఆర్ఎస్ శాసనసభ్యులను ఆదేశించారు. తెలంగాణ భవన్‌లో టిఆర్ఎస్ శాసనసభాపక్ష సమావేశం శనివారం జరిగింది. టిఆర్ఎస్ ఎంపి, ఎంఎల్ఏలు, నామినేటెడ్ పోస్టుల చైర్మన్‌లు పాల్గొన్న ఈ సమావేశంలో సిఎం కెసిఆర్ సెప్టెంబర్ 1 వ తేదీ నుండి డిసెంబర్ నెలాఖరు వరకు జరిగే రైతు సమన్వయ సమితిల ఏర్పాటు, భూ రికార్డుల ప్రక్షాళన కార్యక్రమాన్ని వివరించారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం సిఎం మాట్లాడుతూ ఈ కార్యక్రమం అత్యంత కీలకమైనదని, ఎంఎల్ఏలు అత్యంత శ్రద్ధతో నిర్వహించాలని సూచించారు. కాబట్టి ఈ కార్యక్రమం పూర్తయ్యేంత వరకు గ్రామాల్లోనే ఉండాలని, హైదరాబాద్‌కు రావొద్దని సూచించారు. రాజకీయాలకు అతీతంగా గ్రామస్థాయి రైతు సమన్వయ సమితి సభ్యులను ఎంపిక చేయాలని తరువాయి 6లో

కుంచెపోటు



నయాదేశభక్తులు, గోరక్షకుల కంటే ఈ బాబా భక్తులే పవర్‌ఫుల్‌గా ఉన్నారు!

"విద్య లక్ష్యం సత్యాన్ని ప్రేమించడమే కాదు, సత్యాన్ని ఆచరించడం కూడా.
- డా॥సర్వేపల్లి రాధాకృష్ణన్"



కట్టార్ వైఫల్యానికి భారీ మూల్యం

సంపాదకీయం

డేరా సచ్చా సౌదా 'గాడ్‌మాన్' గుర్మీత్ రాం రహీం సింగ్‌ను మానభంగం కేసుల్లో ముద్దాయి అని హర్యానాలోని పంచకులలో సిబిఐ కోర్టు తీర్పు చెప్పగానే అక్కడ వేలాదిగా చేరిన భక్తులు పెద్ద ఎత్తున హింసకు, దహనాలకు పాల్పడిన ఘటనల్లో 32 మంది మృతిచెందటం, 250మంది వరకు గాయపడటం అత్యంత విషాద సంఘటన. శాంతి—భద్రతల నిర్వహణలో హర్యానా ముఖ్యమంత్రి మనోహర్ లాల్ కట్టార్ పూర్తి వైఫల్యం పర్యవసానం. సామాన్య ప్రజల్లోనేగాక రాజకీయవేత్తలు, పరిపాలనా వ్యవస్థల్లో సైతం భక్తకోటి కలిగిఉన్న ఒక స్వయం ప్రకటిత బాబా కేసులో తీర్పు వెలువడనున్నప్పుడు ఏ ప్రభుత్వమైనా సరిహద్దు రాష్ట్రాలనుంచి, సొంత రాష్ట్రంనుంచి రాకపోకలను, రవాణా సౌకర్యాలను నిలుపు చేయటం, ఎక్కడికక్కడ 144 సెక్షన్ విధించి జనాలు గుమిగూడకుండా నిరోధించడం వగైరా ముందు జాగ్రత్తలు తీసుకుంటుంది. కట్టార్ ప్రభుత్వం పోలీసులను అర్ధసైనిక దళాలను పెద్దసంఖ్యలో దించింది గాని జనాల రాకపోకలను నిషేధించలేదు. చండీఘర్‌కు 260 కిలోమీటర్లలోని సీర్సా నుంచి రాం రహీం దాదాపు 200 వాహనాల బారుతో పంచకుల కోర్టుకు రావటమే ప్రభుత్వ ఉదాసీనతకు నిదర్శనం. కోర్టు అతన్ని దోషిగా నిర్ణయించి, శిక్షను సోమవారం ఖరారు చేస్తానని ప్రకటించగానే అతని అనుయాయులు హింసకు పాల్పడటంతో అతన్ని హెలికాప్టర్‌లో రోహతక్‌లోని జైలుకు తీసుకెళ్లారు. అప్పటి వరకు ఉన్న 'జడ్' కేటగిరి భద్రత రద్దయింది. పంచకులలో ప్రాణ, ఆస్తినష్టం భారీగా జరగ్గా, పొరుగు రాష్ట్రాలైన పంజాబ్, ఢిల్లీలతో పాటు రాజస్థాన్‌లో సైతం చెదురుమదురు హింసాత్మక ఘటనలు జరిగాయి.

రాం రహీం సింగ్ పట్ల ముఖ్యమంత్రి కట్టార్‌కున్న భక్తిప్రపత్తులే కఠినంగా వ్యవహరించకుండా బహుశా ఆయన చేతులు కట్టేసి ఉంటాయి. 2014 ఎన్నికల్లో బిజెపి గెలుపొందిన తదుపరి ముఖ్యమంత్రిగా ఎంపికైన తొలిటరం లెజిస్లేటర్ కట్టార్ పదవీ స్వీకారం అనంతరం అనేకమంది లెజిస్లేటర్లు, మంత్రుల పరివారంతో సీర్సాలోని దేరాకు వెళ్లి బాబా ఆశీస్సులు పొందారు. ఆ ఎన్నికల్లో బాబా బిజెపిని బహిరంగంగా బలపరిచారు. కట్టార్ అసమర్థుడని ఇంతకు ముందు రెండుసార్లు రుజువైంది. 2014లో హిసార్‌లో రాంఫాల్ అనే బాబాను అరెస్టు చేయటానికి పోలీసులు వెళ్లిన సందర్భంలో ఐదుగురు మహిళలు, ఒక పసిబిడ్డ మృతి చెందారు. గత సంవత్సరం రిజర్వేషన్‌లకై జాట్‌ల హింసాత్మక నిరసన సందర్భంలో 30మంది చనిపోయారు. శనివారం రాం రహీం సింగ్ అనుయాయుల అల్లర్లలో సంభవించిన ఆస్తినష్టానికి డేరా ఆస్తులు అమ్మి పరిహారం చెల్లించాలని పంజాబ్—హర్యానా హైకోర్టు ఆదేశించినట్లు మీడియా ప్రచారం చేస్తున్నది. కాగా మనోహర్ లాల్ కట్టార్ ప్రభుత్వం డేరా సచ్చా సౌదాకు ''రాజకీయంగా లొంగిపోయిందని'' హైకోర్టు విమర్శించింది. ''ఓటు బ్యాంకులను బుజ్జగించటానికి ఇది రాజకీయ లొంగుబాటు. వారంతా బయటనుంచి వచ్చారు. వారినెందుకు అనుమతించారు'' అని త్రిసభ్య ధర్మాసనం ప్రశ్నించింది. హింసవెనుక సంఘ వ్యతిరేక శక్తులు, దుండగులు ఉన్నట్లు ముఖ్యమంత్రి ఒక్క రోజులోనే తెలుసుకుంటే, వారి ప్రవేశాన్ని గత 7రోజులుగా ఎందుకు నిరోధించలేకపోయారు అని ప్రశ్నించింది. ఇది కట్టార్ ప్రభుత్వంపై అభిశంసన.

బాబాలు రాజకీయ వేత్తలు, ఇతర ప్రముఖుల అండతో పెరిగి పెద్దవారుకావటం, రాజకీయ వేత్తలు జనం ఓట్ల కోసం బాబాలను వాడుకోవటం, ఈ క్రమంలో సామాన్యులు బలికావటం మనదేశంలో కొత్తేమీ కాదు. బాబాలు, మాతలు మతాన్ని ఉపయోగించుకుని జనం అజ్ఞానంపై వ్యాపారం చేస్తున్నారు. గతంలో రాజనీష్, చంద్రస్వామి వగైరాలు, ఈ కాలంలో రాం రహీంసింగ్, ఆసారం బాపు, రాంపాల్, రాధేమా ఈ కోవకు చెందినవారు. ఆసారం మానభంగం తదితర నేరాలకు జైలు శిక్ష అనుభవిస్తున్నాడు. రాంపాల్ జైల్లో ఉన్నాడు. రాధేమా నకిలీగా తేలింది. అయినా ప్రజల్లో హేతుబద్ధమైన ఆలోచన, ప్రశ్నించే తత్వం, తమ జీవితాలకు తామే నిర్దేశకులమనే భావన పెంపొందనంతవరకు కొత్తబాబాలు పుడుతూనే ఉంటారు, రాజకీయ పార్టీలు వారిని ఉపయోగించుకుంటూనే ఉంటాయి, ప్రజలు మోసపోతూనే ఉంటారు. దేశ అభివృద్ధి గూర్చి ఎన్ని కబుర్లు చెప్పుకున్నా, పాలకులు సమాజాన్ని అజ్ఞానం, మూఢవిశ్వాసాల్లో ఉంచిన పర్యవసానమే ఇది.

డేరా అదుపులో వైఫల్యం


చూపు

బిజెపిని అధికారంలోకి తెచ్చింది డేరాల మద్దతే. ఇప్పుడు వారిమీదే విరుచుకు పడడం ఆ మద్దతు కొనసాగక పోవడం వల్లనే అనే అనుమానం బలపడుతోంది. రేప్ ఆరోపణపై గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ ను నేరస్థుని గా నిర్ధారించడం తో పంజాబ్, హర్యానాలలో హింసాకాండ యధేచ్ఛగా వ్యాపించిన తరువాత ఈ విధ్వంసం సాక్షులు అడగాల్సిన ప్రశ్నలు ఆ కేసుకి మించినవి. వారి పట్ల ప్రభుత్వం అలసత్వం ఎందుకు ప్రదర్శించింది. అంత వేగంగా అల్లర్లు ఎలా వ్యాపించాయి. వాటి మూలాలు ఎక్కడ ఉన్నా యి.

కొత్తగా వ్యక్తి పూజ తెగలు పుట్టుకు రావడం నేటి సమాజంలో అబ్బుర పరచే నూతన పరిణామం. అవి సమాజంలో అణగ ద్రొక్కబడిన ప్రజలకు ఆశ్రయమివ్వడం సర్వ సాధారణంగా జరుగుతోంది. అవి వారిలో తమ భవిష్యత్తు పట్ల కొత్తకొత్త కలలను అవిష్కరిస్తాయి. తీవ్రవాదుల విషయంలో వలె కాకుండా వీరు ఒక మహావ్యక్తి తన బోధనలతో గొప్ప మార్పు తెస్తారని నమ్ముతారు. ఉద్యమాలు, విప్లవాల మార్గం కాదు వారిది. సమాంతరంగా పనిచేస్తూ, ఏదో మహిమ జరుగుతుందని ఆశిస్తూ, ఆ మహిమను అందరూ పంచు కోవాలని ఆ తెగ వారు సూత్రీకరిస్తారు. విశ్వాసులకి లెక్కలేనన్ని దివ్య కానుకలు లభిస్తాయని వారు నమ్ముతారు. ఈ తెగలు జన సమూహాలపై పని చేసే తీరు వర్ణనాతీతం. ఏసు క్రీస్తు మళ్లీ వస్తాడని నమ్మే తెగలు ఇలాంటివే.ఆ తరుణంలో ఆకాశం తెరుచుకొని ఫ్రిజ్ , తదితర విలువైన కానుకలను వర్షిస్తుందని వారు గాఢంగా నమ్ముతారు.

అటువంటి వినూత్న వ్యక్తిపూజ తెగకు సింగ్ సారథ్యంలోని డేరా సచ్చా సౌదా అద్భుతమైన ఉదాహరణ. అందరు ఆథ్యాత్మిక గురువుల వలెనే సింగ్ కూడా సాంకేతిక చాకచక్యంగల మహా జ్ఞాని. అతని అనుయాయులు నిమ్న కులాలనుంచి, అట్టడుగు తరగతుల నుంచి వస్తారు. తమ గురువు భవిష్యత్‌లోని మరింత సామాజిక సమానత్వంగల కాలానికి చెందిన వాడని వారు నమ్ముతారు. సింగ్ ఒక సాంకేతిక విజ్ఞాని అయిన మత ప్రవక్త. భక్తుల ఊహల్లో ఆయన భావనలు రాబోయే స్వర్ణయుగాన్ని వేగవంతం చేసేవిగా ఉంటాయి. ఆయన భక్తుల గౌరవాన్ని అమితంగా పొందుతారు. విశిష్టమైన కార్యాచరణల ద్వారా ఆయన నూతన రికార్డులను నెలకొల్పుతూ ప్రజల దృష్టిని ఆకర్షిస్తారు. గుర్మీత్ రామ్‌రహీమ్‌సింగ్ అత్యంత భారీ రక్తదాన శిబిరాన్ని నిర్వహించి గిన్నీస్ రికార్డుల పుస్తకంలోకి ఎక్కారు. అంతేకాక ఆ పుస్తకంలోకి ఎక్కిన మొదటి మూడు భారీ రక్తదాన శిబిరాలు ఆయన డేరా సచ్చా సౌదా తెగకు చెందినవే. ఆ తెగ సంస్కరణ స్వభావం కలది. అందరూ బాగుండాలి అనే తత్వం కలది.ఆ తత్వంలోనే ఈ తెగ సందేశం ఇమిడి ఉంది.

సమాజ సంస్కరణ చర్యలు కూడా ఆ తెగ భారీ ఎత్తున చేపట్టింది. సెక్స్ వర్కర్లకు సామూహిక వివాహాలు జరిపించడం వంటి అనూహ్య మైన సంస్కరణల బాటలో ఆ తెగ నడుస్తోంది. ఇది ఏ ప్రభుత్వమూ చట్టాల ద్వారా, రాజకీయ సంకల్పం ద్వారా ఆచరించలేని మహోన్నత ఆదర్శం. ఈ తెగ శిబిరాలలో భక్తులకిచ్చే కానుకలు అనూహ్యంగా ఉంటాయి. ప్రభుత్వాలు సంక్షేమ కార్యక్రమాల పేర పంచే మొత్తాలకు ఏ మాత్రం పోలికలేదు. ఉదాహరణకు వివాహం జరిపిన ప్రతి ఒక్క జంటకు లక్షన్నర రూపాయల చెక్కులు పెళ్లిళ్లు జరిపిన శిబిరాలలో ఇచ్చారు. ప్రభుత్వాలు కొద్దిమొత్తం పంచి ఘనం గా



చాటింపు చేసుకునే పద్ధతికి ఇది పూర్తిగా విరుద్ధం. శాస్త్రీయ దృక్పథానికి, పరిశుభ్రతకు కూడా సింగ్ అత్యంత ప్రాముఖ్యం ఇస్తారు. తన కార్యకర్తలందరకూ వైద్యపరీక్షలు నిర్వహించి పూర్ణారోగ్యంతో ఉన్నట్లు నిర్ధారించుకుంటారు. అంతగా పేరులేని సీర్సా పట్టణంలో ఇంత ఆశ్చర్యకరమైన తెగ పుట్టుకరావడం మహా అద్భుతంగా చెప్పుకోవచ్చు. చిన్న ఆధ్యాత్మిక బృందం చిన్నచిన్న ఆశ్రమాలు నెలకొల్పిన పది సంవత్సరాలకు ప్రపంచవ్యాప్తంగా ప్రాముఖ్యత సంతరించుకుంది. వాటికి గల జనబాహుళ్యం మద్దతు ప్రభుత్వాల కు తెలియంది కాదు.

ఆర్‌ఎస్‌ఎస్ వంటి సంస్థలకు కూడా సాధ్యం కాని విధంగా భారీ ఎత్తున సభ్యత్వ కార్యక్రమాలను ఈ తెగ నిర్వహించింది. ఈ తెగ నిస్సందేహంగా ప్రభుత్వానికి సవాలు విసిరేదే. ఎందుకంటే అత్యంత సమర్థంగా సమూహాలను అదుపు చేసే చాకచక్యం దాని సొంతం. ఇంచుమించు సమాంతర ప్రభుత్వాన్ని ఈ తెగ నడుపుతోందని చెప్పవచ్చు. సంఘీభావం, న్యాయకల్పన విషయాలలో శ్రేయోరాజ్య పోకడలు గల తెగ ఇది. అద్భుతచర్యలు, అభివృద్ధి కలిసి సాగుతాయ ని వారు నమ్ముతారు. ఆధ్యాత్మికత, సమానత్వం కలిసి అద్భుత సంఘీభావాన్ని నిజం చేస్తాయని ఎంతో ఉద్వేగంతో సింగ్ ప్రవచిస్తారు. ఆయన పాప్ గాయకుడు, సినీ నటుడు కూడా.

వీరి సంఘసేవా కార్యక్రమాలు అంతగా మీడియాలో కనపడవు. ఈ తెగ వ్యాప్తి చెందిన అనేక చిన్నచిన్న పట్టణాల్లో ఆ కార్యక్రమాలు సమర్థంగా సాగాయి. ఇది ఆ తెగ నేత అయిన గుర్మీత్ రామ్‌రహీమ్ సింగ్ నాయకత్వ పటిమకు ఉదాహరణ. అయితే విచారకర పరిస్థితులలో ఆయన రేప్ కేసులో దోషిగా తేలారు. ఎంఎస్‌జి—1, ఎంఎస్‌జి—2 అనే చిత్రాలను నిర్మించిన సింగ్ తాను రేప్ కేసులో దోషిగా తేలడంపై ఎంఎస్‌జి—3 చిత్రాన్ని నిర్మిస్తారా? మహిమల కోసం, అద్భుతాల కోసం ఎదురుచూసే డేరా సచ్చా సౌధా అనుయాయులు అందుకోసం ఎదురుచూస్తున్నారని చెప్పవచ్చు.

ఈ తెగకు ఉన్న ప్రజా మద్దతు దృష్ట్యా గట్టి భద్రతాచర్యలు ముందే తీసుకోవడంలో ప్రభుత్వం విఫలం చెందడం వల్లనే అంతటి భారీ ఎత్తున హింసాకాండ సంభవించిందని చెప్పక తప్పదు. హర్యానాలో మనోహర్‌లాల్ ఖత్తార్ ప్రభుత్వం అల్లర్ల సమయంలో చేష్టలుడిగినట్లు ప్రవర్తించడం మామూలైంది. సీర్సాలోని తేరా సచ్చా సౌదా అనుయాయులు పంచకుల విఐపి పట్టణాన్ని సమూలంగా ముట్టడించి దాడులు జరపకుండా చర్యలు తీసుకోవడంలో మనోహర్ లాల్ ప్రభుత్వం ఎందుకు విఫలమైంది. పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలలో డేరా తెగ బిజెపి వెంట నిలబడలేదని వినపడుతోంది. అంతేకాకుండా బలమైన వర్గాలను ఒకటివెంట ఒకటిగా చెరిపివేస్తున్న చర్యలలో భాగంగానే గుర్మీత్‌సింగ్‌ను వేలెత్తే రాజకీయం నడుస్తోందని కూడా అంటున్నారు. దేరా అల్లర్ల అదుపులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది.

* ఎస్.ఎస్

అనూహ్య ఒత్తిడిలో న్యాయమూర్తులు !



చందుపట్ల రమణ కుమార్ రెడ్డి,
న్యాయవాది,9440449392

ధర్మో రక్షతి రక్షితః అనేది నానుడి, ధర్మదేవతకు ప్రతిరూపంగా భావించే న్యాయమూర్తులు నేడు అనూహ్యమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. వేగంగా కేసులు పరిష్కరించాలంటూ ఒకవైపు చట్టాల మీద ప్రజలకు అవగాహన కల్పించాలంటూ, జనాలను రాజీ మార్గం వైపు నడిపించాలంటూ మరోవైపు చెప్పనలవికాని ఒత్తిడితో వారు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. కేసులను త్వరితగతిలో పరిష్కరించడం, చట్టాలపైన అవగాహన కలిగించడం న్యాయస్థానాలకు మాత్రమే పరిమితమైన విధా? ప్రభుత్వాలకు, పోలీస్ వ్యవస్థకు, ఇతర విభాగాల వారికి బాధ్యత లేదా? ప్రతి 10 లక్షల జనాభాకు సరాసరి న్యాయమూర్తుల సంఖ్య ప్రపంచవ్యాప్తంగా 60కి పైగా ఉంటె, పాశ్చాత్య దేశాల్లో 100 పైగా ఉన్నది. మరి మనదేశంలో ఆ సంఖ్య 18కి మించడం లేదు, ప్రభుత్వ న్యాయవాదులు, ప్రాసిక్యూషన్ న్యాయవాదుల నియామకాల్లో ఎక్కడవేసిన గొంగళి అక్కడనే ఉన్నది, సగం కోర్టులలో ప్రభుత్వ న్యాయవాదులే లేరు సంవత్సరాల తరబడి ఇన్‌చార్జ్‌లతో, నామినేటెడ్ పోస్టులతో నెట్టుకొస్తున్నారు, సాక్షులకు సమన్లు తామీలు చేయడానికి, నిందితులకు నోటీసులు అందించడానికి సరిపడా ప్రత్యేక వ్యవస్థ లేదు, ఉన్న న్యాయమూర్తులకు సరిపడా కోర్టు ఉద్యోగులు లేరు ఇన్ని అసౌకర్యాల నడుమ కేసులను త్వరితగతిని పూర్తి చేయాలని న్యాయమూర్తులను ఒత్తిడి చేయడం, టార్గెట్‌లు, యూనిట్ల పేరుతొ పరుగులు పెట్టించడం వలన తీర్పులలో నాణ్యత పడిపోయే ప్రమాదం ఉన్నది.

న్యాయమూర్తుల మీద ఒత్తిడి కలిగిస్తున్న మొదటి అంశం లోక్ అదాలత్‌ల, లీగల్ సర్వీసెస్ క్యాంపుల నిర్వహణ. లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆక్ట్ 1987 అసలు లక్ష్యం సామాజిక, ఆర్థిక బలహీన వర్గాలకు ఉచిత, సరియైన న్యాయ సహా యం అందించడం. జస్టిస్ పి.ఎన్. భగవతి గారి నేతృత్వంలోని కమిటీ న్యాయ సహాయం పేదలకు, బలహీన వర్గాలకు ఉచితంగా అందించాలని చేసిన సిఫారసు ఆధారంగా, రాజ్యాంగంలోని ఆర్టికల్ 39 'ఎ' లక్ష్యాలకు అనుగుణంగా లీగల్ సర్వీసెస్ చట్టానికి రూపకల్పన చేయటం జరిగింది. అర్హత కలిగిన వారికి న్యాయ సహాయం అందించడం ప్రభుత్వాల బాధ్యత అని ఎన్నో సందర్భాలలో ఉన్నత న్యాయస్థానాలు నొక్కి వక్కాణించాయి. న్యాయ విభాగంలో అంతర్భాగం అయినప్పటికీ ప్రత్యేక యంత్రాంగంతో కొనసాగవలసిన లీగల్ సర్వీసెస్ అథారిటీ దురదృష్టవశాత్తు న్యాయ విభాగంలో అంతర్భాగమై అదనపు బాధ్యతగా పరిణమించింది. దేశంలోని చట్టాల గురించి పౌరులకు అందుబాటులో ఉన్న హక్కుల గురించి ప్రచారం చేయవలసిన బాధ్యత, ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదే, దురదృష్టవశాత్తు నేడు ఆ బాధ్యత కూడా న్యాయస్థానాలే మోస్తున్నాయి. లీగల్ సర్వీసెస్ క్యాంపుల పేరుతో న్యాయమూర్తులు అదనపు బరువును మోయడం వలన న్యాయ వ్యవస్థ అసలు లక్ష్యం దెబ్బతినే ప్రమాదం పొంచి ఉన్నది.

లోక్ అదాలత్‌ల ముఖ్యలక్ష్యం కేవలం న్యాయస్థానాలలో కొనసాగుతున్న కేసులను త్వరితగతిన పరిష్కరించడం ఎంతమాత్రం కాదు. వివిధ ప్రభుత్వ రంగ సంస్థల, కార్పోరేట్ సంస్థల సేవలలో ప్రజలకు ఏర్పడే అసౌకర్యాలను ప్రశ్నిం చే వేదికను ఏర్పాటు చేయటం, ఆయా సమస్యలను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించటం. దురదృష్టవశాత్తు అసలు లక్ష్యం కాస్తా కేసుల రాజీకి, కేసుల సంఖ్య కుదింపుకి పరిమితమైపోయింది. కేసులను కంపౌండింగ్ పరిధిలోకి తేవడానికి అనేక విధాల ప్రయత్నాలు జరుగుతున్నాయి. నిందితుల మీద ఆపాదించిన ఆరోపణలను స్వయంగా ప్రాసిక్యూషన్ వారే ఉపసంహరించు కుంటున్న సంఘటనలు కోకొల్లలు. కేసులను రాజీ చేయాలి, టార్గెట్ రీచ్ కావాలనే తొందరలో ప్రభుత్వ, కార్పోరేట్ ఆస్తుల దొంగతనం కేసులను కూడా ఆయా విభాగాల అధికారులను ఒప్పించి రాజీ చేసేస్తున్నారు. ప్రత్యేక చట్టాల కేసులను ప్రధాన కేసు రాజీ అయ్యిందిలే అనే సాకుతో మూసేస్తున్నారు. కేసులు నమోదు చేసిన పోలీసులే రాజీమార్గమంటూ కౌన్సెలింగులు చేయ టం, లోక్ అదాలత్‌లలో రాజీపడ్డారంటూ అవార్డులు జారీ చేయటం వలన ప్రజల్లో న్యాయస్థానాలు తమ ప్రత్యేకతను కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. ట్రాఫిక్ చలాన్స్ లాంటి సెకండ్ క్లాస్ కోర్టు విషయాలను, బ్యాంక్‌ల సెటిల్‌మెంట్‌లను కూడా లోక్ అదాలత్ కింద చూపాలంటూ టార్గెట్ కొర కు, సంఖ్య చూపుకోవడం కొరకు ఒత్తిడి చేయడం న్యాయమూర్తులను చికాకు పరిచే విషయం కాదా? ప్రపంచంలో ఏ దేశ న్యాయ వ్యవస్థలో కూడా రాజీ పడండి అంటూ క్యాపులుపెట్టినట్లు అగుపించదు. ప్రపంచంలో ఎక్కడా న్యాయవ్యవస్థ కక్షిదారుల మధ్య రాజీ కుదర్చండంటూ పోలీసు వ్యవస్థను అడిగినట్లు కనిపించదు.

న్యాయమూర్తుల మీద ఒత్తిడి పెంచుతున్న రెండో ప్రధాన అంశం కేసుల సత్వర పరిష్కారం, యూనిట్ పద్ధతిలో పనితీరు అంచనాలు. దేశంలో ఏ విభాగంలో లేని విధంగా ఒక్క న్యాయ విభాగంలోనే యూనిట్ ఆధారంగా నైపుణ్యత(పనితీరు)ను నిర్ణయిస్తున్నారు. వాస్తవంగా న్యాయస్థానాల పనితీరును తీర్పుల్లోని నాణ్యత, కేసుల తీవ్రత ఆధారంగా నిర్ణయించాలే కాని సంఖ్య ఆధారంగా నిర్ణయించటం దురదృష్టకరం. సంక్లిష్ట కేసుల్లో తీర్పు కత్తి మీద సాము లాంటిదే, యూనిట్ భూతం తరుముతుంటే న్యాయమూర్తులు నాణ్యమైన తీర్పుల మీద ధ్యాస ఉంచే అవకాశం తగ్గిపోతుంది. పెండింగ్ కేసుల సంఖ్య తగ్గించాలంటే న్యాయాముర్తుల సంఖ్య పెంచడం , ఇతరత్రా చర్యలు చేపట్టాలే కానీ ఉన్న కొద్దిపాటి న్యాయమూర్తుల భుజాలమీద ఒత్తిడి పెంచటం జాతి ప్రయోజనాలకు విఘాతంగా మారే ప్రమాదం ఉన్నది. 125 కోట్ల జనాభా గల దేశంలో సుమారు 3 కోట్లకు పైగా కేసులు పెండింగ్‌లో ఉండగా సుమారు ఒక లక్షమంది న్యాయమూర్తులు ఉండాల్సిన చోట కేవలం 21,372 పోస్టు లు మాత్రమే మంజూరు అయినవి, అందులోనూ ప్రస్తుతం ఉన్న న్యాయమూర్తుల సంఖ్య కేవలం 16,500 అంటే భారతదేశంలో న్యాయమూర్తులు సగటున ఒక్కొక్కరు 1400 కేసులు మోస్తున్నారు. ఇంత మోత బరువుతో నడవటమే కష్టం. ఇంకా వారిని పరిగెత్తించాలంటే ఎలా? సంవత్సరాల తరబడి పరిష్కారం కాని కేసులు (2012 ముందువి) కేవలం 6నెలల కాలంలో పూర్తి కావాలంటూ, రెండునుండి 4నెలల కాలంలో పెండింగ్ కేసుల సంఖ్య 5% తగ్గించాలంటూ ఆదేశాలిస్తే ఆయా న్యాయమూర్తులు ఏవిధమైన మార్గంలో కేసులు నడపగలరో వారి మానసిక స్థితి ఏమిటో ఆలోచించుకోవలసిన తరుణమిది.

న్యాయస్థానాల పనితీరు మెరుగు పడుతుందనే ఉద్దేశ్యంతో మొదలైన యూనిట్ పద్ధతి చివరకు కిందిస్థాయి న్యాయమూర్తుల మెడకు గుదిబండలా తయారయింది. తీర్పుల్లో నాణ్యత కన్నా యూనిట్ విలువకే ప్రాధాన్యత ఇచ్చే పరిస్థితి ఏర్పడింది. ఒక నెలలో ఇన్ని కేసులు పరిష్కరించాలి, ఇంత సంఖ్యలో లోక్ అదాలత్ కేసుల పరిష్కారం జరగాలి, 2012 కన్నా పాత కేసులను పరిష్కరిస్తే 1/4 వంతున యూనిట్ విలువ పెరుగుతుంది, 2012 తరువాత కేసులు పరిష్కరిస్తే 1/4 వంతున యూనిట్ విలువ తగ్గుతుంది, వృద్ధుల దినోత్సవం నాడు లీగల్ సర్వీసెస్ క్యాంపు జరుపుకోవాలి, మహిళా దినోత్సవం నాడు లోక్ అదాలత్ నిర్వహించాలి, మానసిక వికలాంగుల పేరుతొ క్యాంపులు పెట్టాలి, లా డే, రాజ్యాంగ అమలు దినోత్సవాలు జరపాలి అంటూ, మెగా లోక్ అదాలత్ లంటూ ఎడా పెడా పనులు పురమాయిస్తుంటే కింది స్థాయి న్యాయమూర్తులలో ఉద్యోగ నిర్వహణ కత్తిమీద సాములా తయారయ్యింది. యూనిట్‌ల గొడవలో పడిపోయిన కిందిస్థాయి న్యాయాధికారులకు న్యాయ విచక్షణ ప్రదర్శించే సమయం దొరకడం లేదన్నది వాస్తవం కాదా?

పత్రికల్లో వచ్చిన వార్తలు, వివిధ వేదికల మీద వక్తల ప్రసంగాలు అమలులోకి వస్తే కేసుల సంఖ్య కోట్లలో పేరుకొని పోవడానికి కేవలం న్యాయవాదులు, వాయిదాలిచ్చే కొందరు న్యాయమూర్తులే బాధ్యులన్నట్లు కనుపిస్తున్నది. వాస్తవాలను పరిశీలిస్తే పెండింగ్ కేసుల సంఖ్య పెరిగి పోవటానికి ఇంతకు ముందు చర్చించినట్లు న్యాయమూర్తుల కొరత ప్రధాన కారణమయితే వీటితో పాటు చర్చకు రాని ఎన్నో కారణాలు మనముందున్నాయి. స్వాతంత్ర్యం వచ్చిన 70 సంవత్సారాల తరువాత కూడా నేటికీ మనదేశంలో క్రిమినల్ కేసులలో సాక్షులకు సమన్లు/నోటీసులు జారీ చేసే ప్రత్యేక విభాగం లేదు. పోలీసు శాఖ మీద ఇంకా ఖచ్చితంగా చెప్పాలంటే సంబంధిత కోర్టు పోలీస్ మీద ఆధారపడాల్సిన దుస్థితి. నయానో, భయానో అతనితో పనిచేయించుకోవలసిన దురవస్థ న్యాయమూర్తులది. సుమారు 50% కోర్టులలో నేటికీ పూర్తిస్థాయి ప్రభుత్వ న్యాయవాదులు, పర్మనెంట్ ప్రాసిక్యుటర్లు లేరన్నది గణాంకాలు చెబుతున్న సత్యం, సంవత్సరాల తరబడి ఇంచార్జీలతో నెట్టుకొస్తున్న కోర్టుల సంఖ్య అనేకం. సివిల్ కేసుల సత్వర పరిష్కారానికి ప్రభుత్వరంగ సంస్థలతో ముఖ్యంగా రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖలతో కోర్టుల అనుసంధానం చాలా అవసరం, చాలా సందర్భాలలో కేసుల పరిష్కారం ఆయా విభాగాల దస్తావేజులతో కూడి ఉంటున్నది, ఈ దిశలో ఇంతవరకు అడుగులే పడలేదు. స్టెనోలు, టైపిస్టులు లేకుండా స్వయంగా టైపింగ్ చేసుకుంటున్న న్యాయముర్తులున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. న్యాయస్థానాల్లో కేసుల వాయిదాకు మరో ప్రధాన కారణం సాక్షుల గైర్హాజరు. కేసుతో సంబంధం లేని ఎందరో సాక్షులు తమ సొంత ఖర్చులతో కోర్టులకు హాజరు అయి సాక్ష్యం చెప్పాల్సిరావ డం బాధాకరం. సాక్షులకు బేటా (ఖర్చులు) చెల్లిస్తున్న సందర్భాలు చాలా తక్కువ, ఇచ్చినా కూడా అవి పెరిగిన ఖర్చులతో పోల్చుకుంటే ఏ మూలకు సరిపోవు, ఇటువంటి సందర్భాలలో సాక్షులు ఫిర్యాది లేదా నిందితుల మీద ఆధారపడి కోర్టులకు హాజరు అవుతున్నారు. లేక సాక్ష్యం ఇవ్వకుండా తప్పించుకోడానికి మార్గా లు వెతుకుతున్నారు, మరో ప్రధాన కారణం సుమారు 50 శాతం న్యాయస్థానాలు ఉద్యోగుల కొరతతో పనిచేస్తున్నాయి. 70% పైగా కోర్టు ఉద్యోగులు అదనపు భారంతో పనులు వెళ్లదీస్తున్నారు.

ప్రపంచంలో ఏ దేశంలోని న్యాయాస్థానాల్లో లేని విధంగా భారతదేశంలో న్యాయస్థానాల పనిదినాలు, సగటు తీర్పులు అత్యధికంగా ఉండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నది. కులాలు, మతాలూ, జాతులు, వర్ణాలు, భాషలు, ప్రాంతా లు లాంటి ఎన్నో రుగ్మతల నుండి ఇప్పుడిప్పుడే మార్పు దిశలో పయనిస్తున్న ఈ విస్తృత వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టే ఎన్నో తీర్పులు రావలసిన సంధికాలంలో న్యాయమూర్తుల మీద అనూహ్య ఒత్తిడి తీర్పుల నాణ్యతను మరుగున పడేసి పరిమాణానికి పెద్దపీట వేసే ప్రమాదం పొంచి వున్నది. లా కమిషన్ 1987లో తన 120 వ నివేదికలో చాలా స్పష్టంగా ప్రతి 10 లక్షల జనాభాకు న్యాయమూర్తుల సంఖ్య 10.5నుండి (ఆనాటి సంఖ్య) కనీసంగా 50కి పెంచాలని సిఫారసు చేసింది, 30 సంవత్సరాల తరువాత కూడా ఆ నివేదిక అమలుకు నోచుకోకపోవడం దురదృష్టకరం. 125 కోట్ల మంది ప్రజలున్న విశాల దేశంలో కనీసం 1 లక్ష మంది న్యాయమూర్తులుండాలి కాని ఆ సంఖ్య నేటికీ 13వేలను మించక పోవడం శోచనీయం. దేశంలో 24 హైకోర్టులలో 406 న్యాయమూర్తుల ఖాళీలుండడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నది.

యుద్ధాలు, ప్రకృతి వైపరీత్యాల వలన జరగని వినాశనం న్యాయ వ్యవస్థ విఫలమైన చోట సంభవిస్తుందనేది చారిత్రక సత్యం.

తలాక్ 'బంతి' కమలనాధుల 'కోర్టు'లో...



చెన్నూరి గణేశ్
8897300975

మూడుసార్లు తలాక్ చెప్పడం ద్వారా భార్యలను వదిలించుకునే సంస్కృతి అమానుషమని సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ విధానాన్ని ఆరునెలలపాటు సస్పెండ్ చేస్తూ ఈ మేరకు ఒక స్పష్టమైన చట్టం తీసుకురావాలని కేంద్రప్రభుత్వాన్ని ధర్మాసనం కోరింది. అయిదుగురు న్యాయమూర్తులున్న ధర్మాసనం భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తం చేసినప్పటికీ సాంప్రదాయం ప్రకారం మెజారిటీ సభ్యుల అభిప్రాయమే గెలిచింది. గతంలో మనోవర్తి కేసులో ఇచ్చిన మాదిరిగానే సుప్రీంకోర్టు ముస్లిం మహిళలకు కొండంత ఊరట నిచ్చే తీర్పు ఇచ్చింది.

మూడుసార్లు తలాక్ చెప్పడం ద్వారా కట్టుకున్న భార్యకు విడాకులిచ్చే సాంప్రదాయం ముస్లిం వర్గాల్లో ఎప్పటినుంచో కొనసాగుతోంది. అయితే ప్రస్తుతం సుప్రీం ధర్మాసనం రాజ్యాంగ విరుద్ధంగా తేల్చింది. తలాక్ ఎ బిద్దత్ సాంప్రదాయాన్ని మాత్రమేనని గమనించాలి. మిగతా విధానాలలో తలాక్ చెప్పే ముందు విడాకులిస్తున్న భార్య సంక్షేమానికి కొన్ని చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలి. ప్రధానంగా భార్య గర్భం దాల్చే అవకాశం ఉన్నప్పుడు ఎటువంటి పరిస్థితుల్లో వాటి ప్రకారం తలాక్ చెప్పడానికి వీలు లేదు.

తలాక్ విధానాన్ని సరళీకృతం చేస్తూ బిద్దత్ విధానాన్ని తీసుకువచ్చారు. కేవలం మూడుసార్లు తలాక్ చెబితే చాలు దీని ప్రకారం విడాకులు తక్షణం మంజూరవుతాయి. దీన్ని ఆసరాగా చేసుకుని అనేక సందర్భాల్లో విడాకుల విధానాన్ని దుర్వినియోగం చేస్తూ వచ్చారు. పరిస్థితి చివరకు ఎంత దారుణంగా మారిందంటే దుబాయ్ లాంటి దేశాలకు వెళ్లిన భర్తలు కేవలం ఫోన్‌లో తలాక్ చెప్పి భార్యను నిర్ధాక్షిణ్యంగా వెళ్ళగొట్టిన అనేక సంఘటనలు జరిగాయి.


ఇలాంటి అమానుష ఘటనలపై తనకు తానుగా స్పందించిన సుప్రీంకోర్టు ఈ అంశాన్ని ప్రజోపయోగ వ్యాజ్యంగా స్వీకరించి 2015లో విచారణ ప్రారంభించింది. ముస్లిం మహిళల హక్కుల కోసం పోరాడుతున్న ముస్లిం మహిళా ఆందోళన్ సంస్థతో పాటు తలాక్ పేరిట తమకు జరిగిన అన్యాయాలు వివరిస్తూ పలువురు మహిళలు వేర్వేరు పిటీషన్ల ద్వారా అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.అంశం ప్రాధాన్యతను గుర్తించిన సుప్రీంకోర్టు విచారణను రాజ్యాంగ ధర్మాసనానికి బదిలీ చేసింది. సుప్రీం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఖేహర్‌తో పాటు మరో నలుగురు సీనియర్ న్యాయమూర్తులు ఇందులో సభ్యులుగా ఉన్నారు. ఎటువంటి అపోహలకు తావు లేకుండా ఒక్కో మతం నుంచి ఒకరిని ధర్మాసనంలో సభ్యులుగా నియమించారు.

మన రాజ్యాంగంలో మైనారిటీల హక్కులకు భంగం కలగకుండా ఆర్టికల్ 25 కింద మతపరమైన స్వేచ్ఛను కల్పించారు. ఒకవైపు లౌకికరాజ్యం అని చెప్పుకుంటూనే మరోవైపు మతాన్ని తమ అవసరాల కోసం అడ్డుగోలుగా వాడుకునే అవకాశాలు కూడా కల్పించారు. ఇది కేవలం ముస్లింలకే కాదు మతాన్ని అడ్డుపెట్టుకుని అన్ని వర్గాల వారు అరాచకాలు చేస్తున్నారు. పరిమితి లేకుండా సంతానం ఉండాలని, నచ్చకపోతే భార్యను మూడు ముక్కలతో వెళ్ళగొట్టమని ఖురాన్‌లో ఎక్కడా చెప్పలేదని ఆ మత పెద్దలే అనేక సందర్భాల్లో స్పష్టం చేశారు. ముస్లింల హక్కులకు భంగం కలగకుండా ఏర్పాటు చేసి పర్సనల్ బోర్డు ఇటువంటి అమానవీయ సాంప్రదాయాలను అమలు చేస్తోంది.

తలాక్‌తో పాటు మహిళల హక్కులకు నిర్ధాక్షిణ్యంగా అణచివేసే ఇంకెన్నో సాంప్రదాయాలు ముస్లిం వర్గాల్లో కొనసాగుతున్నాయి. దీనికి ప్రధాన కారణం ఆ వర్గాల్లో అక్షరాస్యత ఆశించినంతగా లేకపోవడం. మారుతున్న కాలానికి అనుగుణంగా వారిలో కూడా మార్పులు వస్తున్నాయి. చదువుకుని ఉద్యోగాలు చేసే కుటుంబాల్లో ఇటువంటి పద్ధతులు తగ్గుముఖం పడుతున్నాయి. ఇటువంటి సున్నితమైన సమస్యను మతంతో ముడిపెట్టాలని కేంద్రంలోని కాషాయ సర్కార్ చూస్తోంది.

సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు కేవలం ఆరంభం మాత్రమే. రాజ్యాంగంతో ముడిపడి ఉన్న ఈ సమస్యను పరిష్కరించాల్సింది కేంద్రప్రభుత్వమే. అందుకే తలాక్ విధానాన్ని ఆరునెలలు మాత్రమే సస్పెండ్ చేస్తూ సరైన చట్టం తీసుకురావాలని ధర్మాసనం సూచించింది. ఈ సందర్భంగా గతంలో సంచలనం సృష్టించిన షాబానో కేసును ఒకసారి గుర్తు చేసుకోవాలి. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని 125 సెక్షన్ ప్రకారం ముస్లిం మహిళలు కూడ మనోవర్తికి అర్హులని సుప్రీంకోర్టు సంచలన తీర్పునిచ్చింది. మైనారిటీ నేతల ఒత్తిడికి తలొగ్గిన అప్పటి రాజీవ్‌గాంధీ ప్రభుత్వం చట్టాన్నే సవరించింది. ఇప్పుడు తలాక్ అంశంలో సుప్రీం తీర్పును గౌరవిస్తూ మోడీ ప్రభుత్వం తక్షణమే చట్టం తీసుకు వస్తుందా లేదంటే తమ మిత్రపక్షాల మాటలు విని నాన్చే కార్యక్రమం చేపడుతుందా వేచి చూడాలి.

ప్రతి ఆదివారం ప్రజాజీవన ప్రతిబింబం
మన తెలంగాణ
మన
www.manatelangana.news
మనపేజీ మనందరిపేజీ
హైదరాబాద్ | ఆదివారం | 27 ఆగస్టు | 2017



కాళేశ్వరం కాకి లెక్కలు!

పర్యావరణ ప్రభావ అంచనా నివేదిక – 2017

కాళేశ్వరం సాగునీటి ప్రాజెక్ట్ మీద తయారు చేసిన పర్యావరణ ప్రభావ నివేదికలో పర్యావరణంలో వచ్చే అనేక వైవిధ్యమైన మార్పుల ప్రస్తావన లేదు. నది ప్రాంత పర్యావరణం జీవ సంబంధ, రసాయన భౌతిక లక్షణాల (biological, chemical and physical properties)లో కూడా మార్పులు చోటుచేసుకుంటాయి. ఇటువంటి రసాయన మార్పుల వల్లనే, ఇటీవల SRSP డ్యాంలో చేపలు భారీ స్థాయిలో చనిపోయాయి. డ్యాంల నుంచి ప్రమాదకర వాయువులు ఉత్పన్నమవుతాయి అనేది వాస్తవం. శాస్త్రీయంగా రుజువు చేశారు కూడా. మేడిపల్లి దగ్గర నిర్మాణం అవుతున్న ఆనకట్ట వల్ల అవి ఉత్పన్నమవుతాయి. గ్రీన్ హౌస్ గ్యాసులు, ముఖ్యంగా మీథేన్ ఉత్పత్తి అవుతుంది. ఇప్పటికే, మన దేశంలో ఉత్పత్తి అవుతున్న అటువంటి వాయువుల మీద అంతర్జాతీయ పర్యావరణ ఒప్పంద వేదికలలో చర్చ జరుగుతున్నది.

క్ర. సంఖ్య	పంట	ప్రాజెక్ట్ లేకుంటే			ప్రాజెక్ట్ వలన		
		పంట విస్తీర్ణం (హెక్టార్లు)	దిగుబడి (క్వింటాల్/హెక్టార్)	మొత్తం నికర ఆదాయం (రూపాయలలో)	పంట విస్తీర్ణం (హెక్టార్లు)	దిగుబడి (క్వింటాల్/హెక్టార్)	మొత్తం నికర ఆదాయం (రూపాయాలలో)
1.	వరి	1,12,395	10	91,71,22,569	1,11,323	50	7,79,44,19,654
2.	మొక్క జొన్న	49,044	10	43,59,77,216	11,689	50	72,80,09,975
3.	జొన్నలు	43,427	10	26,40,92,794	17,812	40	56,95,22,176
4.	పెసర	4,551	4	3,07,51,850	73,473	25	5,46,57,89,325
5.	మినుములు	2,071	4	1,08,19,613	73,473	25	5,38,70,02,999
6.	కంది	24,694	15	1,01,04,69,265	20,038	30	1,70,91,53,771
7.	వేరుశనగ	3,965	8	9,99,13,205	1,11,323	30	12,73,33,60,501
8.	ప్రత్తి	6,838	8	15,41,34,316	1,11,323	30	11,74,91,87,712
9.	మిరపకాయలు	2,370	5	7,56,12,632	1,16,889	45	45,61,06,69,683
10.	కూరగాయలు	3,679	7	2,80,61,769	1,00,190	60	11,07,66,62,460
11.	పసుపు	6,846	6	4,08,25,661	95,404	45	13,13,13,52,454
12.	సోయాబీన్	25,650	20	12,58,04,400	1,11,323	40	11,34,74,09,890
13.	కొత్తిమీర				7,236	45	99,95,87,919
	మొత్తం	2,85,530		4,31,85,85,291	9,61,498		12,73,30,25,40,602
			మొత్తం రూ. కోట్లు	431.85			12,730.25



కాళేశ్వరం ప్రాజెక్ట్ వల్ల ఒనగూరే లాభాలను ఒక శాస్త్రీయ పద్ధతి లేకుండా చాలా ఎక్కువగా చూపెడుతున్నది ఈ నివేదిక. రైతులకు వచ్చే ఆదాయం గురించి పట్టికలో ఇచ్చిన వివరాలు శాస్త్రీయ అంచనాకు మించి ఉన్నాయి. వాస్తవ పరిస్థితికి దూరంగా ఉన్నాయి. 12 పంటల ప్రస్తుతమున్న నికర ఆదాయం రూ.431.85 కోట్ల నుంచి ఏకంగా ప్రాజెక్ట్ వలన రూ.12,730.25 కోట్లకు పెరుగుతుంది అని అంచనా వేశారు. ఇది 29 రెట్ల పెరుగుదల. కేవలం నీటిని అందించడం ద్వారా ఇంతటి స్థాయిలో దిగుబడిలో పెరుగుదల ఆసాధ్యం. వరి విస్తీర్ణం 3 రెట్ల పెరుగుదలతో దిగుబడిలో దాదాపు 5 రెట్ల వృద్ధిని చూపెడుతున్నది ఈ నివేదిక. దిగుబడి భారీ స్థాయిలో పెంచడం ఒక తప్పు కాగ, దిగుబడికి వారు తీసుకున్న మార్కెట్ ధరల వివరాలు లేవు. ఏ ధర తీసుకున్నా, ఇంతటి ఆదాయం పూర్తిగా తప్పు.

కాళేశ్వరం ఎత్తిపోతల పథకం రూ.80,000 కోట్ల బృహత్తర కార్యక్రమం. దీని వలన పర్యావరణం, ఇంకా ఇతర అంశాల మీద పడే ప్రభావం గురించి అంచనా వేయమని పర్యావరణ పరిరక్షణ శిక్షణ పరిశోధన(EPTRI) సంస్థకు అప్పగించారు. ఈ సంస్థ కాళేశ్వరం ప్రాజెక్టు మీద సమర్పించిన పర్యావరణ ప్రభావ అంచనా నివేదిక – 2017 ఆఫీసులో కూర్చుని తయారు చేసినట్టుంది. క్షేత్ర పరిశీలన చేసినట్టు లేదు.

కాళేశ్వరం సాగునీటి ప్రాజెక్ట్ మీద తయారు చేసిన పర్యావరణ ప్రభావ నివేదికలో పర్యావరణంలో వచ్చే అనేక వైవిధ్యమైన మార్పుల ప్రస్తావన లేదు. నది ప్రాంత పర్యావరణం జీవ సంబంధ, రసాయన భౌతిక లక్షణాల (biological, chemical and physical properties)లో కూడా మార్పులు చోటుచేసుకుంటాయి. ఇటువంటి రసాయన మార్పుల వల్లనే, ఇటీవల SRSP డ్యాంలో చేపలు భారీ స్థాయిలో చనిపోయాయి. డ్యాంల నుంచి ప్రమాదకర వాయువులు ఉత్పన్నమవుతాయి అనేది వాస్తవం. శాస్త్రీయంగా రుజువు చేశారు కూడా. మేడిపల్లి దగ్గర నిర్మాణం అవుతున్న ఆనకట్ట వల్ల అవి ఉత్పన్నమవుతాయి. గ్రీన్ హౌస్ గ్యాసులు, ముఖ్యంగా మీథేన్ ఉత్పత్తి అవుతుంది. ఇప్పటికే, మన దేశంలో ఉత్పత్తి అవుతున్న అటువంటి వాయువుల మీద అంతర్జాతీయ పర్యావరణ ఒప్పంద వేదికలలో చర్చ జరుగుతున్నది.

అధ్యయన ప్రాంతం (study area) చాలా ముఖ్యం, పర్యావరణ ప్రభావం అంచనా వేసే ముందు, ఈ అధ్యయన ప్రాంతాన్ని నిర్వచించుకోవాలి. అధ్యయన ప్రాంతం ఎంచుకోవటంలో తప్పులు చేస్తే అంచనాలు తలక్రిందులు అయ్యే ప్రమాదం ఉంది. ఈ నివేదికలో అధ్యయన ప్రాంతం గురించి శాస్త్రీయ విస్తీర్ణ సమాచారం లేదు. గ్రామాల గురించిన సమాచారం లేదు. ఆయా గ్రామాలలో ఈ ప్రాజెక్ట్ వలన జరిగే పర్యావరణ పరిణామాల మీద అంచనాలు లేవు. ఈ నివేదిక ప్రకారం అధ్యయన ప్రాంతంలో 1527 గ్రామాలు ఉన్నాయి. ఇవి ఉన్న 13 జిల్లాలు: కరీంనగర్, సిరిసిల్ల, సిద్ధిపేట, మెదక్, యాదాద్రి, నల్గొండ, సంగారెడ్డి, నిజామాబాదు, జగిత్యాల్, కామారెడ్డి, నిర్మల్, మేడ్చల్, పెద్దపల్లి. అధ్యయన ప్రాంత పరిధిలో గ్రామాల సంఖ్య చెప్పినా, గ్రామాల పేర్ల పట్టిక లేవు. అసలు ఆయా గ్రామాలలో అధ్యయన బృందం పర్యటించిన పరిస్థితి లేదు. కేవలం నాలుగు గ్రామాలలో భూసార పరీక్షలు చేసి, మొత్తం 1527 గ్రామాలకు ఆపాదించే ప్రయత్నం ఇక్కడ జరిగింది.

ప్రాజెక్ట్ నిర్మాణాల వల్ల (కాలువలు, రోడ్లు, వగైరా) దుష్ప్రభావం పడే గ్రామాల ప్రస్తావన లేదు. గ్రామాల విభజన లేదు. ప్రాజెక్ట్ నిర్మాణాలు, పనులు, ప్రాజెక్ట్ ఇచ్చే నీళ్ళ వల్ల వచ్చే ప్రాభవం గురించిన గ్రామాల వివరాలు లేవు. నివేదికలో క్షేత్ర పరిశీలన చేసిన సందర్భాలు, వివరాలు చాలా తక్కువ. క్షేత్ర సమాచారం కూడా చాల తక్కువగా ఉంది.

కాళేశ్వరం మీద చేసిన పూర్తి ప్రాజెక్ట్ నివేదికలోని (DPR) అంశాలకు, వివరాలకు, పర్యావరణ ప్రభావ నివేదికలోని (EIA) వివరాలకు పొంతన లేదు. నిర్వాసితం అవుతున్న అన్ని గ్రామాలను పర్యావరణ మదింపులో పరిగణనలోనికి తీసుకోలేదు.

కాళేశ్వరం ప్రాజెక్ట్ వల్ల ఒనగూరే లాభాలను ఒక శాస్త్రీయ పద్ధతి లేకుండా చాలా ఎక్కువగా చూపెడుతున్నది ఈ నివేదిక. రైతులకు వచ్చే ఆదాయం గురించి పట్టికలో ఇచ్చిన వివరాలు శాస్త్రీయ అంచనాకు మించి ఉన్నాయి. వాస్తవ పరిస్థితికి దూరంగా ఉన్నాయి.

12 పంటల ప్రస్తుతమున్న నికర ఆదాయం రూ.431.85 కోట్ల నుంచి ఏకంగా ప్రాజెక్ట్ వలన రూ.12,730.25 కోట్లకు పెరుగుతుంది అని అంచనా వేశారు. ఇది 29 రెట్ల పెరుగుదల. కేవలం నీటిని అందించడం ద్వారా ఇంతటి స్థాయిలో దిగుబడిలో పెరుగుదల ఆసాధ్యం.

వరి విస్తీర్ణం 3 రెట్ల పెరుగుదలతో దిగుబడిలో దాదాపు 5 రెట్ల వృద్ధిని చూపెడుతున్నది ఈ నివేదిక. దిగుబడి భారీ స్థాయిలో పెంచడం ఒక తప్పు కాగా, దిగుబడికి వారు తీసుకున్న మార్కెట్ ధరల వివరాలు లేవు. ఏ ధర తీసుకున్నా, ఇంతటి ఆదాయం పూర్తిగా తప్పు.ప్రాజెక్ట్ వచ్చిన తరువాత వాటి విస్తీర్ణం పెరుగుదల కేవలం 1,072 హెక్టార్లు కాగా, ఆదాయం రూ.91.71 కోట్ల నుంచి రూ.779.44 కోట్లకు పెరిగింది, ఆ నివేదిక అంచనాల ప్రకారం దాదాపు 8 రెట్ల పెరుగుదల. తెలంగాణా, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో, ఇదివరకు సాగు నీటి ప్రాజెక్ట్ ల కమాండ్ ఏరియాలో వరి విస్తీర్ణం దాదాపు 70 నుంచి 80 శాతం పెరిగింది. అయితే వరి విస్తీర్ణం పెంచకుండా, దిగుబడి, ఆదాయం అంచనాలలో, ఈ నివేదికలో, అశాస్త్రీయ పెరుగుదల మనం గమనించవచ్చు. దిగుబడిలో ఇంత మార్పు ఉండే అవకాశం అసలు లేదు. స్థూలంగా, ప్రాజెక్ట్ వలన వచ్చే 'లాభనష్టాల' లెక్కలు అశాస్త్రీయం. ఈ లెక్కలకు ఆధారం కూడా నివేదికలో చూపలేదు. పంటల నికర ఆదాయానికి వారు వేసుకున్న మార్కెట్ ధరల వివరాలు లేవు.

డా. డి.నరసింహారెడ్డి, nreddy.donthi16@gmail.com

బయో కంపెనీల అణచివేత తగదు

గత పదిహేనేళ్ల నుండి వ్యవసాయ శాఖలకు బయోకంపెనీలకు మధ్య నిరంతర పోరాటం జరుగుతూనే ఉంది. పర్యావరణానికి హాని చేయని సురక్షితమైన సేంద్రియ ఉత్పత్తులను రైతు సంక్షేమం కోసం బయో కంపెనీలను వేధిస్తూనే ఉన్నాయి. నిరుడు ఆంధ్రా ప్రభుత్వం బయో కంపెనీలపై నిషేధాన్ని విధించింది. ఆంధ్రప్రభుత్వం పగబట్టినట్టు తనిఖీలు చేయటం, పి.డి యాక్ట్ కింద కేసులు పెడతామని బెదిరించటం పురుగు మందులు వ్యాపారులను (డీలర్లు) బయో ఉత్పత్తులు అమ్మనీయకుండా చేయడం న్యాయస్థానం ఇచ్చిన తీర్పును సైతం ఉల్లంఘించి రైతులకు, వ్యాపారులను బయోఉత్పత్తులు విక్రయించకుండా వేధించడం వంటి చర్యలకు పాల్పడుతోంది. ఇంత చేసి ఒక్క బయో కంపెనీ అయినా అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆ ప్రభుత్వం నిరూపించలేదు.

బయోకంపెనీలపై ఎందుకీ చర్యలు?

సాధారణంగా ప్రకృతి సిద్ధమైన సేంద్రియ, వృక్ష– జీవ సంబంధిత పదార్థాలతో బయోఉత్పత్తులను తయారుచేస్తారు. రెండు దశాబ్దాలుగా బయో ఉత్పత్తుల వాడకం భారీగా పెరిగింది. రసాయన ఎరువులు – రసాయన పురుగుల మందుల వాడకం కొంతమేరకు తగ్గింది. రసాయనిక ఎరువులు పురుగు మందుల కంపెనీలకు ఇది కంటకంగా మారింది. ఈ పరిస్థితి మన తెలుగు రాష్ట్రాలలోనే కాదు యావత్ భారతదేశంలోనూ, ప్రపంచవ్యాప్తంగా కూడా ఉన్నది. ప్రపంచంలో కొన్ని దేశాలలో రసాయనిక ఎరువులను పురుగు మందులను పూర్తిగా నిషేధించి, సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నారు. మనదేశంలో కూడా కొన్ని రాష్ట్రాలలో ఈ పరిస్థితి నెలకొని ఉంది. ఈ కారణంగా రసాయనిక ఎరువులు, పురుగుల మందుల కంపెనీలు ప్రభుత్వ అధికారులను మంత్రులను లోబరుచుకుని, పెద్దమొత్తంలో వారికి ముడుపులు చెల్లించి బయో కంపెనీలపై ఆంక్షలు విధించి, వేధింపు చర్యలు గైకొనేలా చేస్తున్నారు. బయోకంపెనీలపై వ్యవసాయ శాఖకు ఏవిధమైన నియంత్రణ అధికారం లేదని ఉమ్మడి రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం తీర్పునిచ్చింది. మళ్లీ 2008లో రైతులకు నష్టం వాటిల్లే నకిలీ బయో ఉత్పత్తులను నియంత్రించే అధికారం తమకు ఇవ్వాల్సిందిగా న్యాయస్థానాన్ని వ్యవసాయశాఖ ఆర్థించింది. ఇందులోని అంతరార్థాన్ని గ్రహించని న్యాయస్థానం బయో ఉత్పత్తుల్లో రసాయనాలను నిర్ధారించే పరీక్షలు నిర్వహించాలని, రసాయనాలున్నట్లు తేలితే కంపెనీలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని తీర్పు ఇచ్చింది. బయోకంపెనీలు తమతమ ఉత్పత్తులకు సంబంధించిన నమూనా (శాంపిల్స్)ను వ్యవసాయశాఖలకు అందజేసి, లిఖితపూర్వకంగా రశీదును తీసుకోవాలని న్యాయస్థానం సూచించింది. దీన్ని ఆధారం చేసుకొని వ్యవసాయశాఖ అధికారులు బయోకంపెనీలపై తిరిగి పెత్తనం చేయడం మొదలుపెట్టారు. అధికార దుర్వినియోగం చేసి, బయో ఉత్పత్తులపై ఉక్కుపాదం మోపారు. ఎక్కడా అమ్మకాలు జరగకుండా యథాశక్తులా ప్రయత్నించాను. వ్యవసాయశాఖ కమిషనరేట్‌లో బయోఉత్పత్తుల శాంపిల్స్ అందజేస్తే రశీదు ఇవ్వడానికి కనీసం ప్రతి బయోకంపెనీ పాతిక వేల నుండి లక్ష రూపాయల వరకు ముడుపుల రూపంలో సమర్పించుకోవాల్సి వచ్చింది. ముడుపులిస్తేనే అధికారులు రశీదు ఇస్తారు. ఇవ్వని బయో యాజమాన్యాలను ఇప్పటికీ తిప్పుతూనే ఉన్నారు. ఇంత జరిగిన తర్వాత కూడా అధికారుల్లో ఆశ చావలేదు. ఉన్నతస్థాయిలో అనగా వ్యవసాయశాఖ కమిషనరేట్ పరిధిలో ముడుపులు తీసుకున్నప్పటికీ కిందిస్థాయికి వచ్చేసరికి మాకేంటి అన్న ధోరణిలో సిబ్బంది ఉన్నారు. మండలస్థాయిలో అగ్రికల్చరల్ అధికారులు ఇష్టమొచ్చిన రీతిగా వ్యవహరిస్తున్నారు. ప్రతి పురుగుల మందు డీలర్ నుంచి దుకాణాల నుంచి బయో ఉత్పత్తులు సేకరించి, సంబంధిత కంపెనీలకు నోటీసులు పంపడం, తమ వద్దకు వచ్చిన ప్రతినిధులను బెదిరించడం, భారీగా ముడుపులు వసూలు చేయడం, తిరిగి వేధించడం వీరికి పరిపాటైంది. బయోకంపెనీలు వ్యాపారంలో ఒడిదుడుకులను తట్టుకోవడం – సంవత్సరమంతా – డీలర్లకూ, రైతులకు అప్పిచ్చి వసూలు చేసుకోలేక చివరకు అధికారుల వేధింపులు తాళలేక వారడిగినంత ఇచ్చి, ముడుపులు శక్తికి మించి చెల్లించి, దిక్కుతోచని స్థితిలో పడిపోతున్నాయి. సంక్షోభ దిశగా అడుగులు వేస్తున్నాయి. పాత అప్పులు వసూలు చేసుకోలేక – కొత్త వ్యాపారం చేయలేక బయో వ్యాపారులు కొట్టుమిట్టాడుతున్నారు. ఇక వ్యవసాయ అధికారులు బయోకంపెనీల నుంచి ముడుపులు స్వీకరించి కోట్లల్లో అక్రమాస్తులు సంపాదించి విలాసవంతంగా వున్నారు. ఉభయ రాష్ట్రాలలో ఒక్కో వ్యవసాయాధికారి వద్ద కోట్లాది రూపాయల అక్రమాస్తులున్నాయంటే అది అతిశయోక్తి కాదు. ప్రపంచ వ్యాప్తంగా సేంద్రియ వ్యవసాయం – సేంద్రియ ఆహారోత్పత్తులు అభివృద్ధి చెందుతు న్నాయి. రసాయన పురుగుల మందులు – రసాయన ఎరువులతో పండి ంచిన పంటల వలన మనం తినే ఆహారం పూర్తిగా విషతుల్యమై అనేక రోగాలు సోకుతున్నాయి. ప్రజల ఆరోగ్యంతో అధికారులు చెలగాటమా డుతున్నారనే చెప్పక తప్పదు. మరోపక్క వ్యవసాయ శాస్త్రవేత్తలు రసాయనిక ఎరువులు వద్దని చెవి నిల్లుకట్టుకొని సర్కార్‌కు మొరపెట్టు కుంటున్నా, ఫలితం లేకుండా పోతోంది. ప్రజలు విషతుల్యమైన ఆహారం తిని రోగాల బారిన పడి నికృష్టంగా జీవించకుండా ఉండాలంటే సేంద్రియ, బయో ఉత్పత్తులను ఆదరించాలి.

డా.సి.వి. రత్నకుమార్

తాజ్ మహల్ ఆలయం కాదు.. సమాధి: ఎఎస్ఐ



ఆగ్రా: తాజ్‌మహల్ ఆలయం కాదు..అది ఒక సమాధి అని ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా(ఎఎస్ఐ) మొట్టమొదటిసారిగా కోర్టుకు తెలిపింది. 1920లో తాజ్‌మహల్ రక్షణకు అధికారులు జారీ చేసిన నోటిఫికేషన్ ఆధారంగా ఈ అంశాన్ని అఫిడవిట్‌లో పేర్కొన్నట్లు స్థానిక కోర్టుకు తెలిపింది. 2015 నవంబర్‌లో తాజ్‌మహల్ ఉన్న ప్రదేశంలో దేవాలయం ఉందనే ఆధారాలేవి లేవని కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ గతంలోనే స్పష్టం చేసిందని పేర్కొంది. ఏప్రిల్ 2015లో తాజ్‌మహల్‌ఉన్న ప్రదేశం శివుడి ఆలయం తేజోమహాలయంగా కొంత మంది న్యాయవాదులు ఆగ్రా కోర్టులో పిటిషన్ వేశారు. ఈ అంశంపై ఎఎస్ఐ తన సమాధానాన్ని గురువారం కోర్టుకు సమర్పించింది. ఫిర్యాదు చేసిన వారు తమ సమాధానాన్ని సెప్టెంబర్ 11న జరిగే తదుపరి విచారణలోగా తెలుపాలని ఆదేశించింది. ఈ అంశంపై విచారించేందుకు స్థానిక కోర్టు, ఫిర్యాదు చేసిన వారి అర్హతలను ఎఎస్ఐ సవాల్ చేసింది. తాజ్‌మహల్ ఉన్న ప్రదేశంలో ఫిర్యాదు దారు పేర్కొన్నట్లు ఆలయం కాని, శివలింగం లేదని ఎఎస్ఐ స్పష్టం చేసింది. చారిత్రకంగా, అందుబాటులో ఉన్న రికార్డుల ఆధారంగా యమునా నది ఒడ్డున తాజ్‌మహల్ మాత్రమే ఉందని పేర్కొంది. అది ప్రపంచంలో ఏడో వింతంగా గుర్తింపు ఉన్నట్లు తెలిపింది. ఆ ప్రదేశం ఆక్రమించుకున్నది కాదని రాజా జైసింగ్‌తో పరస్పర బదిలీ ద్వారా స్వీకరించిందని ఎఎస్ఐ తెలిపింది. పిటిషనర్ లేవనెత్తిన అంశాలకు ఎలాంటి ఆధారాలు లేనందున పిటిషన్‌ను రద్దు చేయాలని కోరింది.

రైల్వే గోదాంలో అగ్ని ప్రమాదం

మన తెలంగాణ/హైదరాబాద్/ బోయిన్‌పల్లి: ఎంఎంటిఎస్ రెండోదశ పనులు చేపట్టిన కాంట్రాక్ట్ సంస్థలో శుక్రవారం అర్ధరాత్రి భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. సంఘటనలో సుమారు 2కోట్ల రూపాయల మేరకు ఆస్థినష్టం కలిగిఉండొచ్చని సంస్థ ఉద్యోగులు పేర్కొంటున్నారు. వివరాల్లోకి వెళితే సనత్‌నగర్ నుంచి మౌలాలి వరకు ఎంఎంటిఎస్ టెండరును కలిండి రైల్ నిర్మాణ్ సంస్థ చేజిక్కించుకుంది.ఆ మేరకు పనులను నిర్వహిస్తుంది.ఇందులో భాగంగా ఏడో నంబర్ జాతీయ రహదారిపై గల బోయిన్‌పల్లి డైరీఫాం రోడ్డు సంస్థ నిర్మాణ సామాగ్రిని భద్ర పరుచుకోవటానికి గోదాంను ఏర్పాటు చేసింది.అదే క్రమంలో రోజు మాదిరిగానే సమధ్, రాములు ఇద్దరు సెక్యూరిటీ గార్డులు గోదాంల వద్ద విధులు నిర్వర్తిస్తున్నారు.శుక్రవారం ఆర్ధరాత్రి భారీ వర్షం కురుస్తున్న నేపథ్యంలో భారీగోదాంకు ఎదురుగా 100 గజాల స్థలంలో తాత్కలిక గదుల్లో మంటలను గుర్తించారు. గమనించిన సెక్యూరిటీ గార్డులు అగ్నిమాపక సిబ్బందికి ఫోన్ చేసి సమాచారాన్ని అందించటంతో అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేసారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. సంఘటనలో సుమారు 2 కోట్ల పివిసి వైర్ కాయిల్స్ ఇతర పరికరములు అగ్నికి అహుతైనట్లు సంస్థ మేనేజర్ మురళికృష్ణ పేర్కొన్నాడు.విషయం తెలుసుకున్న రైల్ వికాస్ నిగమ్ సంస్థ ఉన్నతాధికారులు గోదాంను సందర్శించి పరిస్థితులను తెలుసుకున్నారు. పనులను 2019 వరకు పూర్తి చేయాలని అధికారులు భావిస్తున్నప్పటికీ ప్రమాదం కారణంగా కొంతమేర పనుల్లో జాప్యం కలిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. శుక్రవారం అర్థరాత్రి సంఘటన జరిగినా శనివారం సాయంత్రం వరకు కాంట్రాక్ట్ అధికారులు బోయిన్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేయకపోవటం గమనార్హం.



సచ్‌దేవ్ మృతికి ఎఐటియుసి సంతాపం

మన తెలంగాణ / హైదరాబాద్ : ఎఐటియుసి జాతీయ కార్యదర్శి డి.ఎల్.సచ్‌దేవ్ (69) శనివారం ఉదయం ఢిల్లీలో మరణించారు. గత కొంత కాలంగా అనారోగ్యం, గొంతు క్యాన్సర్స్‌తో చికిత్స పొందుతున్నారు. ఎఐటియుసి జాతీయ కార్యదర్శిగా 1994 నుండి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. సచ్‌దేవ్ ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ (ఇపిఎఫ్) ట్రస్ట్ బోర్డు సభ్యులుగా కొనసాగుతున్నారు. సచ్‌దేవ్ హర్యానా రాష్ట్రంలో కార్మికోద్యమంలో ముఖ్య పాత్ర వహించి గుర్గావ్ పారిశ్రామిక ప్రాంతంలో పరిశ్రమల్లోని కార్మికులను సంఘటితపర్చి వారి సమస్యలపై అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించారు. ముఖ్యంగా హీరోహోండా, మారుతి సుజుకి కార్మికులను ముందుండి నడిపించారు. మదర్ డెయిరీ, లోడింగ్, అన్‌లోడింగ్ కార్మిక సంఘాలకు జాతీయ నేతగా ఉన్నారు.

ఎఐటియుసి సంతాపం : సచ్‌దేవ్ మృతి పట్ల ఎఐటియుసి రాష్ట్ర సమితి సంతాపాన్ని, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది. ఎఐటియుసి కార్యాలయం సత్యనారాయణ రెడ్డి భవన్‌లో శనివారం మధ్యాహ్నం సచ్‌దేవ్ చిత్రపటానికి ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు టి.నరసింహన్, ప్రధాన కార్యదర్శి ఉజ్జిని రత్నాకర్ రావు రాష్ట్ర నాయకులు పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.ప్రేంపావని, కె.గంగాధర్ రావు, వి.సీతారామయ్య, కార్యదర్శులు బి.వెంకటేశం, బి.చంద్రయ్య, ఎన్.కరుణకుమారి, నారాయణ రెడ్డి కూడా పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

ఫారెస్ట్ పరీక్షలకు ఉచిత శిక్షణ

మన తెలంగాణ/హైదరాబాద్: ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్, రేంజ్ ఆఫీసర్ పోటీ పరీక్షలు రాయనున్న ఎస్‌సి,ఎస్‌టి, బిసి, మైనార్టీ అభ్యర్థులకు ప్రభుత్వం ఉచిత శిక్షణ ఇవ్వనుంది. ఆసక్తి కలిగిన మైనార్టీ అభ్యర్థుల నుంచి సెప్టెంబర్ 12లోపు దరఖాస్తులను స్వీకరిస్తామని, 15వ తేదీలోపు అడ్మిషన్ పొందాలని తెలంగాణ స్టేట్ మైనార్టీ స్టడీ సర్కిల్ డైరక్టర్ ప్రొఫెసర్ ఎస్.ఎ.షుకూర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మరింత సమాచారం నిమిత్తం 04023236113/ 9059547211 నెంబర్‌కు ఫోన్ చేయాలని ఆయన సూచించారు. అలాగే ఎస్‌సి,ఎస్‌టి, బిసి అభ్యర్థులు సెప్టెంబర్ 6వ తేదీలోపు ఆన్‌లైన్‌లో (studycircle.cgg.gov.in)దరఖాస్తు చేసుకోవాలని గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ ఉప సంచాలకులు వి.సముజ్వల తెలిపారు. సెప్టెంబర్ 21 నంచి అక్టోబర్ 20 వరకు ఎంపికైన అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆమె పేర్కొన్నారు. భద్రాచలం, వరంగల్, ఉట్నూర్, పిఇటిసి, హైదరాబాద్‌లలో శిక్షణకు తగిన ఏర్పాట్లు చేశామని వివరించారు. మరిన్ని వివరాలకు 04027540104 నెంబర్‌ను సంప్రదించాలని సముజ్వల తెలిపారు.

పనిచేయని బోరులకు మార్గదర్శకాలు

– హైకోర్టుకు సమర్పించిన తెలంగాణ రెవెన్యూ శాఖ

మనతెలంగాణ/హైదరాబాద్: పనిచేయని బోరుబావుల వల్ల జరిగే ప్రమాదాల నివారణకు తెలంగాణ ప్రభుత్వం నడుం బిగించింది. గతంలో సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా అమలు చేయబోయే మార్గదర్శకాలను తెలంగాణ రెవెన్యూ శాఖ కార్యదర్శి హైకోర్టుకు సమర్పించారు. వికారాబాద్ జిల్లాలో బోర్లలో పడి చిన్నారులు మృతిచెందిన తర్వాత సుప్రీం మార్గదర్శకాలను అమలు చేసేలా ఆదేశాలివ్వాలని కోరుతూ న్యాయవాది బుద్దారపు ప్రకాశ్ ప్రజాహిత వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. బోరుబావిలో పడిన బాలిక మృతిచెందడంతో బాధిత కుటుంబానికి రూ. 5 లక్షల పరిహారం, పిల్లలకు ఉచిత విద్య, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చామని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. బోరు యజమానిపై కూడా కేసు పెట్టామన్నారు. అదేవిధంగా బోర్లు తవ్వే రిగ్‌ల కంపెనీలు విధిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. రెండేళ్లకోకసారి రెన్యువల్ చేసుకోవాలి.

రిగ్ యజమాని ప్రభుత్వం నుంచి రిజిస్ట్రేషన్ ధ్రువపత్రాన్ని పొంది ఉండాలి. రిజిస్ట్రేషన్ చేయించుకోకపోతే రూ. లక్ష వరకు జరిమానా చెల్లించాల్సివస్తుంది. అప్పటికీ రిజిస్ట్రేషన్ చేయకపోతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ప్రైవేటు వ్యక్తుల వరకు బోర్లు తవ్వకం చేపట్టాలంటే ముందుగా మండల తహసీల్దార్ అనుమతి పొందాలి. దాన్ని సదరు తహసీల్దార్ పర్యవేక్షించాలి. తవ్విన బోర్లకు మూత వేయకపోతే బోరు యజమానిపై తహసీల్దార్ చర్యలు తీసుకోవాలి. పనిచేయని బోర్లపై జిల్లా కలెక్టర్ల అధ్యక్షతన సిబ్బంది సర్వే చేయించి వారంలోగా మూసివేసేలా చర్యలు తీసుకోవాలి. మూయని పక్షంలో బోరు యజమానికి రూ. 50 వేల జరిమానా, క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. తహసీల్దార్ పర్యవేక్షణలో గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ పంచాయతి కార్యదర్శి, సర్పంచ్ సర్వే చేపట్టాలి అని మార్గదర్శకాలను కోర్టుకు తెలిపింది. దీనిపై విచారణ ఈ నెల 30న జరుగనుంది.

'కాళేశ్వరం' అభిప్రాయం సేకరణం

- మంచిర్యాలలో బాధితులను ఈడ్చుకెళ్లిన పోలీసులు
- సిద్ధిపేట జిల్లాలో నిరసనలు
- పూర్తయిన ప్రజాభిప్రాయ సేకరణ

జిల్లాలనుంచి మన తెలంగాణ ప్రతినిధులు: అడుగడుగునా పోలీసు బందోబస్తు.... డ్రోన్లతో నిఘా... బాధితుల అడ్డగింత .. ప్రతిపక్షాల నిరసన... అధికార పార్టీ నాయకుల సమర్థనలు .. ఇదీ కాళేశ్వరం ప్రాజెక్టుపై శనివారం జరిగిప్రజాభిప్రాయ సేకరణ దృశ్యాలు. సిద్ధిపేట, సిరిసిల్ల, భూపాలపల్లి, మంచిర్యాల జిల్లాల్లో ఆయా జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలో శనివారం బహిరంగ విచారణ నిర్వహించారు. మంచిర్యాల జిల్లా జైపూర్ తహసీల్ధార్ కార్యాలయంలో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. జక్కం రాజయ్య అనే నిర్వాసితునికి సంబంధించిన పరిహారం డబ్బులు రాక పోవడంపై ఆయన కుమార్తె జక్కం శ్రీలత అధికారులను నిలదీశారు. దీంతో పోలీసులు ఆమెను వేదిక వద్ద నుంచి బయటకు ఈడ్చుకెళ్లి పోలీసు జీపులో ఎక్కించారు. ఆమె తల్లిదండ్రులపై కూడా దురుసుగా ప్రవర్తించారు. అంతకు ముందు ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమానికి వచ్చే బాధితులను, ప్రతిపక్ష నాయకులను రాకుండా అడ్డుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశారు. ఇందుకు అడుగడుగున పోలీసులు వాహనాల తనిఖీ పేరుతో వారిని అడ్డుకున్నారు. వేదిక తహసీల్దారు కార్యాలయంలో నిర్వాసితుల కంటే టిఆర్‌ఎస్ నేతలు, పోలీసులే అధికంగా కనిపించారు. టిఆర్‌ఎస్ నేతలు మరో అడుగు ముందుకేసి ప్రతిపక్ష నేతలు మాట్లాడుతుంటే వారి మైకులు గుంజుకున్నారు. అధికారుల ఏకపక్షంగా వ్యవహరించి ప్రతిపక్ష నేతల మైక్‌లు కట్ చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుండా మల్లేష్ మాట్లాడుతుంటే పోలీసులు మైక్ కట్ చేశారు. ఇందారం సింగరేణి ఓపెన్‌క్యాస్ట్‌ను అంతా వ్యతిరేకించినా, పనులు ప్రారంభించారని, ఇలాంటప్పుడు ప్రజాభిప్రాయ సేకరణకు విలువేంటని టిడిపి నేత సంజయ్ కుమార్ ప్రశ్నించారు.

భూపాలపల్లిలో డ్రోన్‌లతో నిఘా

జిల్లా కేంద్రంలోని ఎఎస్‌ఆర్ గార్డెన్‌లో కలెక్టర్ మురళి అధ్యక్షతన ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. దీనికి భారీ పోలీసు బందోబస్తుకు తోడు శాంతిభద్రతల పర్యవేక్షణ కోసం భూపాలపల్లి జిల్లాలో డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేశారు. డ్రోన్ల వీడియోల ఆధారంగా భారీగా స్పెషల్ పార్టీ, పారామిలిటరీ, ఎఆర్, గ్రేహౌండ్స్ పోలీసులను రంగంలోకి దింపారు. ఈ సమావేశం రసాభాసగా మారింది. మంథని ఎంఎల్‌ఎ పుట్ట మధు, ప్రతిపక్ష పార్టీల నేతలు శ్రీధర్‌బాబు, గండ్ర వెంకటరమణారెడ్డి, సీతక్క, గండ్ర సత్యనారాయణరావు, వెన్నెంపల్లి పాపయ్య, అప్పం కిషన్ తదితరులు పాల్గొని అభిప్రాయాలు చెప్పారు. ప్రజాభిప్రాయ సేకరణకు రైతులు రాకుండా వాహనాల తనిఖీ పేరుతో ఇబ్బందులకు గురిచేశారని ప్రతిపక్షాలు విమర్శించాయి.చట్టబద్ధంగా రైతుల వద్ద నుంచి రెవెన్యూ శాఖ భూమిని సేకరించాల్సి ఉండగా, దీనికి విరుద్ధంగా కాంట్రాక్టర్ల చేత ఈ పనిచేయిస్తున్నారని, ఇటువంటి విధానానికి తాము వ్యతిరేకమని ప్రకటించారు. ప్రాజెక్టు నిర్మించే ప్రాంతంలోనే విచారణ చేయాల్సి ఉందని, విధివిధానాలు పాటించాలని చెబుతూంటే పోలీసులను ప్రయోగిస్తున్నారని విమర్శించారు.గంభీరావుపేటలో జరిగిన బహిరంగ విచారణలో కాంగ్రెస్ నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. సభకు హాజరై విచారణకు అంతరాయం కలిగిస్తారనే అనుమానంతో పోలీసులు అడ్డుకున్నట్లు కాంగ్రెస్ నేత కటకం శ్రీధర్ తెలిపారు. తమ అభిప్రాయం చెప్పడానికి వస్తే అడ్డుకోవడం అప్రజాస్వామికం అని విమర్శించారు. మల్లన్నసాగర్ నిర్వాసితుల నిరసనల మధ్య సిద్ధిపేట జిల్లా ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. వేములఘాట్, ఎర్రవెల్లి, పల్లెపహాడ్, ఏటిగడ్డ కిష్టాపూర్ గ్రామాలకు చెందిన వారు సమావేశ స్థలంలో నిరసన తెలిపారు. సరైన పరిహారం చెల్లించకుండా అన్యాయం చేస్తున్నారని ఆగ్రహంతో నినాదాలు చేశారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. నిరసనలు తెలుపుతున్న వారిని పోలీసులు బలవంతంగా బయటకు పంపించారు. వీరికి టిడిపి, కాంగ్రెస్ నేతలు మద్ధతు తెలుపుతూ రాస్తారోకోకు దిగారు. పోలీసులు మఫ్టీలో తిరుగుతూ గొడవలు చేస్తారని అనుమానించిన వాళ్లను ప్రాంగణానికి రానీయలేదు. దారి మొత్తం పూర్తిగా పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో పర్యావరణ ప్రభావంపై బహిరంగ విచారణ ప్రక్రియ పూర్తయ్యింది. నాలుగు రోజుల్లో 15 జిల్లాలో ప్రజాభిప్రాయ సేకరణ జరగగా, సెప్టెంబరులో మహారాష్ట్రలోని ముంపు ప్రాంతాల్లో బహిరంగ విచారణ నిర్వహించనున్నారు.

స్వేచ్ఛగా ప్రజాభిప్రాయ సేకరణ : హరీశ్‌రావు

కాళేశ్వరం ప్రాజెక్టుకు ప్రజలు, రైతులు, అన్ని వర్గాలు ముక్తకంఠంతో మద్దతు ప్రకటించారని, మునుపెన్నడూ లేనివిధంగా స్వేచ్ఛాయుత వాతావరణం ప్రభుత్వం కల్పించిందని నీటి పారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు హర్షం వ్యక్తం చేశారు. అందుకే 15 జిల్లాల్లో అభిప్రాయ సేకరణ సజావుగా జరిగిందని చెప్పారు. ఈ మేరకు ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ కాంగ్రెస్ నాయకులకు ఇప్పటికైనా కను విప్పు కలగాలన్నారు.ప్రజాక్షేత్రం వదిలి గ్రీన్ ట్రిబ్యునళ్లు, కోర్టుల చుట్టూ తిరగడం మానుకోవాలని సూచించారు. గతంలో పోలవరం వంటి ప్రాజెక్టుల పబ్లిక్‌హియరింగ్ సందర్భంగా పలు అవాంఛనీయ ఘటనలు జరిగాయన్నారు.





ఖట్టర్‌ను తొలగించాలి: సురవరం



మన తెలంగాణ / హైదరాబాద్ : డేరా సచ్చా సౌధ ఆధ్యాత్మిక గురువు గుర్మిత్ రాం రహీం సింగ్ కేసులో పంజాబ్, హర్యానా, రాజస్థాన్‌లో ఘటనలు బాధాకరమని, 36 మంది పోలీసుల కాల్పుల్లో మరణించడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యమని సిపిఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి అన్నారు. అల్లర్లను నివారించడంలో విఫలమైన, పనికిరాని హర్యానా ముఖ్య మంత్రికి ఒక్క నిమిషం కూడా అధికారంలో ఉండే హక్కు లేదని, తక్షణం ఆయన రాజీనామా చేయాలని, లేదా ఆయనను తొలగించాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో ఈ నెల 22, 23 తేదీల్లో జరిగిన సిపిఐ జాతీయ కార్యవర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను శనివారం హైదరాబాద్‌లోని మఖ్దుంభవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో వివరించారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి కూడా పాల్గొన్నారు. సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ పనామా పేపర్స్‌లో దేశానికి చెందిన వారిపై వచ్చిన ఆరోపణలు, తీసుకున్న చర్యలపై శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో ఆరోపణలు వచ్చిన 500 మంది పేర్లను ప్రభుత్వం సీల్డ్ కవర్‌లో సుప్రీంకోర్టుకు అందజేసిందే తప్ప వాటిపై బహిరంగ విచారణ జరిపి ఎందుకు చర్యలు తీసుకోలేదని ఆయన ప్రశ్నించారు. పనామా పేపర్లలో అధికార పార్టీకి చెందిన నాయకులకు సంబంధం ఉందని, వారిని రక్షించేందుకు ప్రయత్నిస్తుందని అనుమానాలున్నాయని, ఈ విషయంలో విచారణ జరిపి నిజనిజాలు తేల్చాలని ఆయన డిమాండ్ చేశారు. విదేశాల్లో వేల కోట్ల రూపాయలు దాచుకున్న వారికి బిజెపి కొమ్ము కాస్తుందని ఆయన విమర్శించారు. అవినీతి పేరుతో విభిన్న పార్టీల నాయకులపై రాజకీయ ఉద్దేశ్యంతో దాడులు జరుగుతున్నాయని, అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న బిజెపి అవినీతి రహిత ప్రభుత్వంగా చెప్పుకోవడం విడ్డురంగా ఉందన్నారు. బిజెపి పాలిత రాష్టాలలో అనేక మంది బిజెపి నాయకులపై పలు ఆరోపణలు వచ్చాయని, వాటిపై విచారణ ఎందుకు జరపడం లేదని, బిజెపి నాయకులకు ఒక పద్ధతి ఇతర పార్టీల నాయకులకు ఒక పద్దతా అని ప్రశ్నించారు. బ్యాంకులలో నిరర్థక ఆస్తుల (ఎన్‌పిఎ) పేరు తో రూ.81 వేల కోట్లను, మొత్తం కార్పొరేట్ కంపనీలకు రూ.2.56 లక్షల కోట్ల అప్పులను ప్రభుత్వం రద్దు చేస్తే నోరెత్తని ఆర్‌బిఐ, బ్యాంకులు రైతుల అప్పులను రద్దు చేయాలని, సబ్సిడీ ఇవ్వాలని కోరితే అడ్డు చెబుతున్నాయన్నారు. రద్దు చేసిన కార్పొరేట్ అప్పులను ఛార్జీల పేరుతో ప్రజలు, ఖాతాదారుల నుంచి వసూలు చేసేందుకు ప్రయత్నిస్తుందన్నారు.

15 నుంచి నెల రోజుల పాటు ఉద్యమాలు

బిజెపి ప్రభుత్వ అవినీతికి, ఎన్‌పిఎ పేరుతో కార్పోరేట్ సంస్థలకు వేల కోట్ల అప్పులను రద్దు చేయడానికి వ్యతిరేకంగా, అధిక ధరలు, రైతుల సమస్యలపై సెప్టెంబర్ 15 నుంచి నెల రోజుల పాటు ఆందోళనలు చేపట్టనున్నట్లు సురవరం సుధాకర్ రెడ్డి ప్రకటించారు. ప్రజలకు రేషన్ దుకాణాల్లో నిత్యావసర వస్తువుల పంపిణీని రద్దు చేసి 'డైరెక్ట్ బెనిఫిట్ స్కీమ్' పేరుతో నేరుగా నగదు ఇవ్వడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను సిపిఐ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో ధర్నా చేయడం ద్వారా సిఎం కెసిఆర్ నియంతృత్వ పోకడలను దేశానికి చాటి చెప్పామన్నారు. ధర్నా చౌక్ సమస్యపై, ఇసుక లారీల బాధిత కుటుంబాలకు న్యాయం కోసం కేంద్ర హోంమంత్రి రాజ్ నాథ్ సింగ్‌ని కలిశామని, ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. రాష్ట్రపతికి నెరేళ్ల ఘటనపై ఫిర్యాదు చేసామని, రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడుతామని చెప్పారన్నారు. ప్రతిపక్షాలతో ప్రభుత్వం ఘర్షణ వైఖరి మానుకుంటేనే ప్రగతి సాధ్యమౌతుందని, లేనట్లయితే ప్రతి పక్షాలు, ప్రజలు తిరుగబడతారన్నారు. ప్రాజెక్టులపై ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజలపై దాడులను ఆయన ఖండించారు.

ప్రధాని పార్టీకి కాదు

(3వ పేజీ తరువాయి)

ఘర్షణలలో చనిపొయ్యారు. రెండు మూడు రాష్ట్రాలకు అల్లర్లు ఎగబాకాయి. హర్యానా ప్రభుత్వం చేయాల్సింది చేశామనే ధోరణిని, కేంద్రం సంబంధిత రాష్ట్రం చూసుకుంటుందనే వైఖరిని ప్రదర్శించడం అనుచితంగా ఉందని ధర్మాసనం స్పష్టం చేసింది. కోట్లాది రూపాయల ఆస్తి నష్టం జరిగింది, వెలకట్టలేని రీతిలో ప్రాణనష్టం జరిగింది. దీనిపై కేంద్రం వైఖరి అంటీఅంటనట్లుగా , తేలికగా తీసుకునే వైఖరిగా ఉందని వ్యాఖ్యానించారు. ప్రధాని ఈ ఘర్షణలపై స్పందిస్తూ ఖండన వెలువరించడం గురించి కోర్టు ప్రస్తావించింది. కేంద్రం స్పందన కేవలం కంటితుడుపుగా ఉందని తెలిపారు. కేంద్రం ఈ ప్రాంతాన్ని తమ గుత్తాధిపత్య ప్రాంతంగా (కాలనీగా) ఎందుకు భావించుకొంటోంది? వారి వ్యవహార శైలి కేంద్రం తీరుకు, దేశ ప్రధాని హోదాకు తగ్గట్లుగా లేదని వ్యాఖ్యానించారు. దేశ సమగ్రత అనేది పార్టీలకు అతీతం, మనది ఒక దేశం అనుకుంటున్నారా? లేక ఏకపార్టీ దేశం అనుకుంటున్నారా? అని ధర్మాసనం నిలదీసింది. ఇతర పార్టీలు పాలించే రాష్ట్రాల్లోనూ ఇలాంటి ఘర్షణలు జరుగుతూనే ఉంటాయని కేంద్రం తరపున అదనపు సొలిసిటర్ జనరల్ సత్యపాల్ జైన్ చేసిన వాదనపై ధర్మాసనం ఈ విధంగా స్పందించింది. ఈ సందర్భంగానే హర్యానాలోని బిజెపి ప్రభుత్వం ఓట్లకోసం దేరాకు దాసోహం అవుతోందని ధర్మాసనం మండిపడింది.

రాజకీయ దాసోహం అంటారా...డేరా ముందు దేహీ అంటారా?

'ఓటు బ్యాంక్‌ల పదిలం కోసం దోషి డేరా సచ్చా సౌధాకు రాజకీయంగా దాసోహం అవుతారా?'... ఇదేం తీరు అంటూ పంజాబ్ హర్యానా హైకోర్టు శనివారం హర్యానా ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌పై నిప్పులు చెరిగింది. సౌధా అధినేత గుర్మీత్ రామ్ రహీం ఓ రేప్ కేసులో దోషి అనే సిబిఐ కోర్టు తీర్పు తరువాత హర్యానాలో తలెత్తిన తీవ్ర హింసాకాండ దారుణం అని సంయుక్త హైకోర్టు వ్యాఖ్యానించింది. రాజకీయ ప్రయోజనాల కోసం పంచకుల వంటి పట్టణం తగులబడిపోవాలనుకుంటున్నారా? అని ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. పంజాబ్, హర్యానా రాష్ట్రాలలో ఈ దోషి మద్దతుదార్లు భారీ స్థాయిలో హింసాకాండకు దిగారు. పలు చోట్ల జరిగిన నిరసనలు, ఘర్షణలలో 31 మందికి పైగా మృతి చెందారు. సంబంధిత పంచకుల డిసిపిని సస్పెండ్ చేసిన వైనం గురించి ధర్మాసనం ప్రస్తావించింది. అధికార యంత్రాంగం ఈ పోలీసు అధికారిని బలిపశువును చేసిందని, అంతకు మించి దీనికి వేరే అర్థాలు లేనేలేవని స్పష్టం చేసింది. తీర్పు వెలువడుతుందని తెలిసినా, అధికార యంత్రాంగం ఎందుకు సరైన భద్రతా ఏర్పాట్లు చేయలేదు. అల్లరి మూకలు పేట్రేగిపోకుండా చర్యలు ఎందుకు తీసుకోలేదు? ఈ పేలవమైన భద్రతా ఏర్పాట్లపై సమగ్ర, లోతైన దర్యాప్తు జరిపించాలని ఆదేశించారు. పరాయి శక్తులు రావడానికి బస చేయడానికి , అరాచకానికి దిగడానికి అనుమతించినట్లుగా కన్పిస్తోందని పేర్కొన్నారు. సంఘు విద్రోహ శక్తులే అల్లర్లకు కారణమని ముఖ్యమంత్రి ఖట్టర్ వ్యాఖ్యానించడాన్ని హైకోర్టు తప్పుపట్టింది. అల్లరిమూకలు, దుండగులు రంగ ప్రవేశం చేస్తారని ఊహించినప్పుడు వారు రాకుండా ఎందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోలేదని నిలదీశారు. ఇప్పుడు దాఖలైన ప్రజావ్యాజ్యంపై తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేశారు. సోమవారం సిబిఐ కోర్టు దోషికి శిక్షస్థాయిని ఖరారు చేసి వెలువరిస్తుంది. 15 ఏళ్ల క్రితం ఇద్దరు మహిళలపై అత్యాచారం చేసినట్లు నిర్థారణ అయి దోషిగా ఖరారు అయిన వ్యక్తిపై ఉన్న అభిమానం పెల్లుబికి, తీవ్రస్థాయి హింసాజ్వాలకు దారితీసింది. తీర్పు వెలువడిన క్షణాలలోనే రెచ్చిపోయిన మద్దతుదార్లు రాష్ట్రంలో కార్యాలయాలను ధ్వంసం చేశారు, వాహనాలను తగులపెట్టారు. రైల్వే స్టేషన్లపై కూడా దాడికి దిగారు. దీనితో పంచకుల రణస్థలిగా మారింది. నెత్తురు చిందింది. శుక్రవారం నాటి పరిమిత హింస తరువాత హర్యానా, పంజాబ్, తరువాత రాజస్థాన్ వరకూ పాకింది. పలు చోట్ల విధ్వంసకాండ సాగింది. చివరికి ఉత్తరప్రదేశ్‌లో కూడా డేరా అధినేత అభిమానులు హింసకు దిగారు.

జరిగిన నష్టానికి పైసాతో చెల్లించుకో డేరా

ఘర్షణలపై తీవ్రంగా మండిపడ్డ హైకోర్టు జరిగిన ఆస్తుల నష్టానికి సచ్చా డేరా నుంచి డబ్బులు రాబట్టాలని ఆదేశించింది. జరిగిన ఆస్తినష్టం ఎంత అనేది లెక్కలు కట్టాలని, ఇదే సమయంలో ఈ మఠం ఆస్తుల వివరాలు ఎంత? వారి ఆదాయం ఎంత? అనేది రాబట్టాలని ఆదేశించారు. డేరా చర స్థిరాస్తులు, బ్యాంకు ఖాతాల వివరాలను వెలికితీసి, తమకు జాబితా అందించాలని న్యాయస్థానం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న డిప్యూటీ కమిషనర్లను ఆదేశించింది.

ట్రిబ్యునల్ ఆదేశాల అమలుకు హామీ ఇవ్వాలి

మనతెలంగాణ/హైదరాబాద్: ఉద్యోగుల సర్వీసులను రెగ్యులరైజ్ చేయాలని పరిపాలనా ట్రిబ్యునల్ ఆదేశాలను అమలు చేయకపోవడంపై తెలంగాణ ప్రభుత్వంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఉత్తర్వలను ఖాతరు చేయకపోవడం న్యాయవ్యవస్థను నిర్లక్ష్యం చేయడమే అవుతుందని న్యాయమూర్తులు సివి. నాగార్జున రెడ్డి, జి. శ్యాంప్రసాద్‌లతో కూడిన డివిజన్ బెంచ్ వ్యాఖ్యానించింది. వైద్య ఆరోగ్య శాఖలో తమ సర్వీసులను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ శ్రీనివాసరావు మరో 20 మంది 1999లో ఎపి అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్‌లో కేసు వేశారు. దీంతో ట్రిబ్యునల్ 2001 లో మిగతా సిబ్బంది మాదిరిగానే కనీస వేతనాలు చెల్లించి, వారి సర్వీసులను రెగ్యులరైజ్ చేయాలని అప్పటి సమైక్య ఎపి ప్రభుత్వాన్ని ట్రిబ్యునల్ ఆదేశిస్తూ తీర్పు వెలువరించింది. అయితే ఇప్పటికీ ట్రిబ్యులన్ ఉత్తర్వులు అమలు కాకపోవడంతో బాధిత పిటిషనర్లు హైకోర్టులో వ్యాజ్యాన్ని దాఖలు చేశారు.

యాదాద్రి ప్లాంట్ పనులు బిహెచ్ఇఎల్‌కు అప్పగింత

మన తెలంగాణ/హైదరాబాద్: యాదాద్రి అల్ట్రా మెగా పవర్ ప్లాంట్ నిర్మాణానికి అన్ని అనుమతులు వచ్చిన నేపథ్యంలో నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని జెన్‌కో, బిహెచ్ఇఎల్ నిర్ణయించాయి. రూ.17 వేల కోట్ల అంచనా వ్యయంతో నిర్మించతలపెట్టిన ఈ ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వ రంగ సంస్థ అయిన బిహెచ్ఇఎల్‌కు ప్రభుత్వం అప్పగించింది. ఇటీవలే యాదాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణానికి సంబంధించిన పర్యావరణ అనుమతి కూడా లభించింది. ఈ నేపథ్యంలో విద్యుత్‌సౌధలో యాదాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణానికి సంబంధించిన సమీక్షా సమావేశం శనివారం జరిగింది. జెన్‌కో సిఎండి దేవులపల్లి ప్రభాకరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో బిహెచ్ఇఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గోపాలకృష్ణ, జిఎం మనోజ్ షా, జెన్‌కో డైరెక్టర్ రాధాకృష్ణ, ఇడిలు లక్ష్మయ్య, అజయ్, ఎస్ఇ హనుమాన్ తదితరులు పాల్గొన్నారు. పర్యావరణ అనుమతులు ఇస్తూ జారీచేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా చేపట్టాల్సిన చర్యలు, సాంకేతిక అంశాలపై చర్చించారు. ప్రాజెక్టు డిజైన్‌ను ఖరారు చేశారు. సోమవారం జెన్‌కో సిఎండి ప్రభాకరరావు, బిహెచ్ఇఎల్ సిఎండి అటుల్ సోప్తీ ఆధ్వర్యంలో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించి ప్లాంట్ పరిపాలన, సాంకేతిక, వ్యయానికి సంబంధించిన అంశాలపై తుది నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించారు. పవర్‌ప్లాంట్ నిర్మాణాన్ని శరవేగంగా పూర్తిచేయాలని, అన్ని యూనిట్లు ఒకేసారి ప్రారంభించాలని నిర్ణయం తీసుకున్నారు. గత నెల 25న డిల్లీలో ముఖ్యమంత్రి కెసిఆర్ స్వయంగా బిహెచ్ఇఎల్‌తో సమీక్షించిన విషయాన్ని ప్రభాకరరావు గుర్తుచేశారు. ప్రాజెక్టు నిర్మాణానికి ఆర్థిక సహకారం అందించేందుకు గ్రామీణ విద్యుదీకరణ సంస్థ (ఆర్ఇసి), పవర్ ఫైనాన్స్ కార్పోరేషన్ (పిఎఫ్‌సి) ముందుకొచ్చాయన్నారు. కొత్తగూడెం, మణుగూరు థర్మల్ ప్లాంట్ల నిర్మాణం వేగంగా జరుగుతోందన్నారు. ఈ ఏడాది డిసెంబరు నాటికి కొత్తగూడెంలో, మార్చి నాటికి మణుగూరు నుంచి విద్యుత్ అందుబాటులోకి వస్తుందన్నారు.

మూడు నెలలూ అక్కడే

(3వ పేజీ తరువాయి)

సూచించారు. గ్రామాల్లో 15 మందితో గ్రామ రైతు సమన్వయ సమితి, 24 మంది చొప్పున మండల, జిల్లా రైతు సమితి, 42 మందితో రాష్ట్ర స్థాయి రైతు సమన్వయ సమితి ఏర్పాటవుతుందని తెలిపారు. గ్రామాల్లో సమితులను ఎంఎల్‌ఏలే నామినేట్ చేయాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమం గ్రామీణ వ్యవసాయ ఆర్థిక ముఖ చిత్రాన్ని మార్చేస్తుందని, కాబట్టి ఎంఎల్‌ఏలు దృష్టి సారించాలన్నారు.

ఈ పని విజయవంతంగా పూర్తి చేస్తే, నూటికి నూరు శాతం మళ్ళీ గెలుస్తారని, కాబట్టి అందరూ శ్రద్ధతో నిర్వహించాలని, అందరికీ మళ్ళీ టిక్కెట్లు వస్తాయని చెప్పారు. 2019 ఎన్నికల్లో కూడా టిఆర్‌ఎస్ విజయం ఖాయమన్నారు. విపక్షాలను ప్రజలు నమ్మడం లేదని, సర్వేలన్నీ టిఆర్‌ఎస్‌కే అనుకూలంగా ఉన్నాయన్నారు. అయితే, రిజర్వ్‌డ్ నియోజకవర్గాల్లో ఎంఎల్‌ఏలపై కొంత వ్యతిరేక ఉందన్నారు.

ఊపిరి పీల్చుకున్న ఎంఎల్‌ఏలు: ఈ సారి టిఆర్‌ఎస్ ఎల్‌పి సమావేశంలో ఎంఎల్‌ఏల పనితీరుపై తాజా సర్వే వివరాలు ఏమైనా ప్రకటిస్తారేమోనని సభకు హాజరయ్యేముందు శాసనసభ్యులు భావించారు. అయితే, అలాంటిదేమి లేకపోవడంతో వారు ఊపిరిపీల్చుకున్నారు.



కార్మికులను అన్ని రకాలుగా ఆదుకుంటాం : కేంద్ర మంత్రి దత్తాత్రేయ

మన తెలంగాణ / తాండూరు రూరల్: దేశానికే రైతు వెన్ను ముక, కేంద్ర కార్మిక సహాయక మంత్రి బండారు దత్తాత్రేయ అన్నారు. శనివారం మండల పరిధిలోని జినగుర్తి గ్రామ పరిధిలో వెలసిన ఏకలవ్య సేంద్రియ వ్యవసాయ పరిశోధన శిక్షణ భూమి పూజా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏకలవ్య సేంద్రియ వ్యవసాయ శిక్షణ కేంద్రంలో 104ఎకరాలలో ఈ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఎంపీ కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు కావల్సిన అన్ని సౌకర్యాలను కల్పిస్తు భూసార పరీక్షలు నిర్వహించి సారవంతమైన భూములను గుర్తించి వారి వారి పొలాలలో ఎలాంటి పంటలు వేస్తే అధిక లాభం చేకూరుతుందని అధికారులు ద్వారా రైతులకు సలహాలు సూచనలు ఇచ్చి అధిక దిగుబడి వచ్చే విధంగా చూస్తుందని చెప్పారు.మంత్రి మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఏకలవ్య సేంద్రియ పరిశోధన కేంద్రానికి కావాల్సిన సహాయక సహకరాలు మా ప్రభుత్వం నుండి అందిస్తామని తెలిపారు. చేవెళ్ల ఎంపీ కొండావిశ్వేశ్వర్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ నర్సాపూర్ ఎంపి గంగరాజు, ఏకలవ్య ఫౌండేషన్ వ్యవస్థాపకులు వేణుగోపాల్‌రెడ్డి, ఆర్‌ఎస్‌ఎస్ జాతీయ సహాయక కార్యదర్శి బాగాయ్య, టి. వేణుగోపాల్‌రావు, గోవింద్‌రావు, ఓఎన్‌జిసిస్ డైరెక్టర్ మిశ్రా, ఏకలవ్య ఫౌండేషన్ సలహాదారు సత్యనారాయణ పాల్గొన్నారు.



వరంగల్ అర్బన్ జిల్లా కలెక్టర్ అమ్రపాలి రూపంతో చేతిలో బాల గణపతితో కాజీపేటలో ఏర్పాటు చేసిన విగ్రహమిది. ప్రతిష్ఠించిన ఈ ఫోటో మీడియాలో వైరల్ కావడం, తన విగ్రహం ఏర్పాటు చేయడం పట్ల అమ్రపాలి ఆగ్రహం వ్యక్తం చేయడంతో నిర్వాహకులు విగ్రహానికి నలుపు రంగు పూశారు. – మనతెలంగాణ/కాజీపేట

విమానంలో కో–పైలట్‌కు గుండెపోటు

అత్యవసరంగా ల్యాండ్ అయిన ఖతార్ విమానం

మన తెలంగాణ/శంషాబాద్ : ఖతార్ విమానం అత్యవసరంగా ల్యాండింగ్ అయిన సంఘటన శనివారం ఉదయం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో చోటుచేసుకుంది. దోహా నుండి రోమ్ వెళుతున్న ఖతార్ విమానం కో–పైలట్‌కు గుండె పోటు వచ్చింది. దీంతో శంషాబాద్ ఎటిసి అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఇక్కడి అధికారులు రన్‌వేను క్లియర్ చేశారు. దీంతో అత్యవసరంగా ల్యాండ్ చేసినట్లు తెలిపారు. విమానంలో ఉన్న 225మంది ప్రయాణికులు సురక్షితంగా ఉన్నారు. విమానం ల్యాండింగ్ అయిన వెంటనే కో–పైలట్‌ను జూబ్లీహిల్స్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

బిపి మండల్ శత జయంతిని జాతీయ ఉత్సవంగా ప్రకటించాలి

మన తెలంగాణ/హైదరాబాద్/ముషీరాబాద్ : బిసిల జీవితంలో వెలుగును నింపిన సామాజిక పరివర్తకుడు బిపి మండల్ శత జయంతి ఉత్సవాలను జాతీయ ఉత్సవంగా ప్రకటించాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బిపి మండల్ 99వ జయంతి సందర్భంగా శనివారం హైదరాబాద్ విద్యానగర్ బిసి భవన్‌లో బిపి మండల్ జయంతి సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్.కృష్ణయ్య హాజరై పూలమాలలేసి నివాళులర్పించారు. బిసి సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ జయంతిలో కృష్ణయ్య ప్రసంగించారు. మండల్ కమిషన్‌లోని మిగతా 38 సిఫార్సులను పూర్తిగా అమలులోకి తెచ్చి బిసిల సమగ్రాభివృద్ధికి పాటుపడినప్పుడే ఆయనకిచ్చే నిజమైన నివాళి అర్పించినట్లన్నారు. రాజ్యాంగంలోని 340 ఆర్టికల్ ప్రకారం ఏర్పాటు చేసిన మండల్ కమిషన్ సిఫార్సులలోని కేవలం 2 సిఫార్సులను మాత్రమే అమలుల్లోకి వచ్చాయని, మిగతా 38 సిఫార్సులను ఇంత వరకు అమల్లోకి తేకపోవడం పట్ల ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బిసి సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు, కార్యదర్శి గుజ్జ గుజ్జ, జి.రమేష్, బిసి సంక్షేమ సంఘం, విద్యార్థి, యువజన, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం ప్రతినిదులు నీల వెంకటేష్, కె.నర్సింహాగౌడ్, చీపురు మల్లేష్ యాదవ్, కృష్ణుడు, జి.కృష్ణయాదవ్, గంగనబోయిన రాంబాబు, పగిల్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో కౌలు రైతు మృతి

మన తెలంగాణ/హుజూరాబాద్: కరీంనగర్ జిల్లా మండలంలోని రంగాపూర్ గ్రామానికి చెందిన ఓ కౌలు రైతు అప్పుల బాధతో శుక్రవారం మరణించినట్లు గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపారు. గ్రామానికి చెందిన బింగిని ప్రభాకర్(42) అనే రైతు మూడు ఎకరాల భూమిని కౌలు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. వర్షాలు సరిగ్గా కురవక వేసిన పంట ఎండిపోయె స్థితికి చేరడంతో తెచ్చిన అప్పులు వడ్డీలు పెరిగిపోతుండటంతో మానసిక ఆందోళనకు గురై స్పృహ తప్పి పడిపోవడంతో గమనించిన కుటుంబ సభ్యులు 108 వాహనం ద్వారా హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కు మార్తెలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి

మన తెలంగాణ/జోగిపేట : సంగారెడ్డి జిల్లా అందోలు మండల కేంద్ర మైన జోగిపేటలో శుక్రవారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందగా, మరొక యువకుడు సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. జోగిపేట పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అందోలు మండలం ఎర్రారం గ్రామానికి చెందిన ముగ్గు రు యువకులు బంటు రమేశ్ (21), పాషా (24), చాకలి ప్రభాకర్ (18)లు శుక్రవారం ఆటోలో జోగిపేటకు రాగా, పట్టణంలోని జాతీయ రహదారి 161పై ఎదురుగా వస్తున్న హైదరాబాద్ 2 డిపోకు చెందిన ఆర్టీసి బస్సు, ఆటో ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ఆటో, బస్సు బలం గా ఢీ కొనడంతో ఆటో నుజ్జు నుజ్జు అయ్యింది. కాగా, ప్రమాదంలో రమేశ్, పాషాలు అక్కడిక్కడే మృతి చెందా రు. చాకలి ప్రభాకర్ పరిస్థితి విషమంగా ఉండడంతో అతడిని జిల్లా కేంద్రమైన సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంగారెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రభాకర్ శనివారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు జోగిపేట ఎస్‌ఐ పరమేశ్వర్‌గౌడ్ తెలిపారు. కాగా, రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు మృతి చెందడంతో అందోలు మండలం ఎర్రారం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుల కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి.

నాలుగు క్యాన్ల కల్తీ నూనె స్వాధీనం

మన తెలంగాణ/పరిగి : కల్తీనూనె తయారు చేస్తున్నారన్న సమాచారంతో పోలీసులు ఓలాడ్జిపై దాడి చేసి నాలుగు క్యాన్ల కల్తీనూనెను స్వాధీనం చేసుకున్నారు. పరిగి ఎస్‌ఐ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం..పరిగి పట్టణంలో కల్తీనూనె తయారీ చేస్తున్నట్లు సమాచారం రావడంతో శనివారం అమర్‌రాథ్‌లాడ్జిపై పోలీసులు దాడులు నిర్వహించారు. కల్తీనూనె తయారీ చేస్తున్నట్లు గుర్తించి లాడ్జిలో నిలువ ఉంచిన నూనె క్యాన్లను స్వాధీనం చేసుకున్నారు. డాల్డా, వెన్న ఇతర వాటిని కలిపి ఈ కల్తీ నూనె తయారు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కల్తీనూనె తయారు చేస్తున్న వారు ఎవరన్నది ఇంకా తెలియరాలేదని పోలీసులు తెలిపారు. కాగా లాడ్జిలో నూనె తయారీ చేసిన వారు ముడావత్ శంకర్‌నాయక్, మరో ముగ్గురు వ్యక్తులు ఉన్నట్లు సమాచారం. పరిగి పట్టణ నడిబొట్టున లాడ్జిలో కల్తీ నూనె తయారీ చేస్తున్న వారిని గుర్తించడంలో పోలీసులు విఫలమయ్యామంటూ పట్టణ ప్రజలు తప్పుపడుతున్నారు. పరిగిలో డిఎస్పీ, సీఐ, ఇద్దరు ఎస్‌ఐలు, పోలీసులున్నా వారి పనితీరు ఏపాటిదో అర్థమవుతుందని మండిపడుతున్నారు.

నల్లగొండ జిల్లాలో డేరా బాబా పాగా

- పదేళ్ళ క్రితం వెలిమినేడు వద్ద భూముల కొనుగోలు
- 56 ఎకరాల్లో ఆశ్రమం ఏర్పాటుకు యత్నాలు



మన తెలంగాణ/ నల్లగొండ ప్రతినిధి: అత్యంత వివాదాస్పదుడైన గుర్మీత్ రామ్ రహీం సింగ్ @ డేరా బాబా నల్లగొండ జిల్లాలోనూ పాగా వేశాడు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు వద్ద హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారికి ఆనుకొని డేరా సచ్చా సౌదా పేరిట ఆశ్రమాన్ని నెలకొల్పేందుకు ఏర్పాట్లు చేశాడు. డేరా బాబా ఆశ్రమం ఏర్పాటు కోసం జిల్లాలో భూములు కొనుగోలు చేశారన్న విషయం పొక్కడంతో జిల్లా ప్రజల్లో విస్తృత చర్చనీయాంశమైంది. వెలిమినేడు పరిధిలోని సర్వే నెంబర్ 100,115లలో 2006 నుండి రెండేళ్ళ పాటు రైతుల వద్దనుండి భూములను తక్కువ ధరకు కొనుగోలు చేసినట్టు తెలిసింది. ముందుగా ఈ భూములను రైతుల వద్ద నుండి హైదరాబాద్‌కు చెందిన రియల్టర్లు కొనుగోలు చేయగా వారి వద్ద నుండి డేరా బాబా కొనుగోలు చేశారు. ఆ భూములకు ఆనుకొనివున్న మరో 9ఎకరాల అసైన్డ్ భూ ములకు చట్టప్రకారం రిజిస్ట్రేషన్ కుదరక పోవడంతో కోర్టు డిక్రీ ద్వారా డేరా సచ్చా సౌధ ఆధ్యాత్మిక, సామాజిక సంస్థ తన ఆధీనంలోకి తెచ్చుకొని ఎత్తైయిన ప్రహరీని నిర్మించారు. దానికి శ్యామ్‌లాల్ అనే వ్యక్తిని నిర్వాహకునిగా నియమించారు. నిర్మాణాలకు పంచాయతీ అనుమతులు లేకున్నా 10 అడుగుల ఎత్తైన ప్రహరీ నిర్మించడంతో లోపల ఏం జరుగుతున్నదీ ఇతరులకు తెలిసే అవకాశం లేకుం డా పోయింది. రాత్రి సమయాల్లో పలు సంఖ్యలో కార్లు ఆశ్రమానికి వస్తుంటాయని,అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అసైన్డ్ భూములను కాపాడాలని రెవి న్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఉన్నతాధికారులు స్పందించి చిట్యాల తహసీల్దార్ విజయలక్ష్మిని విచారణకు ఆదేశించారు. ఈ భూములకు కాపలాదారుగా వున్న శ్యామ్‌లాల్‌ను విచారించి, రికార్డులను తనిఖీ చేశారు. వీటిని బాబా కొనుగోలు చేసినట్లు తేలడంతో ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు విన్నవిస్తానని విజయలక్ష్మి తెలిపారు. ఈ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

28న హైదరాబాద్‌లో టిడిఎస్‌పై సదస్సు

మన తెలంగాణ/హైదరాబాద్ : ఘాజియాబాద్ సిపిఎస్, టిడిఎస్ అధికారుల ఆధ్వర్యంలో ఈ నెల 28న ఛార్టెర్డ్ అకౌంటెంట్స్ కోసం టిడిఎస్‌పై సదస్సు నిర్వహించనున్నట్లు ఛీఫ్ కమిషన్‌నర్ ఇన్‌కం ట్యాక్స్ 1 బి.వి.వినోద్ తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో టిడిఎస్ విభాగం రూ.18007 కోట్లు వసూలు చేసిందని, ఈ సంవత్సరానికి రూ.21,704 కోట్లు లక్ష్యంగా పెట్టుకుందని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. టిడిఎస్ క్వార్టర్లీ రిటర్న్స్, పన్ను మినహాయింపు చెల్లింపులు (పేమెంట్ ఆఫ్ ట్యాక్స్ డిడక్షన్)పై సదస్సు ఉంటుందన్నారు. మాసబ్‌ట్యాంక్ ఐ.టి టవర్స్‌లో మధ్యాహ్నం 3 గంటలకు జరిగే సదస్సులో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్య సిసిఐటి ఎస్.పి.చౌదరి పాల్గొంటారని తెలిపారు.

మన నేతన్నలు పనికి రారా?

బండ్రు శోభారాణి

మన తెలంగాణ/హైదరాబాద్ : బతుకమ్మ చీరల తయారీ ద్వారా చేనేత కుటుంబాలకు ఉపాధి కల్పించాలనే లక్ష్యాన్ని పక్కన పెట్టి కమీషన్ల కోసం పక్క రాష్ట్రాల కాంట్రాక్టర్లకు దోచి పెట్టేందుకు టిఆర్‌ఎస్ ప్రభుత్వం సిద్దమైందని టిడిపి తెలుగు మహిళా అధ్యక్షురాలు బండ్రు శోభారాణి ఆరోపించారు. నిరుపేదలకు చీరల పంపిణీ ద్వారా చేనేత కుటుంబాలకు ఉపాధి కల్పించాలనే ప్రభుత్వ లక్ష్యం మంచిదైనప్పటికీ ఆదరాబాదరాగా చీరల ఆర్డర్ ఇచ్చిన ప్రభుత్వం అందుకు కావాల్సిన ప్రింటింగ్, ప్రాసెసింగ్, డైయింగ్ సదుపాయాల గురించి పట్టించుకోకుండా ఇప్పుడు గడువు ముగింపు పేరిట రంగుల తయారీ, అద్దకాల కోసం సూరత్, భివాండి, తమిళనాడుకు చెందిన కాంట్రాక్టర్లకు చీరల తయారీని అప్పగిస్తూ అసలు లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం ఆరు నెలల ముందు ఆర్డర్లివ్వాల్సి ఉండగా కేవలం మూడు నెలల ముందే ఆర్డర్లు ఇచ్చారంటే పథకం అమలుపై, చేనేత కార్మికులపై టిఆర్‌ఎస్‌కున్న చిత్తశుద్ధి ఏమిటో స్పష్టమవుతుందని ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చీరల తయారీ, పంపిణీ చేసే సామర్థ్యం ఉందా లేదా అన్న విషయాన్ని పట్టించుకోకుండా చీరల తయారీ ఆర్డర్ ఇవ్వడం వెనుక మతలబు ఏమిటని ప్రశ్నించారు.

తుపాకీతో కాల్చుకుని ఎఆర్ కానిస్టేబుల్ ఆత్మహత్య



మనతెలంగాణ/కరీంనగర్‌క్రైం: కరీంనగర్ కమిషనరేట్‌లో కానిస్టేబుల్ శనివారం తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కరీంనగర్ ఎఆర్ కొత్తపల్లి మండలంలోని బావుపేట గ్రామానికి చెందిన దూలం చంద్రయ్య (42) అనే వ్యక్తి మధ్య తరగతి కుటుంబానికి చెందినవాడు. కాగా ఆయన చిన్ననాటి నుండి పోలీస్‌శాఖలో చేరాలనే సంకల్పంతో పలుమార్లు ప్రయత్నించాడు. చివరకు 1995వ సంవత్సరంలో ఆర్మీడ్ రిజర్వ్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. నాటి నుండి ఆయన విధి నిర్వహణలో ఎంతో ఉత్సాహంగా పాల్గొనేవాడు. గత కొంత కాలంగా తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతున్న ఆయన ఆరోగ్య పరిస్థితిని చూసి కంగారుపడిన కుటుంబసభ్యులు వైద్యులకు చూపించి చికిత్స చేయిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎస్కార్ట్ డ్యూటీకని బయలుదేరిన ఆయన హెడ్‌క్వార్టర్స్ లోనే తలన వెంట తెచ్చుకున్న తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తుపాకీ పేలిన శబ్దంతో ఉలిక్కిపడిన హెడ్‌క్వార్టర్స్ సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకునే లోపే చంద్రయ్య మృతి చెందాడు. చంద్రయ్యకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయం తెలిసిన కరీంనగర్ రేంజ్ డిఐజి రవివర్మ సహా పోలీస్ కమీషనర్ వి.బి.కమలాసన్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సి.పి కమలాసన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ చంద్రయ్య మానసిక పరిస్థితి సరిగ్గా లేని కారణంగానే తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పేర్కొన్నారు. ఈ సంఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించడం జరుగుతుందని కరీంనగర్ పోలీస్ కమీషనర్ వి.బి.కమలాసన్‌రెడ్డి వివరించారు. ఆయన వెంట కరీంనగర్ ఎ.సి.పి జూలపల్లి రామారావు, కరీంనగర్ వన్‌టౌన్, టూటౌన్, ట్రాఫిక్ సిఐలు తుల శ్రీనివాస్‌రావు, తాళ్ళపల్లి మహేశ్‌గౌడ్, సీతారెడ్డిలు ఉన్నారు. కానిస్టేబుల్ చంద్రయ్య మృతదేహాన్నిపోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కశ్మీర్‌లో భారీ ఎన్‌కౌంటర్

8 మంది భద్రతా సిబ్బంది మృతి – ఎదురు కాల్పుల్లో ముగ్గురు ఉగ్రవాదులు హతం



శ్రీనగర్: దక్షిణ కశ్మీర్‌లోని పుల్వామా జిల్లా పోలీస్ కాంప్లెక్స్‌పై శనివారం ఉగ్రవాదులు ఆత్మాహుతి దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో నలుగురు సిఆర్‌పిఎఫ్ జవాన్లు సహా 8 మంది భద్రతా సిబ్బంది అమరులయ్యారు. భద్రతా దళాలు జరిపిన ఎదురు కాల్పుల్లో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. తెల్లవారు జామున పోలీస్ కాంప్లెక్స్‌లోకి ప్రవేశించిన విదేశీ ఉగ్రవాదులు దాడికి పాల్పడ్డారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీస్, ఆర్మీ, సిఆర్‌పిఎఫ్ బలగాలు ఉగ్రవాదులపైకి ఎదురు కాల్పులు జరిపాయి. పోలీస్ క్వార్టర్లలో నివాసం ఉంటున్న కుటుంబాలను సురక్షితంగా బయటకు తీసుకొచ్చాయి. కాల్పులు ఆగిపోవడంతో ఉగ్రవాదుల మృత దేహాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. పోలీస్ క్వార్టర్లలోని మూడు బ్లాకుల్లోకి చొరబడ్డ ఉగ్రవాదులు భద్రతా బలగాలపై కాల్పులు జరిపాయి. ఉగ్రవాదులు ఆత్మాహుతి దాడికి పాల్పడినట్లు లెఫ్టినెంట్ జనరల్ జెఎస్ సంధు తెలిపారు. ఉగ్రవాదుల దాడిలో నలుగురు సిఆర్‌పిఎఫ్ సిబ్బంది, ముగ్గురు రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ పోలీస్ ఆఫీసర్లు, ఓ కానిస్టేబుల్ మృతి చెందారు. ఆపరేషన్ ముగిసే సమయంలో ఉగ్రవాదుల అమర్చిన బాంబులను నిర్వీర్యం చేస్తూ ఇద్దరు సిఆర్‌పిఎఫ్ సిబ్బంది చనిపోయారు. భద్రతా సిబ్బంది ఎక్కువ మంది చనిపోవడంతో ఇది దురదృష్టకరమైన దినంగా డిజిపి ఎస్‌పి వైద్ పేర్కొన్నారు. మన యువకులు వీరోచితంగా పోరాడారని, రాష్ట్రం నుంచి ఉగ్రవాదాన్ని తుద ముట్టిస్తామని ఆయన అన్నారు. ఓ ఉగ్రవాది భవనం నుంచి బయటకు వచ్చి భద్రతా బలగాలపై విచక్షణారహితంగా కాల్పులు జరిపినట్లు ఓ పోలీస్ అధికారి తెలిపారు. ఆఉగ్రవాదిని భద్రతా బలగాలు అక్కడికక్కడే కాల్చి చంపాయన్నారు

బిఎస్‌ఎఫ్ చేతిలో ముగ్గురు పాక్ రేంజర్ల హతం

జమ్మూ: జమ్మూలోని అంతర్జాతీయ సరిహద్దుల్లో ముగ్గురు పాకిస్థాన్ రేంజర్లను బిఎస్‌ఎఫ్ కాల్చివేసింది. శనివారం పర్గ్వాల్ ప్రాంతంలో ఎలాంటి కవ్వింపు చర్యలు లేకుండా పాక్ రేంజర్లు కాల్పులు జరిపారు. సైన్యం జరిపిన ఎదురు కాల్పుల్లో ముగ్గురు పాక్ రేంజర్లు హతమైనట్లు బిఎస్‌ఎఫ్ ప్రతినిధి తెలిపారు. తెల్లవారు జామున అంతర్జాతీయ సరిహద్దులో పాక్ అర డజన్‌కు పైగా మోర్టార్లతో కాల్పులు జరపడంతో సుందర్‌బన్ సెక్టార్‌లోని దేవ్రా గ్రామంలో పేలినట్లు ఆయన తెలిపారు. శుక్రవారం ఆర్‌ఎస్ పొర సెక్టార్‌లో పాక్ సైనికుడి పొంచి ఉండి కాల్చడంతో జవాన్ కెకె అప్పారావు తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. సుధీర్ఘ కాలం తర్వాత అంతర్జాతీయ సరిహద్దుల్లో విద్వేష కాల్పులు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. జులై 17న సాంబా సెక్టార్‌లోని అంతర్జాతీయ సరిహద్దుల్లో కమాండెంట్ ఫ్లాగ్ సమావేశంలో శాంతికి కట్టుబడి ఉండేందుకు ఇరు దేశాలు అంగీకరించాయి.

ఇరు దేశాల సరిహద్దుల్లో చిన్న అంశాలను కమాండర్ స్థాయిలో పరిష్కరించుకుంటామని పేర్కొన్నాయి. ఈ ఏడాది పాకిస్థాన్ తరచుగా కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి భారత్‌పై దాడులకు తెగబడుతోంది. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఇంటర్నెట్ సర్వీసులను అధికారులు తాత్కాలింగా రద్దు చేశారు.

ఖైరతాబాద్ గణేష్‌కు పోటెత్తిన భక్తులు





మన తెలంగాణ/హైదరాబాద్/ సోమాజిగూడ : ఖైరతాబాద్ భారీ గణనాథుడికి మొదటి రోజు ఘనంగా పూజలు నిర్వహించారు. గణనాథుడ్ని దర్శించేందుకు భక్తులు భారీగా పోటెత్తారు.హోమంతో మొదలైన ప్రథమ పూజను గవర్నర్ దంపతులు నిర్వహించారు. 63వ సంవత్సరం 57 అడుగుల ఎత్తులో శ్రీ చండీకుమార అనంత మహాగణపతిగా గణనాథుడు కొలువుదీరాడు. ఎడమవైపున మహిషాసురమర్ధిని, కుడివైపున మహాకాల సదాశివుడు భారీ గణపతి చెంతన కుమార స్వామి,దుర్గాదేవి విగ్రహాలను ఏర్పాటు చేశారు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, మాజీమంత్రి దానం నాగేందర్, మాజీ ఎంపి అంజన్‌కుమార్ యాదవ్, కార్పొరేటర్ విజయారెడ్డిలు పూజలు

మొదటి రోజు పూజలో గవర్నర్ దంపతులు

నిర్వహించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ సింగరి సుదర్శన్, మహేష్‌యాదవ్, చం దూ,గంగాధర్‌యాదవ్, టిఆర్‌ఎస్ నాయకులు గజ్జెల నాగేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

50 కిలోల లడ్డూ ప్రసాదం

ప్రతి సంవత్సరం తూర్పుగోదావరి జిల్లా తాపేశ్వరానికి చెందిన మల్లిబాబు భారీ గణనాథుడికి లడ్డూ ప్రసాదాన్ని అందించేవారు. తలెత్తుతున్న వివాదాల నేపథ్యంలో ఈ సంవత్సరం భారీ లడ్డూను దేవుడికి సమర్పించలేదు. దీంతో శివలాల్ యాదవ్ ట్రస్ట్ చైర్మన్ మంగళారపు మహేష్‌యాదవ్ 50కిలోల లడ్డూను అందించారు.

భారీ కండువా : ఖైరతాబాద్ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో భారీ గణనాథుడికి 75 అడుగుల కండువా, జంధ్యాన్ని, గరికమాలను సమర్పించారు. భారీ ఊరేగింపుతో తీసుకువచ్చారు. ఊరేగింపును హోంసెక్రెటరీ అనిత రాజేంద్ర ప్రారంభించగా కండువాను సీనియర్ ఐఎఎస్ అధికారి పార్థసారధి, జంధ్యాన్ని హెచ్‌ఎండిఏ కమిషనర్ చిరంజీవులు, గరికమాలను బిసి కమిషనర్ చైర్మన్ బిఎస్ రాములు సమర్పించారు.

పూజలో ప్రముఖులు : శనివారం పలువురు ప్రముఖులు పూజలు నిర్వహించారు.అసెంబ్లీ స్పీకర్ మధుసూదనాచా రి,ఐ&పిఆర్ కమిషనర్ నవీన్ మిట్టల్, ఎంపి కవిత, ఇన్‌కమ్‌ట్యాక్స్ కమిషనర్ శ్యాంప్రసాద్‌చౌదరి, తెలంగాణ ప్రభుత్వ సలహాదారు రమణాచారి దంపతులు పాల్గొన్నారు.



బల్దియాలో సమ్మె సైరన్

నోటీసు ఇచ్చిన జిహెచ్‌ఎంఇయు

మన తెలంగాణ/హైదరాబాద్ సిటీబ్యూరో :జిహెచ్‌ఎంసిలో టిఆర్‌ఎస్ అనుబంధ కార్మిక సంఘం సమ్మె నోటీసు ఇచ్చింది. ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ, కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ కార్మికుల సర్వీసులు రెగ్యులరైజ్ చేయాలనే ప్రధాన డిమాండ్లతో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ (జిహెచ్‌ఎంఇయు) నాయకులు సమ్మె నోటీసు ఇచ్చారు. శనివారం జిహెచ్‌ఎంసి కమిషనర్ డాక్టర్ బి.జనార్దన్‌రెడ్డిను జిహెచ్‌ఎంఇయు అధ్యక్షులు ఊదరి గోపాల్ నేతృత్వంలో యూనియన్ నాయకులు కలిసి సమ్మె నోటీసు ఇచ్చారు. చెత్త సేకరణ, తరలింపును ప్రైవేటీకరణను నిలిపేయా లని, చెత్త సేకరణ, తరలింపునకు కొత్త వాహనాలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు అమలు చేయకపోతే ఏక్షణంలోనైనా సమ్మెలోకి వెళ్తామని స్పష్టం చేశారు. కమిషనర్‌ను కలిసిన వారిలో యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.బాల్ నర్సింగ్‌రావు, నాయకులు శంకర్,కుల్‌కర్ణి ఉన్నారు.

ఆర్‌బివిఆర్‌ఆర్‌కు ఐదెకరాలు కేటాయింపు

మన తెలంగాణ/హైదరాబాద్: రాజేంద్రనగర్ మండలంలోని బుద్వేల్ గ్రామంలో రాజబహదూర్ వెంకటరామ్ రెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ (ఆర్‌బివిఆర్‌ఆర్)కి అదనంగా ఐదు ఎకరాల స్థలాన్ని అప్పగిస్తూ ఉత్తర్వులను జారీ చేశారు. ఈ మేరకు సచివాలయంలో శనివారం హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి తనను కలిసిన ఆర్‌బివిఆర్‌ఆర్ అధ్యక్షులు డాక్టర్ ఇ.రఘుపతిరెడ్డి, మాజీ ఎంఎల్‌సి ఎస్.ఇంద్రసేనారెడ్డికి ఉత్తర్వుల పత్రాలనుఅందజేశారు.

173 దేశాల్లో సేంద్రియ వ్యవసాయం

మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలో సేంద్రియ ఉత్పత్తుల ధృవీకరణ సాధారణ రైతులకు సైతం అందుబాటులో ఉంచామని, సేంద్రియ సాగు చేస్తున్న రైతులు ఈ సేవలను ఉపయోగించుకోవాలని వ్యవసాయ, సహకార శాఖ ప్రధాన కార్యదర్శి సి.పార్థసారథి అన్నారు. నగరంలో శనివారం జరిగిన సేంద్రీయ వ్యవసాయం, ధృవీకరణపై అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రపంచంలో 173 దేశాలు సేంద్రీయ వ్యవసాయాన్ని చేస్తున్నాయని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్ర విత్తన, సేంద్రీయ ధృవీకరణ అథారిటీ డైరెక్టర్ డాక్టర్ కే.కేశవులు మాట్లాడుతూ, అపెండా నుండి అధికార గుర్తింపు వచ్చే నెలలో రానున్నదని, ఆ తర్వాత సేంద్రీయ ఉత్పత్తుల ధృవీకరణ దేశంలో ఎక్కడైనా చేయవచ్చన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అనూహ్యంగా విస్తరించబడిందన్నారు. జాతీయ సేంద్రీయ వ్యవసాయ క్షేత్రం డైరెక్టర్ డాక్టర్ కృషన్ చంద్ర సేంద్రీయ రైతులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలిస్తూ సందేహాలను నివృత్తి చేశారు.

నేషనల్ టాలెంట్ పరీక్షలో నారాయణ హవా

మన తెలంగాణ/హైదరాబాద్ : నేషనల్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్ రెండవ దశ(ఎన్‌టిఎస్‌ఇస్టేజ్ 2) ఫలితాల్లో మొత్తం 23 సెలక్షన్స్ సాధించి నారాయణ విజయ ప్రస్థానాన్ని కొనసాగించారని నారాయణ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి.సింధూర నారాయణ పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 10వ తరగతి చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహించేందుకు నిర్వహించే ఈ పరీక్ష రెండు దశల్లో జరుగుతుందని, తుది దశలో అర్హత సాధించిన విద్యార్థులకు భారత ప్రభుత్వం నుంచి స్కాలర్‌షిప్‌లు అందిస్తారని వివరించారు. సైంటిఫిక్‌గా రూపొందించిన నారాయణ సిఒస్పార్క్, ఒలింపియాడ్, ఇటెక్నో ప్రోగ్రామ్‌లే ఇలాంటి అద్భుత విజయాలకు సాధించడానికి కారణమని ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీ పరీక్షల్లో తమ విద్యార్థులు సాధిస్తున్న నిరంతర ఘన విజయాల వెనుక నారాయణ సుపీరియర్ ప్లానింగ్, సూపర్లేటివ్ టీచింగ్ వెన్నుదన్నుగా నిలుస్తున్నాయని అన్నారు. ప్రాథమిక దశ నుంచే శాస్త్ర, సాంకేతిక అంశాలపై పరిజ్ఞానం పెంచుకోవడంతోపాటు, నూతన ఆవిష్కరణలు కనుగొనే దిశగా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. మ్యాథ్స్, ఫిజిక్స్,కెమిస్ట్రీ, బయాలజి, ఆస్ట్రానమీలతోపాటు కంప్యూటర్స్, ఆప్టిట్యూట్ సబ్జెక్టులలో బేసిక్స్‌కు స్ట్రాంగ్ ఫౌండేషన్ అందిస్తున్నామని తెలిపారు. ఇలా ఎన్నో అంశాలపై దృష్టి సారించడం ద్వారానే స్కూల్ స్థాయిలో ఏ పోటీ పరీక్ష నిర్వహించినా నారాయణ విద్యార్థుల సంఖ్య అంతకు అంత పెరుగుతూనే ఉందన్నారు. ఈ సందర్భంగా ఘనవిజయం సాధించిన విద్యార్థులను నారాయణ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.పునీత్ ప్రత్యేకంగా అభినందించారు.

నోట్ పుస్తకాలు పంపిణీ చేసిన గీతం విద్యార్థులు

మన తెలంగాణ/హైదరాబాద్ : గీతం విశ్వ విద్యాలయంలోని బి.టెక్ విద్యార్థులు రుద్రారం ప్రాథమిక పాటశాల విద్యార్థులకు శనివారం నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. గీతం రెసిడెంట్ డైరెక్టర్ డివివిఎస్‌ఆర్ వర్మ ఐటిసి సీనియర్ మేనేజర్ ఎస్.ఎన్. ఉమాకాంత్ చేతుల మీదుగా దాదాపు వంద మంది విద్యార్థులను పుస్తకాలను అందజేశారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు క్విజ్ పోటీ నిర్వహించి, విజేతలకు నగదు పురస్కారాలు అందించారు.

మాంసం ఎగుమతిదారు ఖురేషీ అరెస్ట్

న్యూఢిల్లీ : నగదు అక్రమ బదిలీ కేసులో వివాదాస్పద మాంసం ఎగుమతిదారుడు మోయిన్ అక్తర్ ఖురేషీని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అధికారులు అరెస్టు చేశారు. కేసులో ఆయనను ప్రశ్నించేందుకు శుక్రవారం రాత్రి అరెస్టు చేశామని, కాని ఖురేషీ తమకు సహకరించలేదని, అతడిని కోర్టులో ప్రవేశపెడతాని ఇడి అధికారులు తెలిపారు. ఈ కేసులో ఖురేషీపై రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసిన అనంతరం పలుమార్లు ఇడి అధికారులు అతడిని ప్రశ్నించారు.


గవర్నర్ మంచి నిర్ణయం తీసుకుంటారు : దినకరన్



చెన్నై/పుదుచ్చేరి : ముఖ్యమంత్రి పళనిస్వామికి ఉద్వాసన పలకాలంటూ తమ శాసనసభ్యులు చేసిన విజ్ఞప్తిపై గవర్నర్ సిహెచ్ విద్యాసాగర్ రావు మంచి నిర్ణయం తీసుకుంటారని ఎఐఎడిఎంకె మరో చీలికవర్గం నాయకుడు టిటివి దినకరన్ అన్నారు. మరో ఇద్దరు శాసనసభ్యులు తమ వర్గంలో చేరారని, ఇప్పుడు తమ శిబిరం పూర్తి విశ్వాసంతో ఉందని ఆయన చెప్పారు. పార్టీ క్షేమమే తమ లక్ష్యమని, గవర్నర్ తగిన నిర్ణయం తీసుకుంటారని తమ వర్గం ఆకాంక్షిస్తోందని చెన్నైలో విలేకరులతో మాట్లాడుతూ ఆయన చెప్పారు. గవర్నర్ న్యాయనిపుణత కలిగిన వారని, పళనిస్వామికి వ్యతిరేకంగా తాము జరుపుతున్న పోరాటానికి ఖచ్చితంగా విజయం వరిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తన వర్గ శాసనసభ్యులకు స్పీకర్ ధన్‌పాల్ నోటీసుల ఇవ్వడంపై ఆయన స్పందిస్తూ న్యాయం, దైవంపై నమ్మకంతో ఉన్నామన్నారు.









డేరా వీరంగం

గుర్మీత్‌ను దోషిగా తేల్చడంతో నాలుగు రాష్ట్రాల్లో రెచ్చిపోయిన అనుచరులు

చండీగఢ్ /న్యూఢిల్లీ/పంచకుల (హర్యానా) : అత్యాచారం కేసులో వివాదాస్పద ఆధ్యాత్మిక గురువు, డేరా సచ్చా సౌధా చీఫ్ గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్‌ను పంచకుల సిబిఐ కోర్టు శుక్రవారం దోషిగా తేల్చింది. తీర్పు అనంతరం భద్రతా పరిస్థితుల దృష్ట్యా సునారియాలోని రోహ్‌తక్ జిల్లా జైలుకు ఆయన్ను ప్రత్యేక హెలికాప్టర్‌లో తరలించారు. అయితే కోర్టు తీర్పుకు నిరసనగా ఆయన అనుచరులు, మద్దతుదారులు హింసకు తెగబడ్డారు. హింసకు కేంద్ర బిందువైన పంచకులలో 28 మంది, డేరా సచ్చా సౌధా ప్రధాన కేంద్రమైన సిర్సాలో ఇద్దరు మృతుతో కలిసి తాజాగా 37కి చేరుకుంది. 250 మందికి పైగా గాయపడ్డారు. హర్యానాలోని పంచకుల, సిర్సాలతో పాటు పంబాజ్‌లోని పలు ప్రాంతాల్లో వాహనాలు, ప్రభుత్వ భవనాలు, రైల్వే స్టేషన్లను ఆందోళనకారులు తగులబెట్టారు. మీడియా వ్యక్తులు, ప్రభుత్వ ఆస్తులే లక్ష్యంగా అల్లరిమూకలు చెలరేగిపోయారు. దీంతో పోలీసులు, అగ్నిమాపక దళం సహా పారామిలిటరీ బలగాలు పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు రంగ ప్రవేశం చేశాయి. ఆందోళనకారులను చెదరగొట్టేందుకు భద్రతా బలగాలు బాష్పవాయువును ప్రయోగించాయి. 144 సెక్షన్ లాంటి నిషేధిత ఆజ్ఞలను సైతం లెక్కచేయకుండా వేలాది మంది డేరా అనుచరులు హింసకు పూనుకున్నారు. పంచకులలో ఏడుగురు మరణించగా, కనీసం 200 మంది గాయపడ్డారని స్థానిక ప్రభుత్వాసుపత్రి ప్రధాన వైద్యాధికారి వివేక్ భాదు తెలిపారు. చండీగఢ్‌లోని పిజిఐఎంఇఆర్ ఆస్పత్రిలో ఏడు మరణాలు, రాష్ట్ర వైద్య కళాశాల ఆస్పత్రిలో మరో నాలుగు మరణాలు, సిర్సాలో రెండు మరణాలు నమోదయ్యాయని ఆయన తెలిపారు. అలాగే పంజాబ్‌లోని మాల్వా ప్రాంతంలో కనీసం 32 హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. మాల్వా పరిధిలోని పది జిల్లాల్లో కర్ఫ్యూ విధించామని పంజాబ్ సిఎం అమరిందర్ సింగ్ చెప్పారు. ఈశాన్య ఢిల్లీలోని లోని గోల్‌చక్కర్ వద్ద మధ్యాహ్నం 4.30 గంటల ప్రాంతంలో ఆందోళనకారులు రెండు బస్సులను తగులబెట్టారు. ఈ హింసలో సుమారు వెయ్యిమంది పాల్గొన్నారని కెజి దాత్‌వాలియా (డిజి, పిఐబి) వెల్లడించారు. భాజన్‌పురా నుండి వస్తున్న బస్సుపై కొందరు రాళ్లు రువ్వడంతో పాటు దానిని దగ్ధం చేశారని ఆయన చెప్పారు. న్యూఢిల్లీలోని ఆనంద్ విహార్ రైల్వే స్టేషన్‌లో రెవా ఎక్స్‌ప్రెస్‌కి చెందిన రెండు బోగీలు అగ్నికి ఆహుతయ్యాయని, ఈ ఘటనకు కారణం ఆందోళనకారులా? కాదా? అనే దానిపై ప్రస్తుతం విచారణ కొనసాగుతోందని రైల్వే అధికారులు తెలిపారు. బాదర్‌పూర్‌లో ఒక డిటిసి బస్సును తగులబెట్టేందుకు ప్రయత్నించిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని పోలీసులు చెప్పారు. ధ్వంసమైన వాహనాల్లో ఎక్కువగా మీడియాకి చెందిన 28 వాహనాలున్నాయని, ఈ హింసాత్మక ఘటనలకు సంబంధించి 524 మందిని అదుపులోకి తీసుకున్నామని హర్యానా రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి (హోం శాఖ) రామ్ నివాస్ పిటిఐ వార్తా సంస్థకు నివాస్ తెలిపారు. కేసులు దాఖలు చేయడంతో పాటు తమ వాహనాలను ఆందోళనకారులు ధ్వంసం చేయడానికి సంబంధించిన వీడియో ఫుటేజిలను సమర్పించాలంటూ బాధిత మీడియా సంస్థలను కోరామని కూడా ఆయన చెప్పారు. ఢిల్లీలో విధించిన విధించిన నిషేధిత ఆజ్ఞలు వచ్చే నెల 8 వరకు కొనసాగుతాయని స్పెషల్ పోలీసు కమీషనర్ (శాంతిభద్రతలు, నార్త్ ఢిల్లీ) ఎస్‌బికె సింగ్ పిటిఐకి తెలిపారు. మరోవైపు పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లో శాంతిభద్రతల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని సుమారు 445 రైళ్లను రద్దు చేసినట్లు నార్తర్న్ రైల్వే ప్రతినిధి నీరజ్‌శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28 వరకు ఈ రద్దు కొనసాగుతుందని ఆయన చెప్పారు. డేరా సచ్చా సౌధా ఆధ్యాత్మిక కేంద్రాలను అన్వేషించి, వాటి లెక్క తేల్చాలంటూ హర్యానా ప్రభుత్వం శనివారం ఆదేశించిందని సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు.

ప్రధాని ఖండన, సంయమనానికి విజ్ఞప్తి

గుర్మీత్‌పై తీర్పు అనంతరం చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలను ప్రధాని మోడీ ఖండించారు. ఇవి తనెంతగానే బాధించాయని, ఇలాంటి పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ సంయమనంతో వ్యవహరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, హోం శాఖ కార్యదర్శి రాజీవ్ మహర్షిలతో కలిసి ఆయన పరిస్థితిని సమీక్షించారు. మరోవైపు దోషిగా తేలడంతో గుర్మీత్‌కు ఇప్పటివరకు కల్పిస్తున్న జెడ్ ప్లస్ కేటగిరీ భద్రతను ఉపసంహరిస్తున్నామని హర్యానా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెలిపారు.

రేపు శిక్ష ఖరారు

ఆధ్యాత్మిక గురువు దేరాకి సోమవారం శిక్షను ఖరారు చేయనున్నారని సిబిఐ న్యాయమూర్తి హెచ్‌పిఎస్ వర్మ విలేకరులకు తెలిపారు. దేరాకు ఏడేళ్ల వరకు శిక్ష పడనుంది. ఆయనకు గరిష్టంగా యావజ్జీవం విధించే అవకాశం కూడా ఉందని న్యాయ నిపుణులు చెబుతున్నారు. ఐపిసిలోని సెక్షన్ 376 (అత్యాచారం), సెక్షన్ 506 (నేరపూరిత బెదిరింపు) కింద గుర్మీత్ బాబాని కోర్టు దోషిగా తేల్చింది. తాజా పరిస్థితుల నేపథ్యంలో రేపటి శిక్ష ఖరారు కోసం బాబా ఉన్న జైలుకే సిబిఐ న్యాయమూర్తి వెళ్లనున్నారు. డేరా బాబా ఇద్దరు మహిళలపై అత్యాచారం చేశారంటూ ఒక అనామక వ్యక్తి ఇచ్చిన రాతపూర్వక ఫిర్యాదు ఆధారంగా పంజాబ్, హర్యానా ఉమ్మడి హైకోర్టు ఆదేశాల మేరకు సిబిఐ డిసెంబరు, 2002లో ఆయనపై కేసు నమోదు చేసింది. సుదీర్ఘ విచారణ అనంతరం సిబిఐ కోర్టు న్యాయమూర్తి జగదీప్ సింగ్ దేరాను దోషిగా నిర్ధారిస్తూ తీర్పునిచ్చారు.

బాబాకి సాక్షి మహారాజ్ బాసట

వివాదాస్పద బిజెపి ఎంపి సాక్షి మహారాజ్ డేరా డేరా బాబాకి బాసటగా నిలిచారు. బాబా ఒక నిరాడంబర వ్యక్తి అని ఆయన పేర్కొన్నారు. బాబాపై ఒక వ్యక్తి అత్యాచార ఆరోపణ చేస్తే, కోట్లాది మంది భక్తులు ఆయన్ను ఆరాధిస్తున్నారని బిజెపి ఎంపి చెప్పుకొచ్చారు. అత్యాచారం కేసులో గుర్మీత్ సింగ్ బాబాని దోషిగా నిర్ధారిస్తూ తీర్పునిచ్చిన సిబిఐ కోర్టు న్యాయమూర్తి జగదీప్ సింగ్‌కు భద్రత కల్పించాలని కేంద్ర ప్రభుత్వం హర్యానా ప్రభుత్వాన్ని ఆదేశించిందని అధికారులు తెలిపారు.

ఖట్టర్ పనితీరు భేష్ : కేంద్రం కితాబు

● సిఎం రాజీనామా చేయబోరని సంకేతం

చండీగఢ్/న్యూఢిల్లీ : గుర్మీత్‌పై తీర్పు నేపథ్యంలో హర్యానా మండిపోవడం, పలు రాష్ట్రాలకు ఘర్షణలు వ్యాపించడం వంటి పరిణామాలు తలెత్తినా కేంద్రం ముఖ్యమంత్రి ఖట్టర్‌ను వెనుకేసుకువచ్చింది. ప్రస్తుత పరిణామాలపై ఖట్టర్‌ను నిందించాల్సిన అవసరం లేదని కేంద్రం భావిస్తోంది. హర్యానా పరిస్థితిపై హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన శనివారం ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. బిజెపి పాలిత రాష్ట్రంలో ఓ వ్యక్తి రాజ్యాంగ అతీత శక్తిగా మారడం, ఆయన పేరిట అరాచకం చెలరేగడం వంటి పరిణామాలతో కేంద్రం సమాలోచనలకు ప్రాధాన్యత ఏర్పడింది. అయితే సమీక్ష తరువాత హోం కార్యదర్శి రాజీవ్ మెహర్షీ స్పందించారు. ఘర్షణలు, అనంతర పరిణామాలపై ఎవరిని నిందించాల్సిన అవసరం ఏమీ లేదని సమావేశంలో అభిప్రాయపడ్డట్లు మెహర్షీ తెలిపారు. మరో వైపు బిజెపి అధ్యక్షులు అమిత్ షా కూడా బిజెపి రాష్ట్ర ఇన్‌చార్జి అనిల్ జైన్, సీనియర్ నేత కైలాశ్ విజయవర్గియాతో చర్చించారు. ఖట్టర్ రాజీనామాకు వస్తున్న డిమాండ్లను బిజెపి తోసిపుచ్చినట్లు వెల్లడైంది. ఉద్రిక్త పరిస్థితుల నడుమ ముఖ్యమంత్రి తన పరిధిలో బాగానే వ్యవహరించారని అమిత్ షా కితాబు ఇచ్చినట్లు వెల్లడైంది. పరిస్థితిని అదుపులో పెట్టేందుకు అన్ని ప్రత్యామ్నాయ మార్గాలను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని, తీర్పును సిద్ధం చేసిన న్యాయమూర్తి వద్దకు ఐదు రోజుల క్రితమే ప్రభుత్వ ప్రతినిధి వెళ్లారని, డేరా చీఫ్‌కు అత్యధిక అభిమాన గణం ఉందని, తీర్పు నేపథ్యంలో ఉద్రిక్తత నెలకొంటుందని తెలిపారని బిజెపి నేతలు విలేకరులకు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే పరిస్థితిని ఊహించిందని, తీర్పు గురించి ప్రస్తావించిందని వెల్లడించారు. సిర్సా గెస్ట్‌హౌజ్‌లో కానీ, స్థానిక కోర్టులో కానీ తీర్పు వెలువరిస్తే బాగుంటుందని ఖట్టర్ ప్రభుత్వం తెలిపిందని, అయితే జడ్జిలు నిరాకరించారని బిజెపి వర్గాలు తెలిపాయి.

నిద్రలేదు...టీ, బ్రెడ్‌తో గుర్మీత్

రొహతక్ : అత్యాచారం కేసులో దోషి అయి జైలుపాలయిన గుర్మీత్ రామ్ రహీం సింగ్ తొలిరోజు టీ, రెండు బ్రెడ్‌లు తిన్నారు. సాధారణ ఖైదీగా ఉండాల్సి రావడంతో ఆయన ఒక్కరోజుకే డీలా పడ్డట్లుగా కన్పించినట్లు వెల్లడయింది. శుక్రవారం రాత్రి తరచూ ఆయన జైలు గదిలోనే చక్కర్లు కొట్టారు, కంటి నిండా కునుకు పట్టనట్లుగా ఉన్నారు. తెల్లవారుజామున నాలుగు గంటల ప్రాంతంలో యోగా చేసిన తరువాత తేనీరు, బ్రెడ్ తీసుకున్నారు. ఆయనకు ఎలాంటి ప్రత్యేక సౌకర్యాలు కల్పించడం లేదని ప్రిజన్స్ డిజిపి తెలిపారు. రాచమర్యాదలు అందుతున్నాయనే వార్తలు కట్టుకథలని అధికారి స్పష్టం చేశారు. రొహతక్‌లోని సొనారియా జిల్లా జైలులో ఆయనను ఉంచారు, సాధారణ ఖైదీలాగానే జైలు నిబంధనల మేరకు చూస్తున్నారని తెలిపారు. మినరల్ వాటర్ ఇస్తున్నట్లు, సహాయకుడు ఉన్నట్లు, ఎసి సౌకర్యం కల్పించినట్లు వచ్చిన వార్తలను జైళ్ల అధికారి ఖండించారు.

ఖైదీ నెంబరు 1997: జైలులో ఇప్పుడు గుర్మీత్ ఖైదీ నెంబరు 1997గా ఉన్నారు. రొహతక్ జైలుకు పది కంపెనీల పారామిలిటరీ దళాలు తరలించారు, అవసరమైతే 18 సైనిక దళాలను రంగంలోకి దింపేందుకు సిద్ధంగా ఉంచారు. త్వరలోనే సైనిక బలగాలు పట్టణానికి చేరుకుంటాయని, కవాతు నిర్వహిస్తాయని రొహతక్ డిప్యూటీ కమిషనర్ అతుల్ కుమార్ తెలిపారు. సోమవారం గుర్మీత్‌కు శిక్షల పరిణామం ఖరారు కానుంది. దీనితో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నారు. జిల్లా సరిహద్దుల వెంబడి చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. అన్ని రకాల ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు, ప్రజలు ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని అధికారులు తెలిపారు. అత్యవసరమైతే తప్ప ఇతరులు జిల్లాలోకి రాకూడదని, అన్ని ప్రాంతాలలో తనిఖీలు ముమ్మరం చేశారని వెల్లడించారు.

ఖట్టర్ వైఫల్యమే కారణం

న్యూఢిల్లీ : అత్యాచార కేసులో పంచకుల సిబిఐ కోర్టు డేరా సచ్చా సౌధా చీఫ్, వివాదాస్పద ఆధ్యాత్మిక గురువు గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్‌ని దోషిగా ప్రకటించింది. అయితే అంతకుముందు ఆయన కోర్టు విచారణకు హాజరయ్యేందుకు వచ్చిన తీరు గానీ లేదా తీర్పు తర్వాత హర్యానా, పంజాబ్, చండీగఢ్ రాష్ట్రాల్లో ఆయన అనుచరులు సృష్టించిన హింసను గానీ గమనిస్తే ఆశ్చర్యం వేయక మానదు. ఆయన ఫాలోయింగ్‌పై ఇప్పటికే దేశవ్యాప్తంగా చర్చ మొదలైపోయింది. డేరా బాబా అనుచరులు ఆయన్ను పితాజీ అని పిలుస్తుంటారు. కోర్టు విచారణ కోసం సిర్సా నుండి పంచకులకు హాజరయ్యేటప్పుడు ఆయన వెంట 200కి పైగా ఎస్‌యువి వాహనాలు గంటకు 100 కిలోమీటర్లకు పైగా వేగంతో రయ్ రయ్ అంటూ దూసుకుపోయాయి. ఆయనకు భద్రతగా సాయుధ భక్తులు, అనుచరులు ఉండటం గమనార్హం. ఒకవేళ తమ పితాజీని దోషిగా ప్రకటిస్తే, భారతదేశాన్ని క్షణాల్లో నాశనం చేస్తామంటూ కెమేరాల సాక్షిగా ఆయన అనుచరులు హెచ్చరించడం, కుట్రదారులు అనే పదాన్ని కోర్టు ప్రయోగించినట్లయితే అనూహ్య పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందంటూ మరికొంత మంది అనుచరుల వార్నింగ్‌లిచ్చారు. మరోవైపు అక్షరాలా ఆయన అనుచరులు ఐరన్ రాడ్లు చేతబట్టి వీధుల్లో సంచరించి భీతావహ వాతావరణాన్ని సృష్టించారు. వారు పెట్రోల్ బాంబులను ప్రయోగించడానికి కూడా వెనుకాడేవారు కాదనేది బహిరంగ రహస్యం. బాబా దోషి అంటూ కోర్టు తీర్పునివ్వడంతో హర్యానా, పంజాబ్, చండీగఢ్, యుపి, ఢిల్లీ, రాజస్థాన్ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో ఆయన అనుచరులు హింసకు తెగబడ్డారు. ఈ ఘటనల్లో 33 మంది ప్రాణాలు కోల్పోగా మరో 250 మందికి పైగా గాయపడ్డారు. అసలు ఈ పరిణామాలన్నీ కూడా ఆయన ప్రాభవానికి అద్దం పడుతున్నాయని చెప్పాలి లేదా ముఖ్యమంత్రి ఖట్టర్ ఘోర వైఫల్యానికి నిలువెత్తు నిదర్శనమనుకోవాలి. దైవాంశ సంభూతుడుగా చెప్పుకుంటూ మైనర్ బాలికపై అత్యాచారం చేసిన కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న గుర్మీత్ సింగ్ ఇలాంటి బీభత్సాన్ని సృష్టించడానికి కారణం ముఖ్యమంత్రి వైఫల్యమేనని విపక్ష పార్టీలతో పాటు పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇంతటి భారీ తప్పిదానికి ఖట్టర్‌ను పదవి నుండి ప్రధాని మోడీ, బిజెపి చీఫ్ అమిత్ షా తప్పించాలి లేదా ఆయనే స్వచ్ఛందంగా తప్పుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

ఖట్టర్ రాజీనామాకు కాంగ్రెస్ డిమాండ్

న్యూఢిల్లీ/హైదరాబాద్ : హర్యానా ముఖ్యమంత్రి ఎంఎల్ ఖట్టర్ తన పదవికి రాజీనామా చేయాలని విపక్ష పార్టీలు శనివారం డిమాండ్ చేశాయి. ప్రధానమంత్రి పార్టీ ప్రయోజనాల కంటే దేశ ప్రజల ప్రయోజనాలను, భద్రతను దృష్టిలో పెట్టుకోవాలని, ఖట్టర్ సిఎం పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ ట్విట్టర్ వేదికగా డిమాండ్ చేసింది. రాష్ట్రంలో చోటుచేసుకున్న హింసపై పార్టీ అధినేత్రి సోనియా గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. సంయమనంతో మెలగాలని ప్రజలకు ముఖ్యంగా గుర్మీత్ అనుచరులకు ఆమె విజ్ఞప్తి చేశారు. హింసాత్మక ఘటనల్లో పిల్లలు సహా చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రభుత్వ ఆస్తులను భారీగా ధ్వంసమయ్యాయి. మీడియాపై విచక్షణారహితంగా దాడి చేశారంటూ సోనియా ఇక్కడ విడుదల చేసిన ఒక ప్రకటనలో మండిపడ్డారు. మరోవైపు పంజాబ్ సిఎం అమరీందర్ సింగ్‌తోనూ ఆమె ఫోన్‌లో మాట్లాడారు. పౌరులందరి భద్రతకు తగిన చర్యలు చేపట్టాలని హర్యానా, చండీగఢ్ ప్రభుత్వాలను ఆమె కోరారు. సమాజంలో హింసకు, దుర్మార్గాలకు తావు లేదని పార్టీ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ప్రస్తుతం నార్వేలో ఉన్న ఆయన ఈ ఘటనలను తీవ్రంగా ఖండించారు.

బీహార్‌కు 500 కోట్ల వరద సాయం



పూర్ణియా(బీహార్): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అతలాకుతలమైన బీహార్ రాష్ట్రానికి ప్రధాని నరేంద్ర మోడీ ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో శనివారం మోడీ ఏరియల్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా బీహార్ రాష్ట్రానికి తక్షణమే రూ. 500 కోట్ల నిధులను మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. అదేవిధంగా వరద బాధితుల కుటుంబసభ్యులకు రూ. 2 లక్షల చొప్పున ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. బీహార్‌లో వరద ప్రభావిత జిల్లాలైన పూర్ణియా, కతియార్, కిసాన్ గంజ్, అరారియా పలు ప్రాంతాల్లో మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, ఉపముఖ్యమంత్రి సుశీల్ కుమార్ మోడీ సహా అధికారులతో ఏరియల్ సర్వే నిర్వహించారు. ఏరియల్ సర్వే నిర్వహించిన అనంతరం మోడీ నితీశ్, సుశీల్ కుమార్ మోడీ, ప్రభుత్వ సీనియర్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. చునాపూర్ విమానాశ్రయం వద్ద జరిగిన ఈ సమీక్ష సమావేశంలో బీహార్‌కు వరదల కారణంగా జరిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు రాష్ట్రానికి కేంద్ర బృందాన్ని త్వరలో పంపిస్తామని మోడీ హామీ ఇచ్చినట్టు ప్రధాని కార్యాలయం (పిఎంఒ) ఒక ప్రకటనలో పేర్కొంది. జరిగిన నష్టానికి సాధ్యమైనంత మేరకు సహాయాన్ని అందిస్తామని హామీ ఇచ్చినట్టు పిఎంఒ వెల్లడించింది. అదేవిధంగా రైతుల పంటల నష్టాన్ని అంచనా వేసేందుకు తక్షణమే ఇన్సూరెన్స్ కంపెనీలు తమ సిబ్బందిని రాష్ట్రానికి పంపాల్సిందిగా మోడీ సూచించారు.

డేరాలో ఘోరాలెన్నో

● సాధ్వీల సాక్ష్యాలతో నిజాలు

● నేలమాళిగ 'గుఫా'లో గుప్త చిట్టాలు



న్యూఢిల్లీ : డేరా మాటున ఘోరాలెన్నో... అమానవీయ పనులు మరెన్నో...అనే విషయం ఇప్పుడు డేరా చీఫ్ గుర్మీత్ దోషిత్వ వేళలో వెలికివచ్చాయి. పది సంవత్సరాల తరువాత గుర్మీత్ జరిపిన అత్యాచారం కేసులో శిక్ష తీర్పు వెలువడింది. ఈ తెగ గుడారంలో అభాగినులుగా గడిపే ఇద్దరు సన్యాసినులు లేదా సాధ్వీలు చేసిన ఫిర్యాదు ఫలితంగా ఇప్పుడు ఈ స్వయం ప్రకటిత దేవుడు కటకటాల్లోకి వెళ్లారు. బాధితులు ఇద్దరూ తమపై జరిగిన అత్యాచారం గురించి న్యాయమూర్తుల ఎదుట 2009, 2010లలో వేర్వేరుగా వాంగ్మూలాలు ఇచ్చారు. ఇవే ఇప్పుడు దోషిగా ఈ బాబా నిరూపణకు కీలకంగా మారాయి. సిబిఐ న్యాయమూర్తుల ఎదుట తమ వాంగ్మూలంలో ఈ ఇద్దరు బాధితురాళ్లు డేరాలో జరిగే చీకటి పనుల గురించి ఏకరువు పెట్టారు. శక్తివంతుడైన బాబా బలహీనులమైన తమను కామవాంఛ తీర్చుకునేందుకు ఎంత దారుణంగా లైంగిక బాధలకు గురి చేసిందీ వీరు వివరించారు. డేరాలో ఇతర మహిళలపై కూడా బాబా అత్యాచారాలు సాగేవని , బాబా అంతఃపురం నివాసంగా ఉండే ఈ చోటును గుఫాగా పిలుస్తారని తెలిపారు. ఈ గుఫాలో బాబా ఎలాంటి దారుణాలకు అయినా పాల్పడే తంతు సాగుతూ ఉంటుంది. ఈ క్రమంలో అత్యాచారాలకు ఆ రాజ్యంలో పితాజీ మాఫీగా వ్యవహరిస్తారని ఫిర్యాదు చేశారు. ఎలాంటి పాపాలు అయినా ఈ లోపల బాబాలు చేసినా వాటిని మాఫీగా భావిస్తారని తెలిపారు. వారి వాంగ్మూలాల ప్రతులను ఓ ఆంగ్ల పత్రిక సేకరించింది. ఇందులో పలు భయానక అంశాలు మిళితం అయి ఉన్నాయి. తమపై లైంగిక బలవంతానికి పాల్పడే సమయంలో బాబా దీనిని దేవుడి చర్యగా తనను తాను దేవుడిగా చెప్పేవాడని వాంగ్మూలంలో తెలిపారు. అత్యాచారాల గురించి మాట్లాడుకునేటప్పుడు భక్తులు వీటిని మాఫీలుగా పేర్కొనేవారు. ఇదో క్షమార్హ నేరంగా భావించేవారు. గుర్మీత్ గుఫా నేలమాళిగలో ఉంటుంది. అక్కడ ఆడ వారే కాపలాగా ఉండేవారు. డేరాలో బాలికలు కూడా చాలా మంది ఉన్నారని, వీరంతా కూడా గుర్మీత్‌ను దైవాంశసంభూతుడు, తమ కుటుంబ సభ్యులకు ఆరాధ్యుడు కాబట్టి తాము కూడా ఇక్కడికి వచ్చామని చెపుతూ ఉంటారని న్యాయస్థానం ముందు ఈ బాధితులు సాక్ష్యం ఇచ్చారు. ఈ సాక్ష్యాలే ఇప్పుడు బాబా పాపాల పంటాపంచలకు దారితీశాయి. హర్యానాలోని యమునానగర్‌కు చెందిన ఓ బాధితురాలు తాను బాబా చేతిలో బలి అయిపోయి ఇంకా బతికే ఉన్నానని, ఇది గొప్ప విషయమే అవుతుందని తెలిపింది. 2009 ఫిబ్రవరి 28న అప్పటి ప్రత్యేక సిబిఐ జడ్జి ఎకె వర్మ ఎదుట ఆమె తమ గోడు తెలియచేసుకున్నారు. తన సోదరుడి వలలనే తాను డేరాలోకి వచ్చిపడ్డానని తెలిపారు. తరువాతి క్రమంలో ఆమె సోదరుడు సోదరికి జరిగిన అన్యాయంపై ఎదురుతిరిగిన క్రమంలో హత్యకు గురయ్యాడు. తాను ఆశ్రమంలోకి రాగానే పలువురు తనను పితాజీ మాఫీ జరిగిందా? అని అడిగేవారని, ఇదేమిటో తనకు తెలియకపొయ్యేదని, 1999 ఆగస్టు 28/29 రాత్రి తనను బాబా గుఫాలోకి పిలిపించి అత్యాచారానికి పాల్పడ్డ క్రమంలో పితాజీ మాఫీ అంటే ఇదేనని తెలిసిందని వాపోయారు. 2010 సెప్టెంబర్ 9న మరో సాధ్వీ సాక్ష్యం ఇచ్చారు. ఆమె తాను 1998లో ఆశ్రమంలో చేరానని గుర్మీత్ తనను నజామ్ అని పిలిచేవారని, సిర్సాకు చెందిన తాను తల్లిదండ్రులు డేరాలో అధ్యాపకులు కావడంతో తప్పనిసరిగా అక్కడనే ఉండాల్సి వచ్చిందని తెలిపారు. డేరాలో చేరిన మరుసటి ఏడాదే ఆమెను గుఫాలోకి రప్పించుకుని గుర్మీత్ అత్యాచారానికి పాల్పడ్డట్లు వెల్లడైంది. రేప్ గురించి ఎవరికి చెప్పవద్దని చెబితే తీవ్ర పరిణామాలు ఉంటాయని బాబా హెచ్చరించాడని బాధితురాలు తెలిపింది.

రేప్ కేసు పూర్వాపరాలు

గుర్మీత్‌పై దాఖలైన జంట అత్యాచారాల కేసులో జరిగిన ఘట్టాలు ఈ విధంగా ఉన్నాయి.

2002 : తమపై డేరా చీఫ్ అత్యాచారానికి పాల్పడినట్లు ఇద్దరు శిష్యురాళ్లు అప్పటి ప్రధాని వాజ్‌పేయి, అప్పటి పంజాబ్ హర్యానా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి అజ్ఞాత లేఖలు రాశారు.

2003 నవంబర్: పై లేఖలపై హైకోర్టు తనంతతానుగా స్పందించి ఈ సాధ్వీల ఆరోపణలపై దర్యాప్తునకు సిబిఐని ఆదేశించింది.

2006 : బాధితుల సాక్ష్యాలను సిబిఐ నమోదు చేసింది. సిర్సాలోని డేరా ప్రధాన కార్యాలయంలో తమపై గుర్మీత్ అత్యాచారాలు జరిపిన చోటును బాధితులు సిబిఐకి చూపించారు.

2007 : కేసుకు సంబంధించి సిబిఐ ఛార్జిషీట్లు సమర్పించింది.

2009–10: కోర్టులో బాధితురాల వాంగ్మూలాల సేకరణ

2011 ఎప్రిల్ : సిబిఐ ప్రత్యేక న్యాయస్థానాన్ని ఈ కేసు విచారణకు ప్రత్యేకంగా అంబాలా నుంచి పంచకులకు మార్చారు.

2014 : రామ్ రహీం వాంగ్మూలాన్ని సిబిఐ రికార్డు చేసింది.

2015: తాను నపుంసకుడినని రామ్ రహీం తమ సాక్ష్యంలో తెలిపారు. శిక్షాస్మృతి పరిధిలో ఆయన ఈ వాంగ్మూలం ఇచ్చారు. అయితే ఘటన సమయానికి ఆయన వయస్సు 32 అని, ముగ్గురు సంతానం కూడా ఉందని సిబిఐ తెలిపింది.



కరెంటు స్మార్ట్ మీటర్లు రానున్నాయి

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థకు చెందిన ఎనర్జీ ఎఫిసియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్(ఇఇఎస్ఎల్) ఇటీవల ఉత్తర్ ప్రదేశ్, హర్యానాలో 40 లక్షల విద్యుత్తు స్మార్ట్ మీటర్లను పైలెట్ ప్రాజెక్టు కింద ఏర్పాటు చేసింది. అది గనుక విజయవంతమైతే దేశవ్యాప్తంగా వాటినే అమలులోకి తెచ్చే అవకాశం ఉందని ఇఇఎస్ఎల్ మేనేజింగ్ డైరెక్టర్ సౌరభ్ కుమార్ తెలిపారు. ప్రస్తుతం ఈ మీటర్లు ఖచ్చితమైన బిల్లులు రూపొందించడంలేదు. తద్వారా పవర్ డిస్ట్రిబ్యూటర్లకు నష్టాలు తెస్తున్నాయి. 2015 సెప్టెంబర్ నాటికి ప్రభుత్వ రంగం డిస్ట్రిబ్యూటర్లకు రూ. 4.3 లక్షల కోట్లు నష్టం వచ్చినట్లు సమాచారం. రెగ్యులర్ మీటర్ల కన్నా ఈ స్మార్ట్ మీటర్లు ఒక మెట్టు ఎక్కువని భావిస్తున్నారు. స్మార్ట్ మీటర్లు ఓ ప్రాంతంలో వాడే విద్యుత్తు మొత్తాన్ని లెక్కిస్తుంది. పవర్‌సప్లయర్‌కు ఈ వివరాలు అందిస్తుంది. దాంతో సప్లయర్ కచ్చితమైన బిల్లు రూపొందించడానికి వీలవుతుంది. ఇలాంటి స్మార్ట్ మీటర్లను ప్రస్తుతం ఇంగ్లాండ్‌లో ఉపయోగిస్తున్నారు. ప్రస్తుతం మనం మన రెగ్యులర్ మీటర్లలో చూసే సంక్లిష్ట సంఖ్యలకు బదులు ఈ స్మార్ట్ మీటర్లలో విద్యుత్తు వినియోగానికి సంబంధించిన సాధారణ రీడింగ్ ఉంటుంది. బిల్లు ఎక్కువతక్కువలు లేకుండా కచ్చితంగా వచ్చే అవకాశం ఉంటుంది. ఈ స్మార్ట్ మీటర్ల టెండర్ సంబంధిత సమావేశం న్యూఢిల్లీలో ఆగస్టు 20న జరిగింది.

జలదాడిలో విలవిల

- ధరణినగర్ కాలుష్యపు నురగల కాసారం
- కూలిన ఇండ్లు, మృతి చెందిన పశువులు
- మేడ్చల్ జిల్లాలో 40 ఇళ్లు నీట మునక
- కంట్రోల్ రూం ఏర్పాటు





జిల్లాల నుంచి మన తెలంగాణ ప్రతినిధులు : రాష్ట్ర వ్యాపితంగా శుక్రవారం ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లోతట్టు వాసులను భారీ వర్షం బెంబేలెత్తించింది. కుండపోత వర్షం కారణంగా మెట్రో రైలు వంతెనపై నీరు చేరి పలు ప్రాంతాల్లో జలపాతాలను తలపించాయి. వర్షం ధాటికి కాలనీలు, రోడ్లు కాలువలను తలపించాయి. దీంతో ట్రాఫిక్ ఎక్కడికక్కడ స్తంభించిపోయింది. గ్రేటర్‌లోని చెరువులు మత్తడిపోవడం కారణంగా శివారు ప్రాంత కాలనీలు జలమయవయ్యాయి. కూకట్‌పల్లి పీర్ల చెరువు, కాయితం కుంట నీటితో పొంగిపొర్లడంతో దీప్తినగర్ నగర్‌లో పలు అపార్ట్‌మెంట్లు నీట మునిగాయి. పరికి చెరువులోకి వరద నీరు చేరడంతో ధరణినగర్ కాలుష్యపు నురగలుకక్కింది. కాలనీ నిండా 15 నుంచి 20 ఫీట్ల మేర నురగ పేరుకు పోవడంతో ఆ ప్రాంత ప్రజలు నానా ఇబ్బందులుపడ్డారు.నురగ బీభత్సాన్ని తెలుసుకున్న అధికారులు ఆ ప్రాంతానికి చేరుకున్నా నురగ నిర్మూలనకు తీసుకోవలసిన చర్యలు తెలియక వెనుదిరిగారు.నగర శివారు ప్రాంతాల్లో 10 సెంటీమీటర్ల వర్షపాతం నమోదుకాగా నగరంలోని పలు ప్రాంతాల్లో 9 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది. ఖమ్మం జిల్లాలో మోస్తరుగా కురిసిన వర్షానికి వాడిపోతున్న మెట్ట పంటలకు పూరట లభించింది.నల్లగొండ జిల్లాలో 1178.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. పలు మండలాల్లో కురిసిన వర్షంతో చెరువుల్లోకి కొద్ది మోతాదులో నీరు చేరింది. బోర్లలో నీటిమట్టం పెరగింది. జిల్లాలోని 4 మండలాల్లో సాధారణం కన్నా తక్కువ వర్షం నమోదయింది. సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లోని 20 మండలాల్లో వర్షం కురిసింది.బీబీనగర్ మండలం భట్టుగూడెం వద్ద వంతెనపై నుండి మూసీ నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో వాహన రాకపోకలు నిలిచిపోయాయి. హుజూర్ నగర్ మండలం గోపాలపురం గ్రామంలో ఇంటిగోడ కూలిపోగా తృటిలో ప్రమాదం తప్పింది. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలోని బోధన్, వర్ని, రుద్రూర్‌లలో 60 మి.మిల వర్షం కురువగా రెంజల్ 68 మిమి, నవీపేట 53, డిచ్‌పల్లి, ఇందల్వాయి 86.6, ధర్‌పల్లి 42 మి.మి వర్షపాతం నమోదైంది. మెదక్ జిల్లాలో కురిసిన వర్షానికి పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. న్యాలకల్ మండలం మామిడ్గి గ్రామంలో ఇంటి గోడలు కూలిన సంఘటనలో నాలుగు పశువులు మృతి చెందాయి. మంచిర్యాల జిల్లాలో 6.4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. శుక్ర,శని వారాల్లో కురిసిన కురిసిన వర్షాల కారణంగా చెరువులు,కుంటలు నిండాయి.వాగులపై ఉన్న తాత్కాలిక వంతెనలు కొట్టుకుపోవడం మూలంగా జిల్లాలో 27 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి.జగిత్యాల జిల్లాలో సాధారణ వర్షపాతం నమోదుకాగా పెద్దపల్లి,కరీంనగర్,రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో ఇప్పటికి లోటు వర్షపాతమే నమోదయింది.ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని కొన్ని మండలాల్లో విస్తారంగా వర్షాలు కురవగా మరి కొన్ని మండలాల్లో మోస్తరు వర్షపాతం నమోదయింది. జగిత్యాల జిల్లా కోరుట్లలో అత్యధిక వర్షపాతం నమోదుకాగా పలు కాలనీలు జలమయమయి నీటి కుంటలను తలపించాయి. ఇబ్రహీంపేట మండలంలో వాగు ఉప్పొంగి యమాపూర్ వేములకుర్తి గ్రామాల మధ్య రాకపోకలు స్తంభించాయి. మేడ్చల్ జిల్లాలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా జన జీవనం స్తంభించింది. కూకట్‌పల్లి,ఎన్‌యుఆర్‌ఎం కాలనిల్లో 40 ఇళ్లు ముంపుకు గురయ్యాయి.భారీ వర్షాలకు ముంపునకు గురైన ప్రాంతాలను జిల్లా కలెక్టర్ యంవి రెడ్డి సందర్శించారు. ముంపుకు గురైన ప్రాంతాల్లో తక్షణం సహాయక చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. రానున్న రెండు రోజుల్లో భారీ వర్ష సూచన ఉన్నందున అధికారులు 24 గంటలు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రజల సహాయార్థం కంట్రోల్ రూం ఏర్పాటు చేసి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. రంగారెడ్డి జిల్లాలో కురిసిన వర్షాలతో రైతన్నకు పూరట లభించింది. శివారు మండలాల్లో నాలుగు గంటల్లో 120 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయింది.

చురుగ్గా నైరుతి

- మరో రెండు రోజులు భారీ వర్షాలు

మన తెలంగాణ/ హైదరాబాద్: నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలో చురుకుగా విస్తరిస్తున్నాయి. రెండు రోజుల పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తోందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. నిజామాబాద్ జిల్లాలో అతి భారీ వర్షం, హైదరాబాద్, రంగారెడ్డి, ఆదిలాబాద్, మెదక్, కరీంనగర్ జిల్లాల్లో భారీవర్షాలు కురుస్తాయి. ఉపరితల ఆవర్తనం ఉత్తర ఒడిషా నుంచి పశ్చిమ బెంగాల్ మధ్యప్రాంతంలో సముద్రమట్టానికి 4.5 కిలోమీటర్ల ఎత్తులో ఏర్పడింది. ఇది వచ్చే 24 గంటల్లో అల్పపీడనంగా మారే అవకాశం ఉంది. దీనికి తోడు మరో ఉపరితల ఆవర్తనం ఉత్తర చత్తీస్‌గఢ్ నుంచి ఈశాన్య మధ్యప్రదేశ్ వరకు సముద్రమట్టానికి 1.5 నుంచి 5.8 కిలో మీటర్ల ఎత్తులో వుంది. ఒడిషా నుంచి దక్షిణ తమిళనాడు వరకు కోస్తాంధ్ర, రాయలసీమ మీదుగా ఆవర్తన ద్రోణి ఏర్పడింది. ఫలితంగా వచ్చే నాలుగైదు రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. నిజామాబాద్ జిల్లా మాచారెడ్డి, సదాశివనగర్‌లో గరిష్టంగా 12 సెంటీమీటర్ల వర్షం కురిసింది. హైదరాబాద్, హకీంపేటలో 11, లింగంపేటలో 9, ఇబ్రహీంపట్నం, డిచ్‌పల్లి, ఆదిలాబాద్, గోల్కొండలో 9, సరూర్‌నగర్, శేరిలింగంపల్లి, గాంధారి, హయత్‌నగర్‌లో 8, మోమీన్‌పేట, రెంజల్, ఎల్లారెడ్డి, సంగారెడ్డి, మెట్‌పల్లిలో 7, నాగిరెడ్డిపేట, వర్ని, జుకల్, రామాయంపేటలో 6, దామరగిద్ద, నిజాంసాగర్, ఎడపల్లి, నవీపేట, శామీర్‌పేట, తాడ్వాయి, రాజేంద్రనగర్, మద్నూరు, బోధన్, కామారెడ్డి, రుద్రూరు, దో మకొండలో 5, బాన్స్‌వాడ, ధర్పల్లి, పిట్లం, వనపర్తి, కామారెడ్డి, బిర్కూరు, నిర్మల్, కోస్గి, నారాయణఖేడ్, బిక్నూరులో 4, నారాయణపేట్, ధర్మపురిలో 3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

టిఆర్ఎస్‌తో యుద్ధమే!

- 17 ఎంపి సీట్లు మావే : రాంమాధవ్

మన తెలంగాణ/ హైదరాబాద్ : రాష్ట్రంలో టిఆర్‌ఎస్‌తో బిజెపికి యుద్ధం తప్ప స్నేహమనేది లేదని, వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో ఒంటరిగానే పోటీ చేస్తామని, ఇందులో ఎలాంటి అనుమానాలు అక్కర్లేదని బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి రాం మాధవ్ స్పష్టం చేశారు.తెలంగాణలో మొత్తం 17 లోక్‌సభ స్థానాలను గెలుచుకోవడంతో పాటు మెజారిటీ అసెంబ్లీ సీట్లను కైవసం చేసుకుంటామన్నారు. ప్రధాన నరేంద్ర మోడీని నిత్యం కెసిఆర్ పొడుగుతున్నారని, పొగిడినంత మాత్రానా పోరాటం చేయకుండా పోతామనుకుంటే సరైంది కాదన్నారు. పార్టీలు వేరు, ప్రభుత్వాలు వేరు ఎన్నికల్లో మా పోరాటం టిఆర్‌ఎస్‌తో తప్పా మిగతా పార్టీలతో లేనేలేదన్నారు. బిజెపి గ్రేటర్ హైదరాబాద్ శాఖ సికింద్రాబాద్‌లోని ఒక ఫంక్షన్ హాల్‌లో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన సంకల్ప సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాం మాధవ్ మాట్లాడుతూ, తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం రూ.లక్ష కోట్లు ఇచ్చిందని బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా చెబితే సిఎం కెసిఆర్ రూ. 65 వేల కోట్లే ఇచ్చారని రాద్ధాంతం చేశారని అన్నారు. ఆ రూ. 65 వేల కోట్లను ఎక్కడ ఖర్చు చేశారో చెప్పేందుకు కెసిఆర్ ఎందుకు బింకానికి పోతున్నారని నిలదీశారు. హరిత తెలంగాణ, బంగారు తెలంగాణ అంటూ గడచిన మూడేళ్ళుగా టిఆర్‌ఎస్ ప్రభుత్వం ఊదరగొడుతోందని, రాష్ట్రంలో 31 జిల్లాలుంటే 26 జిల్లాలు ఎందుకు వెనకబడి ఉన్నాయో చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఇందులో ఆరు జిల్లాల పరిస్థితి కొంత మెరుగ్గా ఉన్నా, మిగతా 18 జిల్లాలు అత్యంత వెనుకబడినవని రాం మాధవ్ పేర్కొన్నారు. పార్లమెంట్‌లో కశ్మీరీ పండితుల గురించి ఆవేదన వ్యక్తం చేస్తూ మాట్లాడిన హైదరాబాద్ నేతలు ఇక్కడి రజాకార్ల దాష్టీకానికి బలైన, ఉగ్రవాదంతో నేటికీ బలవుతున్న వారి గురించి ఎందుకు మాట్లాడలేకపోతున్నారని నిలదీశారు. రజాకార్ల పార్టీ ఎంఐఎంను నెత్తికెక్కిచ్చుకుంటున్న టిఆర్‌ఎస్ 2019 ఎన్నికల సందర్భంగా ప్రజలకు సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఎంఐఎం, టిఆర్‌ఎస్‌ను మట్టి కరిపిస్తామని, ఇందుకోసం శక్తులన్నింటినీ వినియోగిస్తామని చెప్పారు. కేంద్రంలో 2019లోనూ మోడీదే తిరిగి గెలుపని, ఈ విషయాన్ని ప్రతిపక్షాలు స్వయంగా రాహుల్‌గాంధీయే అంగీకరిస్తున్నారన్నారు.

తెలంగాణ, ఎపిలో కొత్తరాజకీయాలు

కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో కొత్త రాజకీయాలకు రాంమాధవ్ శ్రీకారం చుడతారన్న విశ్వాసం ఉందన్నారు. ఈ సభలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె. లక్ష్మణ్, బిజెఎల్‌పి నేత జి. కిషన్‌రెడ్డి, ఎంఎల్‌సి రాంచందర్‌రావు తదితరులు మాట్లాడారు.




కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	64.4700
యూరో	70.4270
బ్రిటిష్ పౌండ్	83.4957
ఆస్ట్రేలియన్ డాలర్	47.4050
కెనెడియన్ డాలర్	47.0500
ఎమిరైట్ దిర్హామ్	17.5040
స్విస్ ఫ్రాంక్	64.5500
చైనీస్ యువాన్	9.3344
మలేషియన్ రింగిట్	14.8460
న్యూజిలాండ్ డాలర్	44.4990
హాంగ్‌కాంగ్ డాలర్	8.2824
జపనీస్ యెన్	0.5688
కువైట్ దినార్	212.0888
సౌతాఫ్రికన్ రాండ్	4.7209

బులియన్





బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22క్యారట్	24క్యారట్	మార్పు(%)
చెన్నై	27740	29668.45	0%
ముంబై	28450	30427.81	0%
ఢిల్లీ	28000	29946.52	0%
కోల్‌కతా	28370	30342.25	0%
కేరళ	27100	28983.96	0.37%
బెంగళూరు	27370	29272.73	0.26%
హైదరాబాద్	27740	29668.45	0%
గల్ఫ్	1374.45	1470.00	0.34%


వెండి ధర (రూ./ కిలో)

నగరం	శనివారం	శుక్రవారం	మార్పు (%)
చెన్నై	42000.00	41900.00	0.24
ముంబై	42000.00	41900.00	0.24
ఢిల్లీ	42000.00	41900.00	0.24
కోల్‌కత్తా	42000.00	41900.00	0.24
హైదరాబాద్	42000.00	41900.00	0.24

ఆదాయ పన్ను పరిమితి రూ. 2.5లక్షలే

- ప్రభుత్వానికి నీతి ఆయోగ్ సూచన





న్యూఢిల్లీ: ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని రూ. 2.50 లక్షలుగా కొనసాగిల్సిందేనని నీతి ఆయోగ్ శుక్రవారం ప్రభుత్వానికి సూచించింది. వ్యవసాయేతర సంస్థలు తమ ఆదాయాన్ని వ్యవసాయ ఆదాయంగా చూపెట్టకుండా చూసేందుకు చర్యలు చేపట్టాలని కూడా సూచించింది. కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ 2017–18 నుంచి 2019–20 వరకు మూడేళ్ల కార్యాచరణ ప్రణాళిక(యాక్షన్ అజెండా)ను విడుదల చేశారు. నల్లధనాన్ని కట్టడి చేయడంలో పన్ను అధికారులలో సైతం అవినీతిని తుడిచిపెట్టే చర్యలను ప్రభుత్వం తీసుకోవాలని నీతి ఆయోగ్ ఈ సందర్భంగా పేర్కొంది. అధికారులలో నిజాయితీని నెలకొల్పనంత వరకూ నల్లధనాన్ని అరికట్టడం కుదరదని కూడా అభిప్రాయపడింది. 211 పేజీల ఆ దస్త్రం ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితి రూ. 2.5 లక్షలుండాలని సూచించింది. వ్యవసాయేతర ఆదాయాన్ని వ్యవసాయ ఆదాయంగా చూపెట్టేవారిని అరెస్టు చేయాలని కూడా సూచించింది. వ్యవసాయ ఆదాయం మినహాయింపును రైతులను కాపాడేందుకు ఉద్దేశించింది మాత్రమేనని స్పష్టం చేసింది. ట్యాక్స్ అడ్మినిస్ట్రేషన్‌ను మెరుగుపరచాల ని, పన్ను వ్యాజ్యాలను వీలైనంత వరకు తగ్గించాలని నీతి ఆయోగ్ ఆ డాక్యుమెంట్‌లో పేర్కొంది.



పతన దిశలో భారతీయ షేర్లు

ముంబయి: భారతీయ షేర్లు అధోముఖ దిశగా కదులుతుండడంతో మదుపరులు జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. ఆసియాలో అతి పెద్ద స్టాక్ మార్కెటయిన భారత స్టాక్ మార్కెట్ ఇప్పుడు కన్సాలిడేషన్ దిశలో ఉంది. వ్యవస్థాపకులతో విభేదాలొచ్చి ఇన్ఫోసిస్ సిఇఓ అర్థాంతరంగా రాజీనామా చేయడంతో దేశీయంగాను, విదేశీయంగానూ సాఫ్ట్‌వేర్ రంగం డోలాయనంలో కొనసాగుతోంది. కొత్త జాతీయ పన్ను విధానం కారణంగా కంపెనీలు కొత్త ప్రాజెక్టులలో పెట్టుబడులు పెట్టడంలేదు. విస్తరణ కార్యక్రమాలు చేపట్టడంలేదు. ఇదంతా ఉత్పత్తి రంగాన్ని మందగమనంలో ఉంచేశాయి. ఈ నేపథ్యంలో విదేశీ మదుపరులు దాదాపు 1.6 బిలియన్ అమెరికా డాలర్లను మార్కెట్ నుంచి ఉపసంహరించుకున్నాయి. బంగారం, డెట్ ఫండ్స్ ఆకర్షణీయంగా మారడంతో దేశీ పొదుపు డబ్బు స్టాక్ మార్కెట్‌లోకి రావడం మందగించింది. ఆగస్టు తొలి భాగంలో 32686.48 గరిష్ఠ స్థాయిని తాకిన సెన్సెక్స్ 3.3 శాతం మేరకు పతనమైంది. తాజాగా సెన్సెక్స్ 31596.06 వద్ద ముగిసింది. పైగా ట్రేడింగ్ అస్థిరంగా ఉంటోంది. ఈ నెలాంతానికి ఇంకా నాలుగు రోజులే మిగిలి ఉ ంది. ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ కాంట్రాక్టులు గురువారం(ఆగస్టు 31) ముగియనున్నాయి. నిఫ్టీ కూడా 2.8 శాతం పతనమైంది. తాజాగా 9857.05 వద్ద ముగిసింది. అది ఇంకా పట్టును కోల్పోయేలా ఉందని భావిస్తున్నారు. ఇదిలా ఉండగా నందన్ నీలెకనీ తిరిగి ఇన్ఫోసిస్ చైర్మన్ బాధ్యతలు చేపట్టడంతో పెద్ద మదుపరులు ఇన్ఫోసిస్ షేర్లను గమనిస్తున్నారు. ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తితో సిఇఓ విశాల్ సిక్కాకు విభేదాలు రావడంతో ఆయన పదవికి రాజీనామా చేశారు. ఇప్పుడు నందన్ నిలేకనీ ఆ బాధ్యతలు చేపట్టారు. సిక్కా రాజీనామాతో ఇన్ఫోసిస్ షేర్లు భారీగా పతనమయ్యాయి. తాను కంపెనీ భవిష్యత్తుపై దృష్టిపెట్టనున్నానని నిలేకనీ(62) చెప్పారు.



గడువులోగానే ఆధార్-పాన్ అనుసంధానం?

న్యూఢిల్లీ: ఆదాయపు పన్ను చెల్లింపుదారుల పాన్–ఆధార్ అనుసంధానం తప్పనిసరి అని యుఐడిఎఐ సిఇఓ అజయ్ భూషణ్ పాండే ప్రకటించారు. గడువు తేదీ యథావిధిగానే ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఆగస్టు చివరి నాటికి పన్ను చెల్లింపుదారులు ఆధార్‌తో తమ పాన్ నంబర్ అనుసంధానం చేసుకోవాలని ఆయన నొక్కి చెప్పారు. సుప్రీంకోర్టు తాజా తీర్పు నేపథ్యంలో ఈ నిబంధనపై ఎలాంటి ప్రభావం ఉంటుందని ప్రశ్నించినప్పుడు ఆయన ఈ రకంగా జవాబిచ్చారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఆగస్టు 31 వరకు పొడిగించిన గడువుకల్లా ఆధార్–పాన్ అనుసంధానం చేసి తీరాలన్నారు. సుప్రీం కోర్టు ఉత్తర్వు నేపథ్యంలో తమ వివరాలు ఇవ్వడానికి ఎవరైనా తిరస్కరించారా? అని అడిగిన ప్రశ్నకు ఆయన అలాంటిదేమి జరగలేదన్నారు. ఆధార్ చట్టం చెల్లుబాటు చట్టమని, ఆధార్ చట్టంపై సుప్రీంకోర్టు తాజా తీర్పులో ఎలాంటి వ్యాఖ్యానం చేయలేదన్నారు.

రూ. 250 పెరిగిన బంగారం ధర

న్యూఢిల్లీ: ప్రపంచ మార్కెట్‌లో బంగారంకు డిమాండ్ పెరగడం, స్థానిక నగల వర్తకులు తాజా కొనుగోళ్లు చేస్తుండడంతో బంగారం ధర రూ. 250 మేరకు పెరిగి 10 గ్రాముల బంగారం విలువ రూ. 29950 వద్ద ట్రేడయింది. అయితే కిలో వెండి ధర మాత్రం రూ. 40,200 వద్ద ఎలాంటి మార్పు లేకుండా స్థిరంగా ఉంది. ప్రపంచ మార్కెట్‌లో బంగారం ధర 0.39 శాతం మేరకు పెరిగి న్యూయార్క్‌మార్కెట్‌లో ఔన్స్ బంగారం 1290.80 వద్ద ట్రేడయింది. న్యూఢిల్లీలో 99.9 శాతం స్వచ్ఛమైన బంగారం 10 గ్రాములు రూ. 29950, 99.5 శాతం స్వచ్ఛమైన బంగారం ధర 10 గ్రాములు రూ. 29800 పలికింది. 100 పీసుల వెండి అమ్మకం ధర 74000, కొనుగోలు ధర 73000గా ఉంది.


బంగారం దిగుమతులపై నిషేధం

దక్షిణ కొరియా నుంచి విపరీతంగా బంగారం, వెండి దిగుమతులు పెరుగుతుండడంతో ప్రభుత్వం వాటిపై నిషేధం విధించింది. ఈ ఉత్పత్తులను నియంత్రిత కేటగిరిలో చేర్చింది. దీంతో బంగారం, వెండిని దిగుమతి చేసుకోవాలంటే దిగుమతిదారులు ముందస్తుగా ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోవల్సి ఉంటుంది. జులై 1 నుంచి ఆగస్టు 21 వరకు దక్షిణ కొరియా నుంచి 1 బిలియన్ డాలర్ల బంగారం దిగుమతి చేసుకున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కాయిన్లు, ఆభరణాల రూపం సహా అన్ని రకాల బంగారం, వెండి ఉత్పత్తులపై ఈ పరిమితిని విధిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ప్రాథమిక కస్టమ్స్ సుంకం లేకుడా దక్షిణకొరియా, భారత్‌కు మధ్య స్వేచ్ఛాయుత వాణిజ్యం జరుగుతోంది. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం లేని దేశాల నుంచి దిగుమతి చేసుకునే బంగారం ఉత్పత్తులపై 10 శాతం కస్టమ్స్ సుంకం ఉంది. ప్రపంచంలో బంగారాన్ని అతిగా వినియోగం చేసే దేశాలలో చైనా తర్వాత భారత్ ఉంది.ప్రస్తుతం మన దేశంలో 400కు పైగా ఉత్పత్తులు నియంత్రిత దిగుమతుల జాబితాలో ఉన్నాయి. జులైలో బంగారం దిగుమతులు 95 శాతం పెరిగాయి.



చిరంజీవికి గురువుగా అమితాబ్?

మునుపెన్నడూ లేని విధంగా భారీ అంచనాలతో తెరకెక్కుతున్న బయోపిక్ చిత్రం 'సైరా'. తొలి తెలుగు స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహా రెడ్డి జీవితంపై తెరకెక్కుతున్న ఈ చిత్రంలో మెగాస్టార్ చిరంజీవి టైటిల్ రోల్ పోషిస్తున్నాడు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్, తమిళ నటుడు విజయ్ సేతుపతి వంటి ప్రముఖులు నటిస్తున్నారు. ఈ చిత్రంలో అమితాబ్ పాత్ర గురించి ఆసక్తికరమైన ప్రచారం జరుగుతోంది. అమితాబ్ ఈ చిత్రంలో ఉయ్యాలవాడ నరసింహా రెడ్డికి గురువుగా కనిపిస్తున్నట్లు తెలిసింది. దీని గురించి అధికారిక సమాచారం ఇంకా రావాల్సి ఉంది. సురేందర్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని చిరంజీవి తనయుడు రామ్‌చరణ్ నిర్మిస్తున్నాడు. స్టార్ బ్యూటీ నయనతార హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి ప్రముఖ సాంకేతిక నిపుణులు పనిచేస్తున్నారు.



రొమేనియాలో ఆటా పాట



మహేశ్‌బాబు

సూపర్‌స్టార్ మహేశ్‌బాబు, స్టార్ డైరెక్టర్ ఎ.ఆర్.మురుగదాస్ కాంబి నేషన్‌లో ఠాగూర్ మధు సమర్పణలో ఎన్.వి.ఆర్. సినిమా ఎల్‌ఎల్‌పి, రిలయ న్స్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకాలపై ఎన్.వి.ప్రసాద్ నిర్మిస్తున్న భారీ చిత్రం 'స్పైడర్'. ఈ చిత్రానికి సంబంధించి బ్యాలెన్స్ ఉన్న పాట చిత్రీకరణ రొమేని యాలో శుక్ర వారం నుంచి ప్రారంభ మైంది. ఈనెల 31 వరకు ఈ పాట చిత్రీకరణ జరుగుతుంది. దీంతో మొత్తం షూటింగ్ పార్ట్ పూర్తవుతుంది. తెలుగు, తమిళ భాషల్లో ఏక కాలంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని దసరా కానుకగా సెప్టెంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేం దుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తు న్నారు. రకుల్‌ప్రీత్ సింగ్ హీరోయిన్‌గా నటి స్తున్న ఈ చిత్రంలో ఎస్. జె.సూర్య ము ఖ్య పాత్ర పోషిస్తు న్నారు.

విఆర్ స్పెషల్ వీడియో...

'బాహుబలి2'తో వర్చువల్ రియాలిటీ అనే కొత్త సాంకేతిక నైపుణ్యాన్ని భారతీ య ప్రేక్షకులకు పరిచయం చేసి ఒక కొత్త అనుభూతిని అందించింది రాజమౌళి బృందం. మహి ష్మతి సామ్రాజ్యాన్ని 360 డిగ్రీల కోణంలో చూస్తూ అక్కడే ఉన్న అనుభూతి పొందు తూ పులకించి పోయారు మన ప్రేక్షకు లు. ఇప్పుడు మహేశ్ కొత్త సినిమా 'స్పైడర్'లో ఈ టెక్నాలజీని వాడుకుంటున్నారు. వర్చువల్ రియాలిటీతో ఒక స్పెషల్ వీడియోను రూపొందించిందట చిత్ర బృందం. ముందుగా ఈ విఆర్ వీడియోను హాలీవుడ్‌లోని ఒక స్టూడియో లో రిలీజ్ చేస్తున్నట్లు సమాచారం. ఆతర్వాత ఇక్కడి ప్రేక్షకుల కోసం కూడా ఆ వీడియోను రిలీజ్ చేస్తారట.



అల్లు అర్జున్

భారీ పోరాటాల్లో...

అల్లు అర్జున్, అను ఇమాన్యుయల్ జంటగా వక్కంతం వంశీ దర్శకుడిగా పరిచయమవుతూ తెరకెక్కుతున్న చిత్రం 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా'. కె.నాగబాబు సమర్పణలో రామలక్ష్మి సినీ క్రియేషన్స్ బ్యానర్‌లో శిరీష శ్రీధర్ నిర్మాతగా బన్నీ వాసు సహ నిర్మాతగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో అర్జున్, శరత్ కుమార్‌లు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం రామోజీ ఫిల్మ్ సిటీలో కొనసాగుతోంది. యాక్షన్ కొరియోగ్రాఫర్స్ రామ్‌లక్ష్మ ణ్‌ల సారథ్యంలో యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోంది. బాలీవుడ్ సంగీత ద్వయం విశాల్‌శేఖర్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాత శిరీషా శ్రీధర్ మాట్లాడుతూ ''అల్లు అర్జున్ నటిస్తున్న భారీ చిత్రం 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా' షూటింగ్ రామోజీ ఫిల్మ్ సిటీలో జరుగుతోంది. ఫైట్ మాస్టర్లు రామ్‌లక్ష్మ ణ్‌ల ఆధ్వర్యంలో సినిమాకే హైలైట్‌గా నిలిచే విధంగా యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోంది. భారీ తారాగణం, సాంకేతిక నిపుణులతో చిత్రాన్ని ఎక్కడా రాజీపడకుండా చిత్రీకరిస్తున్నాం. అన్ని కార్యక్రమాలను పూర్తిచేసి వచ్చే ఏడాది ఏప్రిల్ 27న ఈ సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం''అని అన్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీః రాజీవ్ రవి, ఎడిటింగ్ః కోటగిరి వెంకటేశ్వరరావు, సాహిత్యంః రామజోగయ్య శాస్త్రి.

క్యూట్‌గా కుశుడు



ఎన్‌టిఆర్

ఎన్‌టిఆర్ అభిమానులను వరుసగా ఆనందపరుస్తున్నారు 'జై లవ కుశ' ఫిల్మ్‌మేకర్స్. సినిమా లోని లవ కుమార్ రోల్‌కు సంబం ధించిన టీజర్ విడుదలైన కొన్ని గంటల్లోనే... కుశ పాత్ర ఫస్ట్ లుక్ కూడా వచ్చే సింది. పొడవాటి హెయిర్ స్టైల్‌తో ట్రిమ్ చేసిన గడ్డంతో క్యూట్‌గా కనిపిస్తున్న కుశుడు ఎన్‌టిఆర్ అభిమా నులను ఎంతగానో ఆకట్టుకుం టున్నాడు. దీంతో 'జై లవ కుశ'లోని మూడు పాత్రల గెటప్‌లు రిలీజైనట్టే. అటు ప్రియ పాత్రలో నటిస్తున్న రాశీఖన్నా లుక్ సైతం కుశతో పాటే వచ్చేసింది. త్వరలో మరో హీరోయిన్ నివేద థామస్ లుక్ కూడా వచ్చేస్తుందట. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 21న దసరా కానుకగా రిలీజవు తున్న 'జై లవ కుశ'పై ప్రేక్షకుల అంచనాలు మరింత పెరుగుతున్నాయి. ఇక 50 సెకన్ల నిడివి గల లవ కుమార్‌కు సంబం ధించిన టీజర్‌కు మంచి స్పందన వస్తోంది. ఈ వీడి యోలో లవ కుమా ర్‌ను కామన్ మ్యాన్‌గా చూపించాడు దర్శకుడు బాబీ. ఈ టీజర్‌లో 'మంచి తనం... పది పుస్త కాల్లో ఉంటే పాఠం అవుతుంది. మనలో ఉంటే గుణ పా ఠం... అదే నా జీవితాన్ని తలకిందులు చేసిం ది''అని ఎన్‌టిఆర్ చెప్పిన డైలాగ్ విపరీతంగా ఆకట్టుకుంటోంది. ఇక సినిమా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్ర మాలు వేగంగా జరుగుతున్నాయి. ఎన్టీఆర్ త్రిపాత్రాభినయం చేస్తున్న ఈ చిత్రం ఎప్పుడు రిలీజవుతుందా అని అభిమానులు, ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

'జగదేక వీరుడు అతిలోక సుందరి'లా 'శరభ'



యన్.నరసింహారావు, ఆకాష్ కుమార్, చిరంజీవి, జయప్రద, సురేష్ కపాడియా,మిస్తి చక్రవర్తి

ఆకాష్ కుమార్, మిస్తి చక్రవర్తి హీరోహీరోయిన్లుగా జయప్రద ప్రధాన పాత్రలో రూపొందుతున్న చిత్రం 'శరభ'. యన్.నరసింహారావు దర్శకత్వంలో అశ్వనీకుమార్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్‌లుక్, మోషన్ పోస్టర్‌ను మెగాస్టార్ చిరంజీవి విడుదల చేశారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ ''ఈ సినిమాకు సంబంధించిన కొన్ని క్లిప్పింగ్స్‌ను చూశాను. నాకు చాలా బాగా నచ్చాయి. జయప్రద, ఆకాష్ నటన అద్భుతంగా ఉంది. దర్శకుడు నరసింహారావు ఆషామాషీగా ఈ సినిమాను తెరకెక్కించలేదని అర్థమైంది. ఇదొక సోషియో ఫాంటసీ మూవీ. దేవుడు, దెయ్యం, మనిషి మధ్య జరిగే కథ ఇది. నేను చేసిన జగదేక వీరుడు అతిలోక సుందరి మూవీలా ఉంటుంది. సినిమాలో జయప్రద నటన నాకెంతగానో నచ్చింది. తను గర్భం ధరించి పిల్లవాడిని కనే సమయంలో దెయ్యం ఆ బిడ్డను చంపాలనుకునే సందర్భంతో పాటు పిల్లవాడు పుట్టిన తర్వాత దెయ్యం జయప్రదను ఆవహించి బిడ్డను చంపేయాలనుకున్నప్పుడు ఆమె నటన అద్భుతంగా అనిపించింది. అలాగే క్లైమాక్స్‌లో ఆకాష్ నరసింహస్వామిగా మారేటప్పుడు తనలో కలిగే మార్పులు, అతని నటన చూసి అభినందించకుండా ఉండలేకపోయాను. సినిమా టేకింగ్ చూస్తే దర్శకుడు నరసింహ రావు మాటల మనిషి కాదు చేతల మనిషి అని అర్థమైంది. సినిమాటోగ్రఫీ, గ్రాఫిక్స్ అత్యుత్తమంగా ఉన్నాయి. సినిమా పెద్ద హిట్ అవుతుందని నమ్మకంగా చెప్పగలను''అని అన్నారు. జయప్రద మాట్లాడుతూ ''శరభ చిత్రం కంటే ముందు నాకు చాలా తెలుగు సినిమాల్లో అవకాశాలు వచ్చినా మంచి పర్‌ఫార్మెన్స్ ఉన్న రోల్ చేయాలని ఎదురుచూశాను. అలాంటి సమయంలో దర్శకుడు నరసింహ 'శరభ' కథతో నా దగ్గరకు వచ్చాడు. సినిమా కథ ఎంతగానో నచ్చింది. హై టెక్నికల్ వాల్యూస్‌తో కూడిన సోషియో ఫాంటసీ మూవీ ఇది. ఆకాష్‌కు ఈ సినిమా పెద్ద బ్రేక్ అవుతుంది''అని చెప్పారు. సురేష్ కపాడియా మాట్లాడుతూ ''సోషియో ఫాంటసీ మూవీ అయిన 'శరభ' అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చుతుంది. మంచి, చెడుల మధ్య జరిగే పోరాటమే ఈ చిత్రం. బడ్జెట్ విషయంలో ఎక్కడా రాజీపడలేదు''అని పేర్కొన్నారు. హీరో ఆకాష్ కుమార్ మాట్లాడుతూ ''శరభ సినిమా నాకొక మంచి అనుభవం. మూడేళ్ల ప్రయాణం ఈ సినిమా. ఇది గొప్ప సినిమా అవుతుందని చెప్పగలను. అబ్బురపరిచే విజువల్స్‌తో ఈ చిత్రం ప్రేక్షకులను అలరిస్తుంది''అని తెలిపారు. దర్శకుడు ఎన్.నరసింహారావు మాట్లాడుతూ ''చాలా సంవత్సరాలుగా డైరెక్టర్ కావాలనుకునే నా కల ఈ సినిమాతో తీరింది. ముఖ్యంగా చిరంజీవి మా సినిమాకు సపోర్ట్ చేయడం ఆనందంగా ఉంది. మంచి, చెడుల మధ్య జరిగే ఈ సినిమాలో ప్రతీకారం కూడా ఉంటుంది. తండ్రి సెంటిమెంట్‌తో పాటు నరసింహస్వామి దైవబలం కూడా ఈ సినిమాలో ఉంటుంది''అని అన్నారు.

కామెడీ థ్రిల్లర్ 'మేడ మీద అబ్బాయి'

అల్లరి నరేష్ కథానాయకుడిగా జాహ్నవి ఫిల్మ్స్ పతాకంపై బొప్పన చంద్రశేఖర్ నిర్మిస్తున్న చిత్రం 'మేడమీద అబ్బాయి'. నిఖిలా విమల్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రం ట్రైలర్ విడుదల కార్యక్రమం హైదరాబాద్‌లో జరిగింది. ట్రైలర్‌ను విడుదల చేసిన అల్లరి నరేష్ మాట్లాడుతూ ''నా కెరీర్‌లో కొత్త ప్రయత్నం ఈ చిత్రం. నేను చేసిన గమ్యంలో గాలిశీను నవ్విస్తూనే ఏడిపిస్తాడు. అలాంటి కథ కోసం చాలా కాలంగా వెతికాను. దాదాపు మూడేళ్ల క్రితం అలాంటి కథ దొరికింది. అదే ఒరు వడక్కన్ సెల్ఫీ. మలయాళంలో కామెడీకి థ్రిల్లర్ అంశాల్ని జోడించి చేసిన ఈ చిత్రం నాకు బాగా నచ్చింది. దీంతో ఈ చిత్రాన్ని తెలుగులో రీమేక్ చేశాం. మలయాళంలో ఈ చిత్రాన్ని నివీన్ పాల్ చేశాడు. అతని బాడీ లాంగ్వేజ్‌ను అనుసరించకుండా నా పంథాలో చేసిన చిత్రమిది. ఫీల్ మిస్సవకూడదనే ఉద్దేశ్యంతో మాతృకను తెరకెక్కించిన దర్శకుడినే ఈ చిత్రానికి తీసుకున్నాం. ఈ చిత్రం సెప్టెంబర్ 8న విడుదలకానుంది''అని అన్నారు. నిర్మాత బొప్పన చంద్రశేఖర్ మాట్లాడుతూ అల్లరి నరేష్ నటించిన అల్లరి, ప్రాణం, గమ్యం, శంభో శివ శంభో... ఈ నాలుగు చిత్రాలు కలిస్తే ఎలా ఉంటుందో ఈ చిత్రం కూడా ఆ స్థాయిలో ఉంటుదని అన్నారు. హైపర్ ఆది మాట్లాడుతూ ''సినిమాలో ఎక్కడ కామెడీ కావాలో అక్కడ కామెడీ ఉంటుంది. ఎక్కడ థ్రిల్లింగ్ ఎలిమెంట్ కావాలో అక్కడ థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ ఉన్న సినిమా ఇది''అని చెప్పారు. ఈ కార్యక్రమంలో గేయ రచయిత విజయ్ కుమార్, ఎగ్జిక్యూటివ్ నిర్మాత ఎం.ఎస్.కుమార్, సీతారామరాజు పాల్గొన్నారు.



'మేడమీద అబ్బాయి' ట్రైలర్ విడుదల కార్యక్రమంలో అల్లరి నరేష్, హైపర్ ఆది, బొప్పన చంద్రశేఖర్ తదితరులు



కళ్యాణ్‌రామ్ సరసన తమన్నా

ప్రస్తుతం కళ్యాణ్‌రామ్ కొత్త దర్శకుడు ఉపేంద్ర మాధవ్ దర్శకత్వంలో ఎంఎల్‌ఎ (మంచి లక్షణాలున్న అబ్బాయి) అనే సినిమాతో పాటు జయేంద్ర దర్శకత్వంలో మరో సినిమా చేస్తున్నాడు. ఎంఎల్‌ఎ సినిమాలో కాజల్ హీరోయిన్‌గా నటిస్తుండగా...జయేంద్ర దర్శకత్వంలో వస్తున్న సినిమాలో మిల్కీ బ్యూటీ తమన్నాను హీరోయిన్‌గా ఖరారు చేశారు. సాధారణంగా కళ్యాణ్‌రామ్ సినిమాల్లో ఎక్కువ మంది హీరోయిన్‌లు కొత్తవాళ్లే నటిస్తుంటారు. కానీ ఇప్పుడు రూట్ మార్చి టాప్ హీరోయిన్లతో సినిమాలు చేస్తున్నాడు ఈ కథానాయకుడు. ముందు జయేంద్ర సినిమాలో కొత్త హీరోయిన్‌నే అనుకున్నప్పటికీ మనసు మార్చుకొని చివరి నిమిషంలో తమన్నా వైపు మొగ్గుచూపారు. ఈస్ట్‌కోస్ట్ ప్రొడక్షన్స్ బ్యానర్‌లో నిర్మిస్తున్న ఈ సినిమాలో తమన్నా సెప్టెంబర్ నుంచి రెగ్యులర్ షూటింగ్‌లో పాల్గొంటుంది.

కమర్షియల్ సినిమాలకు ప్రేక్షకులను తీసుకొచ్చేలా చేయడంలో గ్లామర్ ముఖ్య పాత్ర పోషిస్తుంది. దీంతో కళ్యాణ్‌రామ్ ఇప్పుడు తన సినిమాల్లో స్టార్ బ్యూటీలను హీరోయిన్లుగా తీసుకుంటూ రూట్ మార్చాడు.

దర్పణం చిత్రం షురూ



సుభాంగి పంత్, తనిష్కా రెడ్డి, అలెక్సియస్, ఎన్.శంకర్, ప్రవీణ్ కుమార్ యాదవ్, రామకృష్ణ

శ్రీ సిద్ధి వినాయక ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వి.రామకృష్ణ దర్శకత్వంలో వి.ప్రవీణ్ కుమార్ యాదవ్ నిర్మించనున్న చిత్రం 'దర్పణం'. ఈ చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లోని రామానాయుడు స్టూడియోలో లాంఛనంగా ప్రారంభమైంది. తనిష్క్ రెడ్డి, అలెక్సియస్, సుభాంగి పంత్ హీరోహీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రం ముహూర్తపు సన్నివేశానికి చిన శ్రీశైలం యాదవ్ పూజా కార్యక్రమాలు నిర్వహించగా పరుచూరి వెంకటేశ్వరరావు మొదటి సన్నివేశానికి క్లాప్ కొట్టారు. దర్శకుడు ఎన్.శంకర్ కెమెరా స్విచ్చాన్ చేశారు. ఈ కార్యక్రమంలో నవీన్ యాదవ్, శివశక్తి దత్తా, శ్రీనివాస రెడ్డి, కాదంబరి కిరణ్, కొమరం వెంకటేష్, బందరు బాబీ, మహేష్, సిద్ధార్థ్ సదాశివుని, హీరోహీరోయిన్లు తనిష్క్ రెడ్డి, తనిష్క్ రెడ్డి, అలెక్సియస్, సుభాంగి పంత్ తదితరులతో పాటు చిత్ర బృందం పాల్గొంది. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో కాదంబరి కిరణ్ మాట్లాడుతూ ''హైదరాబాద్‌లో తెలుగు చిత్ర పరిశ్రమ ఇంత బలంగా ఉండటానికి తోడ్పడిన వారిలో చిన శ్రీశైలం యాదవ్ కూడా ఒకరు. ఇక్కడ కార్మికులకు అండగా ఉంటూ... నిర్మాతలు, దర్శకులకు తన వంతు సహాయ సహకారాలను ఆయన అందిస్తున్నారు. ఇక ఆయన కుమారుడు ప్రవీ ణ్ కుమార్ యాదవ్ నిర్మాతగా ఈ సినిమా ప్రారంభం కావడం శుభదాయకం. అలాగే బాల నటుడిగా అందరికీ సుపరిచితుడైన తనిష్క్ రెడ్డి ఈ చిత్రంతో హీరోగా పరిచయమవుతున్నాడు. ఈ చిత్రం హిట్ కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను''అని అన్నారు. చిత్ర నిర్మాత ప్రవీణ్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ ''నిర్మాతగా దర్పణం నా మొదటి చిత్రం. దర్శకుడు రామకృష్ణ కథ చెప్పిన విధానం నన్ను ఎంతగానో ఆకట్టుకుంది. మంచి ప్రేమ కథ ఇది. సింగిల్ షెడ్యూల్‌లో ఈ సినిమాను పూర్తిచేయనున్నాం''అని తెలిపారు. ఈ చిత్రానికి కెమెరాః సతీష్ ముత్యాల, సంగీతః సిద్ధార్థ్ సదాశివుని, ఎడిటరః ఈ.ఎస్.ఈశ్వర్, స్టంట్స్ః మల్లేష్.



మాథ్యూస్ పెద్ద తప్పిదమే చేశాడు: రణతుంగ

కొలంబో: శ్రీలంక క్రికెట్ జట్టు ఆట రోజురోజుకు మరింత దిగజారడం ఆందోళన కలిగించే అంశమని లంక మాజీ కెప్టెన్ అర్జున రణతుంగ అభిప్రాయపడ్డాడు. లంక జట్టు కెప్టెన్సీ నుంచి మాథ్యూస్ తప్పుకోవడంతో పరిస్థితి మరింత దయనీయంగా మారిందన్నాడు. సీనియర్లు రిటైర్మెంట్ తర్వాత మాథ్యూస్ అద్భుత కెప్టెన్సీతో లంకను పలు సిరీస్‌లలో విజయాలు సాధించి పెట్టిన విషయాన్ని రణతుంగ గుర్తు చేశాడు. ఒక్క జింబాబ్వే చేతిలో ఓడిపోయినంత మాత్రాన అతను కెప్టెన్సీ నుంచి తప్పించుకోవాల్సిన అవసరం లేదన్నాడు. అయితే అతని రాజీనామాను ఆమోదించి శ్రీలంక బోర్డు పెద్ద తప్పిదమే చేసిందన్నాడు. బోర్డులో తానుంటే మాథ్యూస్ రాజీనామాను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదించే వాడిని కాదని రణతుంగ స్పష్టం చేశాడు. క్లిష్ట సమయంలో మాథ్యూస్ జట్టు కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పుకొని పెద్ద తప్పిదమే చేశాడని చెప్పాడు. ప్రస్తుతం లంకకు మంచి సారథి అవసరం ఎంతైన ఉందన్నాడు. దీంతో మళ్లీ మాథ్యూస్‌కు కెప్టెన్సీ అందించే దిశగా బోర్డు ప్రయత్నాలు ప్రారంభించాలని సూచించాడు. లేకుంటే భవిష్యత్తులో లంక మరింత ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కోవడం ఖాయమని రణతుంగ హెచ్చరించాడు.

ప్రయోగాలు ఉంటాయి

ఫీల్డింగ్ కోచ్ శ్రీధర్

పల్లెకెలె: శ్రీలంకతో జరుగుతున్న వన్డే సిరీస్‌లో ప్రయోగాలు కొనసాగుతాయని టీమిండియా ఫీల్డింగ్ కోచ్ ఆర్. శ్రీధర్ అన్నాడు. రానున్న ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకొని ఇప్పటినుంచే ఈ ప్రక్రియాకు శ్రీకారం చుట్టినట్టు వివరించాడు. రెండో వన్డేలో బ్యాటింగ్ ఆర్డర్‌లో చేసిన ప్రయోగాలు జట్టు వ్యూహాల్లో భాగంగానే తీసుకున్నామని తెలిపాడు. మూడో వన్డేలోనూ ప్రయోగాలకు ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశాడు. ప్రస్తుతం టీమిండియాలో మ్యాచ్ విన్నర్‌లకు కొదవలేదన్నాడు. అవకాశం దొరికితే సత్తా చాటేందుకు రిజర్వ్ బెంచ్ ఆటగాళ్లు సిద్ధంగా ఉన్నారన్నాడు. అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనే పట్టుదలతో ప్రతి ఆటగాడు ఉన్నాడని తెలిపాడు. ఇది జట్టుకు ఎంతో ఊరటనిచ్చే అంశమన్నాడు. రెండో వన్డేలో అసాధారణ బ్యాటింగ్‌తో జట్టును ఆదుకున్న మహేంద్ర సింగ్ ధోనీపై శ్రీధర్ ప్రశంసల వర్షం కురిపించాడు. మరి కొన్నేళ్లపాటు అంతర్జాతీయ క్రికెట్ ఆడే సత్తా ధోనీకి ఉందన్నాడు. ఈ మ్యాచ్‌లో కూడా అతను జట్టుకు కీలకంగా మారాడని తెలిపాడు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాల్లో భారత్ చాలా బలంగా ఉందన్నాడు. రానున్న ప్రపంచకప్ నాటికి మరింత బలోపేతమైన జట్టుగా ఎదగడం ఖాయమని శ్రీధర్ జోస్యం చెప్పాడు.



భారత్‌ను ఓడిస్తాం: కపుగెదెర

పల్లెకెలె: భారత్‌తో జరిగే మూడో వన్డేలో విజయం సాధిస్తామని శ్రీలంక తాత్కాలిక కెప్టెన్ కపుగెదెర ధీమా వ్యక్తం చేశాడు. రెండు వన్డేలు ఓడిపోయినా తమ ఆశలు ఇంకా మిగిలే ఉన్నాయన్నాడు. రెండో వన్డేలో తాము విజయం వాకిట వరకు వచ్చిన విషయాన్ని కపుగెదెర గుర్తు చేశాడు. ఈ మ్యాచ్‌లో గెలిచి సిరీస్ అవకాశాలను సజీవంగా ఉంచుకోవడమే తమ ముందున్న ఏకైక లక్ష్యమన్నాడు. జట్టులో ప్రతిభకు కొదవలేదన్నాడు. అయితే అనుభవలేమి తమకు ప్రతికూలంగా మారిందన్నాడు. మూడో వన్డేలో సమష్టిగా ముందుకు సాగుతామన్నాడు. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో భారత్‌కు గట్టి పోటీ ఇస్తామన్నాడు. ఈ మ్యాచ్ తమకు చావోరేవోగా మారిందన్నాడు. అమీతుమీ తేల్చుకునేందుకు జట్టు సిద్ధంగా ఉందన్నాడు. ధనంజయ ఈ మ్యాచ్‌లో కూడా చెలరేగుతాడనే నమ్మకం తనకుందన్నాడు. అతను విజృంభిస్తే భారత్‌ను తక్కువ స్కోరుకే కట్టడి చేయడం కష్టమేమి కాదన్నాడు.

హనీమూన్ మానుకుని..

పల్లెకెలె: రెండో వన్డేలో అసాధారణ బౌలింగ్‌తో భారత్‌ను వణికించిన శ్రీలంక యువ సంచలనం అఖిల ధనంజయ ప్రస్తుతం వన్డే సిరీస్‌కు ప్రత్యేక ఆకర్షణగా మారాడు. జట్టులో అనూహ్యంగా చోటు దక్కించుకున్న ధనంజయ రెండో వన్డేలో వెంటవెంటనే ఆరు వికెట్లు తీసి భారత్‌ను ఓటమి కోరల్లోకి నెట్టాడు. అయితే మహేంద్ర సింగ్ ధోనీ, భువనేశ్వర్ కుమార్ అసాధారణ బ్యాటింగ్‌తో లంక ఆశలపై నీళ్లు చల్లిన విషయం తెలిసిందే. ఈ మ్యాచ్‌లో లంక ఓడినా అద్భుత బౌలింగ్‌ను కనబరిచిన ధనంజయకు మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు లభించింది. కాగా, ధనంజయకు తొలుత శ్రీలంక వన్డే జట్టులో చోటు దక్కలేదు. రెండో వన్డేకు ఒక రోజు ముందే తన చిన్ననాటి స్నేహితురాలు నెతాలి టెక్షిణిని పెళ్లాడాడు. అయితే పెళ్లి రోజే అతనికి శ్రీలంక జట్టు నుంచి పిలుపు వచ్చింది. దీంతో అతను హుటాహుటిన జట్టు బస చేసిన హోటల్‌కు చేరుకున్నాడు. రెండో వన్డే జరిగిన గురువారం రోజే ధనంజయ హనీమూన్ కోసం భార్యతో కలిసి అత్తారింటికి వెళ్లాల్సి వుంది. అయితే అనూహ్యంగా జాతీయ జట్టులో చోటు లభించడంతో ఆ కార్యక్రమాన్ని వాయిదా వేసి జట్టుతో చేరాడు. ఇక్కడ అద్భుత బౌలింగ్‌తో భారత్‌ను ముప్పుతిప్పలు పెట్టి సరికొత్త స్టార్‌గా అవతరించాడు.





సిరీసే లక్ష్యంగా భారత్

• లంకకు పరీక్ష • సమరోత్సాహంతో టీమిండియా • నేడు మూడో వన్డే

పల్లెకెలె: ఓటమి కోరల్లో చిక్కుకొని మహేంద్ర సింగ్ ధోనీ, భువనేశ్వర్ కుమార్ చిరస్మరణీయ బ్యాటింగ్ ప్రతిభతో అద్భుత విజయం సాధించిన టీమిండియా ఆదివారం జరిగే మూడో వన్డేకు సమరోత్సాహంతో సిద్ధమైంది. ఈ మ్యాచ్‌లోనూ గెలిచి మరో రెండు వన్డేలు మిగిలివుండగానే సిరీస్‌ను దక్కించుకోవాలనే పట్టుదలతో కోహ్లి సేన ఉంది. మరోవైపు గెలవాల్సిన మ్యాచ్‌లో ఎదురైన అనూహ్య ఓటమితో శ్రీలంక ఆత్మరక్షణలో పడింది. సిరీస్ అవకాశాలను సజీవంగా ఉంచుకోవాలంటే ఈ మ్యాచ్‌లో కచ్చితంగా గెలవాల్సిందే. అయితే రెగ్యులర్ కెప్టెన్ ఉపుల్ తరంగ ఈ మ్యాచ్‌కు అందుబాటులో లేకుండా పోయాడు. స్లో ఓవర్‌రేట్ కారణంగా తరంగాపై రెండు వన్డేల నిషేధం విధించారు. దీంతో అతను లేకుండానే ఈ మ్యాచ్‌లో లంక బరిలోకి దిగనుంది. కాగా, కపుగెదెర కెప్టెన్సీ బాధ్యతలను నిర్వర్తించనున్నాడు. ఇదిలా వుండగా భారత్ ఈ మ్యాచ్‌లో మార్పులు లేకుండానే రంగంలోకి దిగే అవకాశాలున్నాయి.

ఈసారి కూడా..

ఓపెనర్లు శిఖర్ ధావన్, రోహిత్ శర్మలు మూడో వన్డేలోనూ జట్టుకు శుభారంభం అందించాలనే లక్ష్యంతో ఉన్నారు. కిందటి మ్యాచ్‌లో వీరిద్దరూ అద్భుతంగా ఆడారు. ముఖ్యం రోహిత్ తన మార్క్ బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. ఈ మ్యాచ్‌లో కూడా మెరుగైన ఆటను కనబరిచేందుకు తహతహలాడుతున్నాడు. అతను చెలరేగితే అడ్డుకోవడం లంక బౌలర్లకు కష్టమేనని చెప్పక తప్పదు. మరోవైపు ధావన్ కూడా భీకర ఫాంలో ఉన్నాడు. తొలి వన్డేలో సెంచరీతో కదం తొక్కిన ధావన్ రెండో మ్యాచ్‌లో కూడా అద్భుతంగా ఆడాడు. ఈసారి కూడా జట్టు అతనిపై భారీ ఆశలే పెట్టుకుంది. ఇద్దరూ మరోసారి శుభారంభం అందిస్తే భారీ స్కోరు సాధించడం భారత్‌కు కష్టమేమి కాదు.

ప్రయోగాలు ఉండక పోవచ్చు

రెండో వన్డేలో చేసిన ప్రయోగాలు బెడిసి కొట్టడంతో కెప్టెన్ విరాట్ కోహ్లి దాని జోలికి వెళ్లే అవకాశాలు కనిపించడం లేదు. మార్పులు, ప్రయోగాలు లేకుండానే ఆడడం ఖాయంగా కనిపిస్తోంది. కాగా, లోకేష్ రాహుల్, మనీష్ పాండే, కేదార్ జాదవ్, అజింక్య రహానెల మధ్య తుది జట్టులో స్థానం కోసం ఆసక్తిర పోటీ నెలకొంది. కిందటి మ్యాచ్‌లో కేదార్, రాహుల్‌లు విఫలమయ్యారు. ఈ నేపథ్యంలో వీరిద్దరిలో ఎవరికి స్థానం దక్కుతుందో అంతుబట్టకుండా అంతేగాక, టెస్టు సిరీస్‌లో, విండీస్‌తో జరిగిన వన్డేల్లో సత్తా చాటిన అజింక్య రహానె కూడా జట్టులో స్థానం ఆశిస్తున్నాడు. అయితే కెప్టెన్ కోహ్లి అతని వైపు మొగ్గు చూపుతాడా లేదా అన్నది ఆసక్తి రేకెత్తిస్తున్న అంశం. స్పిన్నర్లు చాహల్, అక్షర్ పటేల్‌లకు జట్టులో చోటు ఖాయంగా కనిపిస్తోంది. రెండు వన్డేల్లో కూడా భారత బౌలర్లు అద్భుతంగా రాణించారు. తొలి వన్డేలో అక్షర్ పటేల్, చాహల్, కేదార్‌లు అద్భుతంగా రాణించారు. ఇక, జస్‌ప్రిత్ బుమ్రా రెండు వన్డేల్లోనూ సత్తా చాటాడు. చివరి వన్డేలో ఏకంగా నాలుగు వికెట్లు తీసి లంకను తక్కువ స్కోరుకే కట్టడి చేశాడు. ఈ మ్యాచ్‌లో కూడా జట్టు అతనిపై భారీ ఆశలు పెట్టుకుంది. మరోవైపు రెండో వన్డేలో భువనేశ్వర్ కుమార్ కీలక దశలో అద్భుత ఇన్నింగ్స్‌తో జట్టును ఆదుకున్న విషయం తెలిసిందే. ఈ మ్యాచ్‌లో కూడా భువి నుంచి జట్టు ఆల్‌రౌండ్ ప్రతిభను ఆశిస్తోంది.

అందరి కళ్లు ధోనీపైనే..

ఈ మ్యాచ్‌లో అందరి కళ్లు మహేంద్ర సింగ్ ధోనీపైనే నిలిచాయి. కిందటి మ్యాచ్‌లో చిరస్మరణీయ ఆటతో భారత్‌ను గెలిపించిన ధోనీ ఈసారి కూడా జట్టుకు కీలకంగా మారాడు. అతని వల్లే రెండో వన్డేలో భారత్ అద్భుత విజయం సాధించిన విషయం తెలిసిందే. భువనేశ్వర్ కుమార్‌లో ఆత్మవిశ్వాసం నింపి అతని అండతో జట్టును విజయతీరానికి చేర్చాడు. ఈ మ్యాచ్‌లో కూడా ధోనీ జట్టుకు కీలకంగా మారాడు. తాను ఎంత విలువైన ఆటగాడో ధోనీ ఒకే ఒక ఇన్నింగ్స్‌తో నిరూపించాడు. ఈసారి కూడా చెలరేగేందుకు సిద్ధంగా ఉన్నాడు.

లంకకు కీలకం

మరోవైపు వరుసగా రెండు మ్యాచుల్లో ఓటమి పాలైన ఆతిథ్య శ్రీలంక జట్టుకు ఈ మ్యాచ్ చావోరేవోగా మారింది. ఇప్పటికే టెస్టు సిరీస్‌లో వైట్‌వాష్‌కు గురైన శ్రీలంకను వన్డే ఓటమి కూడా వెంటాడుతోంది. సిరీస్‌లో నిలువాలంటే ఆదివారం జరిగే మూడో వన్డేలో కచ్చితంగా గెలవాల్సిందే. ఈ మ్యాచ్‌లో ఓడితే సిరీస్‌ను కోల్పోవడం ఖాయం. దీంతో కచ్చితంగా గెలవాల్సిన ఒత్తిడి లంకకు నెలకొంది. ఇక, ఈ మ్యాచ్‌లో ఉపుల్ తరంగ బరిలోకి దిగడం లేదు. అతనికి బదులు కపుగెదెర జట్టుకు సారథ్యం వహిస్తున్నాడు. కాగా, టెస్టు కెప్టెన్ దినేష్ చండీమల్‌కు వన్డే జట్టులో చోటు దక్కింది. దీంతో అతను మూడో వన్డేలో ఆడే అవకాశాలు అధికంగా ఉన్నాయి.

ధనంజయపైనే ఆశలు

ఇక, శ్రీలంక ఆశలన్నీ యువ బౌలర్ అఖిల ధనంజయపైనే నిలిచాయి. రెండో వన్డేలో అసాధారణ బౌలింగ్‌తో భారత్‌ను దాదాపు ఓడించినంత పని చేసిన ధనంజయ ఈసారి కూడా సత్తా చాటేందుకు తహతహలాడుతున్నాడు. అద్భుత బౌలింగ్‌తో భారత బ్యాట్స్‌మెన్‌ను హడలెత్తించిన ధనంజయ మూడో వన్డేలోనూ విజృంభించేందు సిద్ధంగా ఉన్నాడు. అతనిపై లంక భారీ ఆశలే పెట్టుకుంది. ఈసారి కూడా బంతితో చెలరేగితే భారత్‌ను ఇరకాటంలో పెట్టి మ్యాచ్‌ను గెలుచుకోవాలని లంక భావిస్తోంది. ఇక, భారత్ కూడా ధనంజయపై ఎదురు దాడి చేయాలనే లక్ష్యంతో ఉంది. అతనినే లక్ష్యంగా చేసుకుని ముందుకు సాగేందుకు టీమిండియా వ్యూహాలు రచిస్తోంది. అంతేగాక, కిందటి మ్యాచ్‌లో రాణించిన కపుగెదెర, సిరివర్దనే, ఓపెనర్లు డిక్వెలా, గుణతిలకపై కూడా లంకకు భారీ ఆశలే ఉన్నాయి. వీరింత సమష్టి రాణిస్తే భారత్‌ను ఓడించడం కష్టమేమి కాదనే పట్టుదలతో లంక ఉంది.



జట్ల వివరాలు

భారత్ (అంచనా): విరాట్ కోహ్లి (కెప్టెన్), రోహిత్ శర్మ, శిఖర్ ధావన్, కెఎల్.రాహుల్, మహేంద్ర సింగ్ ధోనీ, కేదార్ జాదవ్, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, చాహల్, భువనేశ్వర్, జస్‌ప్రిత్ బుమ్రా.

శ్రీలంక (అంచనా): కపుగెదెర (కెప్టెన్), డిక్వెలా, గుణతిలక, కుశాల్ మెండిస్, మాథ్యూస్, తిసారా పెరీరా, చండీమల్, సిరివర్ధనే, హసరంగ/ధనుంజయ, లసిత్ మలింగ, విశ్వ ఫెర్నాండో.

సెమీస్‌లో సైనా ఓటమి

• కాంస్యంతో సరి, ప్రపంచ బ్యాడ్మింటన్

గ్లాస్గో: ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో భారత స్టార్ సైనా నెహ్వాల్ సెమీఫైనల్లోనే ఇంటి దారి పట్టింది. దీంతో సైనా కాంస్య పతకంతోనే సరిపెట్టుకుంది. శనివారం హోరాహోరీగా సాగిన సెమీఫైనల్లో సైనా 21–12, 17–21, 10–21 తేడాతో జపాన్ క్రీడాకారిణి నొజొవా ఒకుహర చేతిలో కంగుతింది. సునాయాసంగా గెలవాల్సిన మ్యాచ్‌లో సైనా వరుస తప్పిదాలతో ఓటమిని కొని తెచ్చుకుంది. ప్రారంభం నుంచే సైనా దూకుడైన ఆటతో ఆకట్టుకుంది. చూడచక్కని షాట్లతో ప్రత్యర్థిని హడలెత్తిస్తూ ముందుకు సాగింది. తొలి గేమ్‌లో సైనాకు ఎదురే లేకుండా పోయింది. భారత షట్లర్ తన మార్క్ ఆటతో ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. ఈ సెట్‌లో సైనా పెద్దగా ప్రతిఘటన ఎదుర్కొకుండానే విజయం సాధించింది. దీంతో రెండో గేమ్‌కు మరింత ఆత్మవిశ్వాసంతో సిద్ధమైంది. ఊహించినట్టే ప్రారంభంలో సైనా ఆధిపత్యం చెలాయించింది. కానీ, కీలక సమయంలో ఒత్తిడికి గురైంది. ప్రత్యర్థి క్రీడాకారిణి ఒత్తిడిని తట్టుకుంటూ సైనాకు గట్టి పోటీనే ఇచ్చింది. దీంతో సైనా ఆట గాడి తప్పింది. అనవసర తప్పిదాలకు పాల్పడింది. దీన్ని తనకు అనుకూలంగా మార్చుకున్న జపాన్ స్టార్ ఒకుహర రెండో సెట్‌ను సొంతం చేసుకుంది. ఇక, ఫలితాన్ని తేల్చే మూడో గేమ్‌లోనూ ఒకుహర ఆధిపత్యం చెలాయించింది. సైనాకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా ఆడుతూ లక్ష్యం దిశగా సాగింది. చివరి వరకు జోరును కొనసాగిస్తూ సెట్‌ను గెలిచి ఫైనల్‌కు దూసుకెళ్లింది.



శ్రీకాంత్ ఔట్..

మరోవైపు పురుషుల సింగిల్స్‌లో భారత స్టార్ కిదాంబి శ్రీకాంత్ క్వార్టర్ ఫైనల్లోనే ఓటమి పాలయ్యాడు. భారత్‌కు కచ్చితంగా పతకం అందిస్తాడని భావించిన తెలుగుతేజం శ్రీకాంత్ హోరాహోరీగా సాగిన క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ నంబర్‌వన్ సన్ వాన్ హో (కొరియా) చేతిలో ఓటమి పాలయ్యాడు. వాన్ హోకు గట్టి పోటీ ఇచ్చిన శ్రీకాంత్ చివరి వరకు పోరాడి ఓడాడు. ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో వాన్ 21–14, 21–18 తేడాతో శ్రీకాంత్‌ను ఓడించాడు.

సెమీస్‌లో సింధు..

మహిళల సింగిల్స్‌లో భారత అగ్రశ్రేణి క్రీడాకారిణి పి.వి.సింధు సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. క్వార్టర్ ఫైనల్లో సింధు 21–14, 21–9 తేడాతో చైనా షట్లర్ సన్ యూపై విజయం సాధించింది. ప్రారంభం నుంచే తనదైన ఆటతో చెలరేగిన సింధు ప్రత్యర్థిని చిత్తు చేసింది. చూడచక్కని షాట్లతో చెలరేగిన సింధు వరుసగా రెండు సెట్లు గెలిచి సెమీస్‌కు చేరింది. ఈ విజయంతో సింధుకు కాంస్య పతకం ఖాయమైంది.

తలైవాస్‌పై పట్నా గెలుపు

ముంబయి: ప్రొ కబడ్డీ ఐదో సీజన్‌లో పట్నా పైరెట్ మరో విజయం సాధించింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో పట్నా 35–24 తేడాతో తమిళ్ తలైవాస్ జట్టును చిత్తు చేసింది. ఇప్పటివరకు ఈ సీజన్‌లో ఏడు మ్యాచ్‌లు ఆడిన పట్నాకు ఇది నాలుగో విజయం కావడం విశేషం. ప్రారంభం నుంచే పట్నా ఈ మ్యాచ్‌లో ఆధిపత్యం చెలాయించింది. ప్రత్యర్థి జట్టును ఉక్కిరిబిక్కిరి చేస్తూ ముందుకు సాగింది. కెప్టెన్ ప్రదీప్ నర్వల్, స్టార్ ఆటగాడు మోను గోయట్‌లు అద్భుత ఆటతో జట్టుకు అండగా నిలిచారు. వీరికి జైదీప్ కూడా సహకారం అందించాడు. అద్భుతంగా ఆడిన గోయట్ ఏకంగా 11 పాయింట్లు సాధించి పట్నాను ఆదుకున్నాడు. కెప్టెన్ ప్రదీప్ ఆరు పాయింట్లతో తనవంతు పాత్ర పోషించాడు. జైదీప్ ఐదు పాయింట్లను అందించాడు. మరోవైపు తమిళ్ జట్టులో అజయ్ ఠాకూర్ అసాధారణ ఆటతో చెలరేగి పోయాడు. ప్రత్యర్థి జట్టుపై ఎదురుదాడికి దిగిన అజయ్ ఏకంగా 10 పాయింట్లు సాధించాడు. మిగతావారు విఫలం కావడంతో తలైవాస్‌కు ఓటమి తప్పలేదు.

ముంబాకు పల్టాన్ షాక్

మరో మ్యాచ్‌లో పుణెరి పల్టాన్ విజయం సాధించింది. హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో పుణెరి 26–24 పాయింట్ల తేడాతో ఆతిథ్య యూ ముంబా జట్టును ఓడించింది. ప్రారంభం నుంచే మ్యాచ్ నువ్వానేనా అన్నట్టు సాగింది. రెండు జట్లు కూడా ప్రతి పాయింట్ కోసం సర్వం ఒడ్డాయి. దీంతో పోరు యుద్ధాన్ని తలపించింది. చివరి వరకు ఆధిపత్యాన్ని కాపాడుకున్న పుణెరి జట్టు జయకేతనం ఎగుర వేసింది. పుణెరి జట్టులో దీపక్ హుదా అద్భుతంగా ఆడాడు. చూడచక్కని ఆటతో దీపక్ 8 పాయింట్లను సాధించి పుణెరి విజయంలో కీలక పాత్ర పోషించాడు. రాజేష్ నాలుగు, సందీప్ మూడు పాయింట్లు సాధించి తమవంతు సహకారం అందించారు. మరోవైపు ముంబా జట్టులో కషిలింగ్ అడాకె ఏడు, శ్రీకాంత్ ఐదు పాయింట్లు సాధించిన ఫలితం లేకుండా పోయింది.




Lalithaa™

హైదరాబాద్ • తిరుపతి • విశాఖపట్నం • చెన్నై • మధురై • తిరుచ్చి • పుదుచ్చేరి • కుంభకోణం • బెంగళూరు • రామనాథపురం • కోయంబత్తూరు

34 ఏళ్లకు పైగా, నగల సామ్రాజ్యంలో ఉన్నత సంప్రదాయాలతో, చేతిరాశికి ప్రతిరూపంగా నిలుస్తూ.. దక్షిణ భారతదేశంలోనే అగ్రగామిగా భాసిల్లుతున్న లలితా జ్యూవెల్లరి మీ శుభాశిస్సులతో తెలంగాణలో అడుగిడుతోంది.

హైదరాబాద్, సోమాజిగూడలోని మా కొత్తషోరూంకు సుస్వాగతం!

జ్యోతి ప్రజ్వలన



శ్రీ బండారు దత్తాత్రేయ గారు
కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి వర్యులు.

గౌరవ అతిథులు



శ్రీ డా॥ టి.సుబ్బరామిరెడ్డి గారు
పార్లమెంటు సభ్యులు మరియు ఛైర్మన్ కమిటీ ఆన్ సబార్డినేట్ లెజిస్లేషన్, రాజ్యసభ.



శ్రీ నాయిని నర్సింహారెడ్డి గారు
హోం, కార్మిక శాఖ మంత్రి వర్యులు, తెలంగాణ.



శ్రీ చింతల రామచంద్రారెడ్డి గారు
శాసనసభ సభ్యుడు, ఖైరతాబాద్.



శ్రీ దిలీప్ చాబ్రియా గారు
ఛైర్మన్, డీసీ డిజైన్ ప్రై. లిమిటెడ్.



శ్రీ డా॥ ఐసరి కె.గణేశ్ గారు
ఛైర్మన్, వేల్స్ విశ్వవిద్యాలయం, చెన్నై.



శ్రీ కె.టి.శ్రీనివాస రాజా గారు
మేనేజింగ్ డైరెక్టర్, అడయార్ ఆనందభవన్ (ఏ2బి).

అధిక తరుగు నుండి స్వాతంత్ర్యం

అన్ని ఆభరణాల శ్రేణిపై ఆశ్చర్యపోయేరీతిలో అతి తక్కువ తరుగు!

కేవలం 1 నుంచి 9% వరకు తరుగు. కొన్ని ఆభరణాలకు మాత్రమే 10 నుంచి 16%. చైన్లు 3% నుంచి తరుగు | గాజులు 4% నుంచి తరుగు.

మీరు మునుపెన్నడూ చూడని ఆకట్టుకునే లక్షలాది డిజైన్లతో లెక్కలేనన్ని కౌంటర్లు. తయారీ ధరకే.. బంగారు, వజ్రాభరణాలు..!

ప్రారంభోత్సవం సందర్భంగా ప్రత్యేక సదుపాయం

అన్ని బంగారు నగలకు **తరుగులో 1% రాయితీ** | అన్ని వజ్రాభరణాలకు క్యారెట్‌కు **రూ.2000 తగ్గింపు**

ఇది అత్యంత పరిమితకాలమే !

బంగారం, వజ్రం,
వెండి, ప్లాటినం
ఆభరణాల మహా సామ్రాజ్యం.

BIS 916 హాల్‌మార్క్
లక్షలాది డిజైన్లు !



www.lalithaajewellery.com

వజ్రాభరణాలు క్యారెట్‌కు రూ.48000 నుంచి
V.A గ్రాముకు రూ.975 మాత్రమే

స్వర్ణ ఉదయం
11 నెలల 'నగల కొనుగోలు పథకం'
మొదటినెల వాయిదా ఉచితం !
100% తరుగు లేదు.

అడ్వాన్స్ నగల బుకింగ్ స్కీమ్
ఒకసారి నగదు చెల్లించి తరుగు లేకుండా 7 నెలల తర్వాత మనసుకు నచ్చిన నగలను కొనొచ్చు.
100% తరుగు లేదు
పాత నగలు ఇచ్చి కూడా ఈ స్కీమ్‌లో చేరొచ్చు.

6-3-883, SBR సౌక్, రాజీవ్‌గాంధి విగ్రహం ఎదురుగా, సోమాజిగూడ, హైదరాబాద్. ఫోన్: 040 - 6748 6677.

Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.